www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 356

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 9.32 వరకు తదుపరి చవితి; నక్షత్రం: విశాఖ రా. 9.55 తదుపరి అనూరాధ; వర్జ్యం: శే. ఉ. 6.45 వరకు రా. 1.37-3.06; దుర్ముహూర్తం: ఉ. 8.35-9.24, మ. 12.42-1.31; అమృతఘడియలు: మ. 1.58-3.25; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.27

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

వరల్డోమీటర్ ప్రకారం గురువారం రాత్రి 11:30 గంటలకు

| | మొత్తం కేసులు | కొత్త కేసులు | మొత్తం మృతులు | ఒక్కరోజులో మృతులు |
|---|---|---|---|---|
| ప్రపంచం | 15,76,496 | 58,536 | 93,575 | 5,120 |
| భారతదేశం | 5,865 | 591 | 169 | 20 |
| ఆంధ్రప్రదేశ్ | 363 | 15 | 6 | 1 |
| తెలంగాణ | 471 | 18 | 12 | 1 |
| అమెరికా | 4,54,615 | 19,688 | 16,074 | 2,000 |
| స్పెయిన్ | 1,52,446 | 4,226 | 15,238 | 446 |
| ఇటలీ | 1,43,626 | 4,204 | 18,279 | 610 |

## వైద్య సిబ్బందికి వందనాలు

కారే ఆయన ఇల్లు



ఈయన భోపాల్ ఆస్పత్రి డాక్టర్ సచిన్ నాయక్. పుస్తకం చదువుతూ సేదతీరుతోంది ఇంట్లో కాదు.. కారులో! వారం రోజులుగా తన కారునే నివాసంగా మార్చుకున్నారు. కరోనా రోగులకు చికిత్స చేస్తుండటంతో కుటుంబ సభ్యులకు వైరస్ సోకుతుందేమోనన్న భయంతో కారులోనే ఉంటున్నారు.

### • అమ్మా చూడాలీ..

బెంగళూరు బిమ్స్ ఆస్పత్రి ఐసొలేషన్ వార్డులో కరోనా రోగులకు సేవలందిస్తున్న నర్సు సుగంధ ఇంటికి రాక 15 రోజులైంది. ఆమె మూడేళ్ల పాప అన్నం తినడం మానేసి అమ్మ కోసం ఏడుస్తుండటంతో తండ్రి శ్రీకాంత్ పాపను బైక్ మీద కూర్చోబెట్టుకొని నర్సులు బస చేస్తున్న హోటల్ వద్దకు తీసుకొచ్చాడు. బిడ్డను చూసిన సుగంధ కళ్లవెంట ధారగా కన్నీళ్లు. ఎత్తుకో అమ్మా అంటూ పాప రెండు చేతులూ జాపినా ఎలా ఎత్తుకోగలదు? దూరం నుంచే పాపను చూసుకుని ఓదార్చి కన్నీళ్లతో లోపలికి వెళ్లిపోయింది!



### • అమ్మను చూడలేను..



ఆర్ఎం మీనా! జైపూర్ ఎస్ఎమ్మెస్ ఆస్పత్రిలో కరోనా రోగులకు సేవలు చేస్తున్న మేల్ నర్సు. విధుల్లో ఉన్నపుడే సొంతూర్లో ఉంటున్న 93 ఏళ్ల తల్లి చనిపోయిందని తెలిసింది. తల్లిని కడసారి చూసుకోవాలి.. ఎలా? కరోనా రోగులకు సేవలు చేసే సిబ్బంది బయటకు వెళ్లే వీలు లేదాయె. అంత్యక్రియలను వీడియో కాల్ ద్వారా చూసి తల్లికి తుది వీడ్కోలు పలికారు.

# మన ఏరియా సేఫ్!

## మలేరియా ప్రభావిత దేశాలకు కరోనా ముప్పు తక్కువే

- మలేరియా తరహాలోనే కరోనా దాడి
- హిమోగ్లోబిన్ నుంచి ఐరన్‌ను వేరు చేసే వ్యాధి
- ఐరన్ లేక ఆక్సిజన్ సరఫరాకు తీవ్ర ఆటంకం
- అందుకే మలేరియా మందులు పనిచేస్తున్నాయి
- చైనా శాస్త్రజ్ఞుల పరిశోధనలో ఆసక్తికర విషయాలు
- ఆసియా, ఆఫ్రికా ప్రజల్లో మలేరియా నిరోధకత
- మనను కరోనా నుంచి రక్షిస్తున్నదీ అదే

అమెరికాను, అభివృద్ధి చెందిన యూరప్ దేశాలను చిగురుటాకుల్లా వణికిస్తున్న కొవిడ్-19.. మనదేశానికి మాత్రం ఆ స్థాయి పెనుముప్పుగా పరిణమించట్లేదు! కారణం ఏంటి? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనేందుకు పలు పరిశోధనలు జరుగుతున్నాయి. 'ఇదీ కారణం' అంటూ పలు ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. మలేరియా ప్రభావం ఎక్కువగా ఉండే దేశాల్లో కరోనా ప్రభావం తక్కువగా ఉంటోందన్నది వాటిలో ముఖ్యమైనది. మలేరియా కేసులు ఎక్కువగా ఉండే ఆసియా, ఆఫ్రికా దేశాల్లో కరోనా కేసుల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు నిదర్శనం అని ఈ ప్రతిపాదన చేస్తున్నవారు చెబుతున్నారు. ప్రపంచంలోని ఉష్ణమండల దేశాలు.. అంటే, భూమధ్య రేఖకు పైన కర్కాటక రేఖ నుంచి కింద మకర రేఖ దాకా ఉన్న దేశాలన్నీ మలేరియా ప్రభావిత దేశాలు. ఆ దేశాల్లో కొన్ని వందల ఏళ్లుగా మలేరియా ఉంది. దీంతో, ఆయా దేశాల ప్రజల జన్యువుల్లో దానికి సంబంధించిన ఉత్పరివర్తనాలు (జెనెటిక్ మ్యుటేషన్) జరిగి మలేరియా నిరోధకత పెరిగింది. అదే నిరోధకత కరోనా నుంచి కూడా వారిని కాపాడుతోందన్నది ఈ ప్రతిపాదన చేస్తున్నవారి విశ్లేషణ. అదే.. కర్కాటక రేఖకు పైన, మకర రేఖకు కింద ఉండే దేశాల్లో మలేరియా సమస్య లేదు. కాబట్టి, మలేరియా నిరోధకత వారిలో లేదని వారు చెబుతున్నారు. అందుకే.. అమెరికన్లు, యూరోపియన్లపై కరోనా ప్రభావం ఎక్కువగా ఉంటోందని విశ్లేషిస్తున్నారు. వారి ప్రతిపాదనకు బలం చేకూర్చే ఆసక్తికరమైన పరిశోధన ఒకటి చైనాలో జరిగింది.




ఇందులో లేత పసుపు రంగు ఉన్న దేశాల్లో.. లక్షకు పది కన్నా తక్కువ మలేరియా కేసులు నమోదవుతాయి. ముదురు ఎరుపు రంగు ఉన్న దేశాల్లో లక్షకు 25 వేల మంది కన్నా ఎక్కువగా మలేరియా బారిన పడుతున్నారు. లక్షకు 100 నుంచి 1000 మలేరియా కేసులు మనదేశంలో నమోదవుతాయని డబ్ల్యూహెచ్‌వో అంచనా.

### భారతీయుల్ని కాపాడుతున్న మైక్రో ఆర్ఎన్ఏ

భారతీయుల్లో ఉండే 'హెచ్ఎస్ఏ-ఎంఐఆర్-27బి' అనే ఒక ప్రత్యేకమైన మైక్రో ఆర్ఎన్ఏ కారణంగానే మనదేశంలో కొవిడ్-19 తీవ్రత తక్కువగా ఉందని ఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజనీరింగ్ అండ్ బయో

మిగతా 2వ పేజీలో...

కరోనా మన శరీరంలోకి ప్రవేశించాక ఊపిరితిత్తులపై దాడి చేస్తుందని, ఇది శ్వాసకోశ వ్యాధి అని శాస్త్రజ్ఞులు, వైద్యనిపుణులు భావిస్తున్నారు. కానీ, అది ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని ఇతర అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసే కీలక వాహకమైన హిమోగ్లోబిన్‌పై (ఎర్ర రక్త కణాల్లో ఉండే ప్రొటీన్ మాలిక్యూల్) దాడి చేస్తుందని, ఆక్సిజన్ సరఫరాకు ఆటంకం కలిగిస్తుందని తమ పరిశోధనలో తేలినట్లు.. చైనాలోని సిచువాన్ యూనివర్సిటీ, యిబిన్ యూనివర్సిటీలకు చెందిన వెన్ ఝూంగ్ లియు, హువాలాన్ లి అనే ఇద్దరు పరిశోధకులు ప్రకటించారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. కరోనా వైరస్‌లోని ఓఆర్ఎఫ్ 8, సర్ఫేస్ గ్లైకో ప్రొటీన్ హిమోగ్లోబిన్‌పై ఉండే హీమ్స్‌కు అతుక్కుంటాయి. హీమ్స్ అంటే.. ఐరన్ అయాన్ ఉండే పోర్ఫిరిన్స్. కొవిడ్-19 మనశరీరంలోకి ప్రవేశించాక ఆ వైరస్‌పై ఉండే సర్ఫేస్ గ్లైకో ప్రొటీన్ ఈ ఐరన్ అయాన్‌ను హీమ్స్ నుంచి తొలగిస్తుంది. ఐరన్ అయాన్ లేని

మిగతా 2వ పేజీలో...

### రుమటాయిడ్ బాధితులకు తీవ్ర ఇబ్బందులు

హైడ్రాక్సీ క్లోరోక్విన్ దొరక్క అవస్థలు

ఆస్పత్రుల్లోని ఫార్మసీల్లోనూ ఇదే పరిస్థితి

8





నెల్లూరు జిల్లా కోటలో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోకుండా అవస్థలు పడుతున్న అన్నదాతలు

## వాన పోటు.. పిడుగు పాటు

# 14 మంది మృతి

### వేలాది ఎకరాల్లో వరిపంటకు నష్టం

### పిడుగుపాటుకు 10 మంది దుర్మరణం

కృష్ణా జిల్లాలో పడవ బోల్తా.. నలుగురు మృతి.. ఇద్దరు గల్లంతు

కల్లాల్లోనే ముద్దయిన మిరప.. నేలరాలిన అరటి, మామిడి, నిమ్మ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కరోనాతో అష్టకష్టాలు పడుతున్న రైతన్నపై అకాల వర్షాల పిడుగు పడింది. ధరలు పతనమై, కోతలూ కోయలేని పరిస్థితిలో ఉన్న అన్నదాతను మరింత కుంగదీసింది. గురువారం కురిసిన అకాల వర్షాలకు భారీగా ప్రాణ, పంటనష్టం జరిగింది. రాష్ట్రంలో మూడు జిల్లాల్లో పిడుగులు పడి పదిమంది మరణించగా, వర్షంతో పడవ మునిగి కృష్ణాజిల్లాలో ఆరుగురు గల్లంతయ్యారు. ఇప్పటికి నలుగురి మృతదేహాలు లభ్యం కాగా మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఇక అరటి, వరితో పాటు

మిగతా 3వ పేజీలో...



కడప జిల్లా వేంపల్లెలో నేలకొరిగిన అరటి

## లాక్‌డౌన్‌తో సత్ఫలితాలు

మరికొన్ని రోజులు పొడిగించాలి

పేదలు, కూలీలకు 5 వేలివ్వాలి

వైద్య సిబ్బందికి ఏదైనా అయితే రూ. 50 లక్షల పరిహారమివ్వాలి

వర్సిటీల పాలక మండళ్ల నియామకాలు రద్దు చేయాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి లాక్‌డౌన్‌ను దేశవ్యాప్తంగా మరికొన్ని రోజులు పొడిగిస్తే మంచిదని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో కేంద్రానికి సూచించింది. ప్రస్తుతం అమలవుతున్న లాక్‌డౌన్ మంచి ఫలితాలే ఇస్తోందని.. ఇప్పుడు సడలిస్తే వచ్చిన ప్రయోజనం కూడా చేజారే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఆ పార్టీ

మిగతా 7వ పేజీలో...

### నాడు మయసభ అన్నారు

నేడు అదే నోటితో మెచ్చుకుంటున్నారు

విశాఖ మెడ్‌టెక్ జోన్‌పై సీఎం జగన్‌కు చంద్రబాబు లేఖ 7

### లాక్‌డౌన్ తర్వాతే వైఫల్యాలపై మాట్లాడదాం

విపత్కర తరుణంలో విమర్శలొద్దు: పవన్ 3

## రోజుకు 2 వేలు

అమెరికాలో పెరుగుతున్న కరోనా మరణాలు

మొత్తం 14,555 మృతులు.. 4.1లక్షల కేసులు

ఇందులో సగంపైగా న్యూయార్క్ రాష్ట్రంలోనే

బ్రిటన్‌లో ఒక్కరోజే 938 మరణాలు 8

స్పెయిన్, ఇటలీని మించి ఇంగ్లండ్‌లో మృతులు



న్యూయార్క్‌లో ఒక చర్చిని తాత్కాలిక ఆస్పత్రిగా మార్చుతున్న దృశ్యం

### 24 గంటల్లో 591

భారత్‌లో 5,865కు పెరిగిన కేసులు

169కు చేరిన మరణాల సంఖ్య

20 సంస్థల నుంచి పీపీఈలు: కేంద్రం

రాష్ట్రాలకు రూ.15 వేల కోట్ల విడుదలకు కేంద్రం ఆమోదం 8

ఒడిసాలో 30 వరకు లాక్‌డౌన్

పెట్రోల్, డీజిల్‌కు తగ్గిన డిమాండ్

దేశంలో వినియోగం 66% తగ్గుదల



## రూపాయి రాలేదు

అకౌంట్లన్నీ ఫ్రీజ్ చేసేశారు

మాస్కులు, పీపీఈ డ్రెస్సులు లేవు

గ్లౌజులు లేవు.. బూట్లూ లేవు

రోజా ఒక్కరే ఆదుకుంటున్నారు

మిగిలిన వాళ్లవి ప్రగల్భాలే

ప్రభుత్వంపై నగరి కమిషనర్ ధ్వజం

తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): "ఎన్నో అగచాట్లు పడి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాలేదు. అకౌంట్లన్నీ ఫ్రీజ్ చేశారు. మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మాస్కులు రాలేదు. పీపీఈ డ్రెస్సులూ రాలేదు. గ్లౌజులు లేవు.. బూట్లూ లేవు"... ఇవి చిత్తూరు జిల్లా నగరి మునిసిపల్ కమిషనర్ వెంకట్రామి రెడ్డి మాటలు! ఆయన స్వయంగా సెల్ఫీ వీడియో తీసి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. స్థానిక

మిగతా 3వ పేజీలో...

## నివురుగప్పిన నిప్పులా...

■ క్షేత్రస్థాయి పరిస్థితులపై సందేహాలు

అనుమానితులు వేలల్లో... పరీక్షలు వందల్లో

మూడోసర్వేలో 12,311 అనుమానితులు

వీరిలో 1754 మంది గృహ నిర్బంధం

26 మందికే కరోనా పరీక్షల నిర్వహణ

ఫలితంగా వాస్తవ పరిస్థితిపై అస్పష్టత

ఇతర రాష్ట్రాల్లో వేల మందికి పరీక్షలు

అందుకు అనుగుణంగానే కేసులు బహిర్గతం

### ఒకే కుటుంబంలో నలుగురికి

ప్రకాశంలో 11 మందికి వైరస్

రాష్ట్రంలో 15 కొత్త కేసులు

363కి చేరిన కరోనా కేసులు

గుంటూరులో తొలి మరణం

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో కరోనా విజృంభణ నెమ్మదిగా ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలియచేస్తున్నాయి. వాస్తవంగా క్షేత్రస్థాయి పరిస్థితి ఇలాగే ఉందా? అంటే... చెప్పలేని పరిస్థితి! పొరుగు రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు చేస్తున్న కరోనా నిర్ధారణ పరీక్షలు అధికంగా ఉన్నాయి. వాటికి తగ్గట్లే అక్కడ కేసులు కూడా ఎక్కువగా బయటపడుతున్నాయి. కానీ, రాష్ట్రంలో పరీక్షలు తక్కువగా జరుగుతున్నాయి. అందుకు అనుగుణంగానే తక్కువగా కేసులు నమోదవుతున్నాయని, వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ మూడుసార్లు సర్వే నిర్వహించింది. మూడోదశ

మిగతా 7వ పేజీలో...



### పోలీసులు కొట్టరు.. హద్దు మీరితే కేసులే

ప్రజలు ఇంట్లో ఉంటూ సహకరిస్తే చాలు 7

లాక్‌డౌన్ పొడిగిస్తే... మన ప్రాణాల కోసమే

'ఆంధ్రజ్యోతి'తో డీజీపీ సవాంగ్ ముఖాముఖి



పరంజ్యోతి

# భక్తిశ్రద్ధలే విజయ రహస్యాలు



ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరాలనుకున్న ప్రతి వ్యక్తీ కష్టాన్ని ఇష్టంగా స్వీకరించి, ప్రేమతో ఆస్వాదిస్తూ ప్రతి కదలికలో పరిణతి సాధిస్తూ ముందుకు వెళతాడు. భౌతిక ఆధ్యాత్మిక జీవితాలలో ఎదుగుదలను, అభివృద్ధిని, అభ్యుదయాన్ని, చివరగా సంతృప్తితో కూడిన విజయాన్ని ఆస్వాదిస్తాడు. భక్తిశ్రద్ధలతో ఆచరించే పని ఏదైనా విజయాన్నిస్తుంది. భగవంతుని పట్ల త్రికరణశుద్ధిగా ఆర్ద్రత, విజ్ఞత, కృతజ్ఞతలతో చూపే సమర్పణ భావాన్ని 'భక్తి' అంటాము. భగవంతుని అనుగ్రహాన్ని స్వీకరించేందుకు హృదయాన్ని సన్నద్ధంగా ఉంచడమే 'శ్రద్ధ'. శ్రద్ధ వల్ల ఆసక్తి, ఆసక్తి వల్ల నేర్చుకోవాలనే తపన.. పెరుగుతాయి. నేర్చుకోవడం వల్ల పరిమితులు చెదిరిపోతాయి. భగవద్గీత వ్యక్తి స్వభావానుసరణంగా సాత్విక, రాజస, తామస శ్రద్ధలను పరిచయం చేస్తూ ఆయా శ్రద్ధలు కలవారిని దేవతలు, యక్షులు, రాక్షసులుగా విభాగిస్తుంది.

ఆధ్యాత్మిక విజయ సాధనా ప్రస్థానంలో ప్రముఖమైనది క్రమశిక్షణ. వ్యక్తిగత క్రమశిక్షణ, ఆలోచనలో పరిణతితో కూడిన క్రమశిక్షణ, చేసే పనిలో నిబద్ధతతో కూడిన క్రమశిక్షణ. ఈ మూడు అంశాలలో క్రమశిక్షణ పాటించగలిగిన వ్యక్తులే ఉన్నతస్థితిని సాధించగలుగుతారు. ఆ క్రమశిక్షణయే తపనను పెంచుతుంది ఆ తపన అన్వేషణకు మార్గం చూపుతుంది. అన్వేషణ ప్రజ్ఞను జాగృతం చేస్తుంది. నిజానికి ప్రజ్ఞ గొప్పదే కాని ప్రజ్ఞకన్నా అనుభూతి, అనుభూతి కన్నా అనుభవం, అనుభవంకన్నా అభివ్యక్తి ఉన్నతమైనవి. ఆ అభివ్యక్తి భక్తిశ్రద్ధలతో కలిస్తే భగవంతునికి దగ్గరగా తీసుకువెళుతుంది.

ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనా ప్రక్రియలో ఎదుర్కొన్న క్లిష్ట సమయాలు, సంక్షోభాలు.. ధైర్యంతో వాటినధిగమించిన విధానం మాత్రమే ఆ వ్యక్తి స్థానాన్ని నిర్ధారిస్తాయి. సమర్థుడైన గురువు సూచించిన మార్గంలో భక్తిశ్రద్ధలతో సాధన చేయడం, ఆత్మపరిశీలన, సమీక్షించుకోవడం, లోపాలను సరిచేసుకోవడం అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవడం వల్ల విజయసాధన సులువవుతుంది. అవే.. వ్యక్తిని విపత్కర పరిస్థితులలో కూడా రక్షించి విజయానికి అవకాశాలను సృష్టిస్తాయి.

మన ప్రయత్నంలో మనకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన వారికి వాక్కు, మనస్సు, కర్మల ద్వారా కృతజ్ఞతలు తెలుపుకోవడం మన విజయ సాధనలో ప్రముఖమైనది. ఆ ప్రక్రియలో మూడు ముఖ్యమైన అంశాలను గుర్తించాలి. మొదటిది ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మనకు సహాయపడిన ప్రతి వ్యక్తి సహకారాన్నీ గుర్తించడం.. అందుకు వారికి కృతజ్ఞతలు చెప్పుకోవడం. రెండవది... వారిని జ్ఞాపకం పెట్టుకోవడం. అంటే వారి సహకారానికి హృదయపూర్వకంగా స్పందించడం. మూడవది వారికి అవసరమైన సమయంలో మన శక్తి మేరకు సహకరించడం. మొదటిది వాచ్యం, రెండవది హృదయం ద్వారా స్పందించడం, మూడవది కర్మ ద్వారా ఆచరించడం.. ఈ ప్రక్రియ భౌతిక జీవితంలో కూడా విజయాన్ని ఇస్తుంది. దీనినే భక్తి శ్రద్ధలుగా చెప్పుకుంటాము.

**- పాలకుర్తి రామమూర్తి, 9441666943**

## లోకం తీరు




## ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 36.6 | 25.0 |
| రాజమండ్రి | 35.0 | 22.0 |
| విజయనగరం | 34.0 | 24.0 |
| విశాఖపట్నం | 34.0 | 25.2 |
| విజయవాడ | 33.0 | 23.8 |
| శ్రీకాకుళం | 33.0 | 26.0 |
| ప్రకాశం | 31.0 | 23.4 |

## రెండు రోజుల్లో భారీవర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితి తో గురువారం దక్షిణ కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల స్వల్ప, భారీ వర్షాలు కురిశాయి. రెండు రోజుల్లో కోస్తాలో పలుచోట్ల పిడుగులతో వర్షాలు.. ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. రెండు, మూడు రోజుల తరువాత వర్షాలు తగ్గిపోతాయని, ఎండ తీవ్రత పెరుగుతుందని పేర్కొంది.

# కేంద్రం ఖర్చులో కోత

- వ్యయంపై 15-20 శాతం నియంత్రణ
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఎంపీల జీత భత్యాల్లో కోత విధించిన కేంద్రం ఖర్చులను మరింత తగ్గించుకునే ప్రయత్నాన్ని ముమ్మరం చేసింది. బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధుల్లో 15 - 20% వరకు ఖర్చుపై కేంద్ర ఆర్థిక శాఖ నియంత్రణ విధించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఆఫీస్ మెమొరాండం జారీ చేసింది. కేంద్రంలోని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఇతర సంస్థలను 3 కేటగిరీలుగా విభజించింది. కేటగిరి 'ఏ' పేర్కొన్న 18 శాఖలు, విభాగాలు తమకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోంచుకునే వెసులుబాటును కల్పించింది. కేటగిరి 'బీ'లో చేర్చిన 33 శాఖలకు 20%, కేటగిరి 'సీ' లో చేర్చిన 50కి పైగా శాఖలకు 15% నియంత్రణ విధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. లాక్‌డౌన్ కారణంగా మొదటి త్రైమాసికంలో రాబడిపై ప్రతికూల ప్రభావం ఉండే అవకాశం ఉందని, అందువల్ల ఈ నిర్ణయం తీసుకోవల్సి వచ్చిందని ఆర్థిక శాఖ వివరించింది. కరోనాను అరికట్టడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న శాఖలు, ఇతర ఎమర్జెన్సీ విభాగాలకు ఖర్చులో నియంత్రణ విధించలేదు. వీటిలో ఆరోగ్య శాఖ, ఆయూష్ శాఖ, వినియోగదారుల వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, రైల్వే, పౌరవిమానయాన శాఖ, ఫార్మాసూటికల్ విభాగంతో పాటు రాష్ట్రాలకు కేంద్ర నిధుల బదిలీ, సుప్రీంకోర్టు, సీవీసీ, యూపీఎస్సీ, రాష్ట్రపతి భవన్ ఉన్నాయి. కేటగిరి బీ లో విదేశీ వ్యవహారాలు, హోం, కేబినెట్, పోస్టల్, ఎరువులు, రోడ్డు రవాణా, రక్షణ, రెవెన్యూ, ఆర్థిక వ్యవహారాలు, పెట్రోలియం శాఖలతో పాటు లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు, ఉపరాష్ట్రపతి భవన్ తదితర శాఖలు, సంస్థలు ఉన్నాయి. కేటగిరీ సీ జాబితాలో వాణిజ్య, టెలికాం, ఐటీ, పర్యావరణ, ఆహార శుద్ధి, పశుసంవర్ధక, తాగునీరు, పారిశుధ్యం, న్యాయ, మానవ వనరుల అభివృద్ధి శాఖలు ఉన్నాయి.

# మన ఏరియా సేఫ్!

(మొదటిపేజీ తరువాయి)

హిమోగ్లోబిన్.. లోపల మందు లేని డొల్ల టాబ్లెట్‌లాంటిది. సరుకు పెట్టుకునే క్యాబిన్ లేని రవాణా లారీ లాంటిది. దాని వల్ల ఏ ఉపయోగమూ ఉండదు. వైరస్ సోకినవారిలో ఇలా ఐరన్ అయాన్ లేని ప్రొటీన్ మాలిక్యూల్స్ (హిమోగ్లోబిన్) ఊరకనే శరీరమంతటా తిరుగుతూ ఉంటాయి. వాస్తవానికి వాటి పని.. ఊపిరితిత్తుల నుంచి శరీరభాగాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేయడం. ఐరన్ అయాన్ లేని కారణంగా అవి ఆ పని చేయలేవు. దీంతో.. వైరస్ సోకినవారిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతుంటాయి. శరీరానికి తగినంత ఆక్సిజన్ లభించక బాధితులు ఎగశ్వాసతో ఇబ్బంది పడతారు. వెంటనే వైద్యులు వారికి వెంటిలేటర్ పెడతారు. కానీ, సమస్య ఊపిరితిత్తుల్లో కాదని.. ఎర్రరక్త కణాలు తగినంత ఆక్సిజన్‌ను సరఫరా చేయకపోవడమేనని చైనా పరిశోధకులు చెబుతున్నారు. సమస్య ఒకటైతే చికిత్స వేరేదానికి ఇవ్వడం వల్లనే వెంటిలేటర్‌పై ఉన్న రోగులు చనిపోతున్నారన్నది వారి వాదన. అంతేకాదు, తగినంత ఆక్సిజన్ సరఫరా లేకపోవడంతో మూత్రపిండాలు ఎరిత్రోపొయిటీన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తాయి. దీని పని ఏంటంటే.. 'తగినన్ని ఎర్ర రక్త కణాలను పుట్టించు' అని బోన్ మ్యారో (మూలుగ)కు చెప్పడమే. ఆ హార్మోన్ సందేశం మేరకు బోన్ మ్యారో బోలెడన్ని ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. కరోనాకు చికిత్స పొందుతున్నవారిలో హిమోగ్లోబిన్ స్థాయులు పెరగడానికి కారణం ఇదేనని వారు చెబుతున్నారు. మరో వైపు.. హిమోగ్లోబిన్ నుంచి విడివడ్డ ఐరన్ అయాన్ విషం లాంటిదే. అది శరీరంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఆక్సిడేటివ్ డ్యామేజ్‌కు కారణమవుతుంది. అంటే.. శరీరానికి హాని చేసే ఫ్రీరాడికల్స్ సంఖ్యను పెంచేస్తుంది. ఈ ఫ్రీరాడికల్స్ ఎందుకు హానికరమైనవంటే.. వీటిలో ఒక ఎలక్ట్రాన్‌కు జత ఉండదు. ఆ జత కోసం ఇవి శరీరంలో తిరుగుతూ ఏ అవయవంలోని కణంనుంచి దొరికితే ఆ కణంనుంచి ఎలక్ట్రాన్‌ను సంగ్రహిస్తాయి. తనకు కావాల్సిన జతను సమకూర్చుకునేందుకు ఇవి గుండె, క్లోమం సహా ఏ అవయవాన్నీ వదలవు. అలా ఒక ఫ్రీరాడికల్ తనవద్ద లేని ఎలక్ట్రాన్‌కు జోడీని సంగ్రహించాక.. దాన్ని పోగొట్టుకున్న కణం ఫ్రీరాడికల్‌గా మారి జోడీని వెతుక్కుంటుంది. ఇది చెయిన్ రియాక్షన్‌లాగా మారి ఫ్రీరాడికల్స్ సంఖ్య పెరిగిపోతుంది. ఇవి డీఎన్ఏ స్ట్రక్చర్‌నూ మార్చేస్తాయి. అది మరింత ప్రమాదకరం. అంటే కరోనా వైరస్ చేస్తున్న ఒక్క పని.. హిమోగ్లోబిన్ నుంచి ఐరన్ అయాన్‌ను తొలగించడంవల్ల లోపల ఇంత హాని జరుగుతుందన్నమాట. ఇలాంటి వారికి క్లోరోక్విన్‌ను వాడితే.. అది వైరస్‌లోని ఓఆర్ఎఫ్8, సర్ఫేస్ గ్లైకో ప్రొటీన్‌ను హీమ్స్‌కు అతుక్కోకుండా అడ్డుకుంటుందని చైనా పరిశోధకులు చెబుతున్నారు. మలేరియాకు కారణమైన ప్లాస్మోడియం కూడా హిమోగ్లోబిన్‌ను సరిగ్గా పనిచేయకుండా నిరోధిస్తుంది. నిజానికి అది జీవి. కరోనా వైరస్‌కు జీవం ఉండదు. కానీ, రెండూ ఒకేలాగా పనిచేస్తున్నాయి. అందుకే మలేరియా మందు.. కరోనా సోకిన వారికీ పనిచేస్తోందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మలేరియా ఎక్కువగా ఉండే దేశాల్లో వారికి ఇప్పటికే నిరోధకత ఉంటుంది కాబట్టి కరోనా ఉధృతీ తక్కువగా ఉంటోందని వారు విశ్లేషిస్తున్నారు. *-సెంట్రల్ డెస్క్*

## ఆ దేశాల్లో కరోనా ఉధృతి తక్కువ

- స్లేట్ స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి అమర్‌నాథ్



మలేరియా ప్రభావిత దేశాల్లో కరోనా ఉధృతి తక్కువగా ఉందని స్లేట్ స్కూల్స్ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి అమర్‌నాథ్ చాలా రోజుల క్రితమే ఒక ప్రతిపాదన చేశారు. సివిల్స్‌లో మెడికల్ ఆంత్రోపాలజీ ఒక సబ్జెక్టుగా చదివిన అమర్‌నాథ్.. తనకున్న ఆసక్తితో ఈ వైరస్ ప్రభావం వివిధ దేశాలపై ఎలా ఉందో పరిశీలించారు. పలు దేశాల్లో ఉన్న తన బంధువులు, స్నేహితుల నుంచి సేకరించిన సమాచారం, ఇంటర్‌నెట్‌లో లభ్యమవుతున్న సమాచారాన్ని విశ్లేషించి ఈ ప్రతిపాదన చేశారు. తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా దీన్ని విస్తృతంగా ప్రచారం చేసి భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు తన ప్రతిపాదనను బలపరిచే పరిశోధన రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిమీద మరింత చర్చ జరగాలని.. ఈ దిశగా ప్రభుత్వం పరిశోధనలు చేస్తే ఉపయోగం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారతీయుల్ని కాపాడుతున్న మైక్రో ఆర్ఎన్ఏ

(మొదటిపేజీ తరువాయి)

టెక్నాలజీ (ఐసీజీఈబీ) పరిశోధకులు వెల్లడించారు. భారతీయుల శరీరాల్లోకి ప్రవేశించే కరోనా వైరస్ ఉత్పతరివర్తనం చెందేందుకు ఆ మైక్రో ఆర్ఎన్ఏ కారణమవుతోందని వారు వివరించారు. అందుకే ఇతర దేశాల వారితో పోలిస్తే భారతీయుల రోగనిరోధక వ్యవస్థ దాన్ని మెరుగ్గా ఎదుర్కోగలదని పేర్కొన్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. అమెరికా, ఇటలీ, నేపాల్, ఇండియాల్లో కరోనా వైరస్ ఉత్పరివర్తనాలు వేర్వేరుగా ఉన్నాయి. నేపాలీలకు సోకిన వైరస్‌లో ఎలాంటి ఉత్పరివర్తనాలూ లేకపోగా (ఆ దేశంలో మలేరియా కేసుల సంఖ్య తక్కువే).. భారతీయుల్లో కనిపించిన వైరస్‌లో అత్యధిక ఉత్పరివర్తనాలు కనిపించాయని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ దినేశ్ గుప్తా తెలిపారు. అదే ఇటలీలో ప్రవేశించిన వైరస్‌లో కలిగిన ఉత్పరివర్తనం వల్లనే అక్కడ కేసుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిందని విశ్లేషించారు. కాగా.. డాక్టర్ దినేశ్ గుప్తా బృందం రూపొందించిన పరిశోధన పత్రాన్ని సంబంధిత నిపుణులు పరిశీలించి, ఆమోదించాల్సి ఉంది.



## కొవిడ్ వాస్తవ లెక్కలకు నాలుగింతల కేసులు

దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు వాస్తవానికి నాలుగింతలు ఉంటాయి. ఎలాంటి పరీక్షలు లేకుండా పెద్దసంఖ్యలో క్వారంటైన్‌లో ఉంటున్న వారిని ఈ లెక్కల్లో చేర్చడం లేదు. కరోనా నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చు. ఈ తీర్పు వల్ల కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యే మొత్తంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

*- కిరణ్ మజుందార్ షా, బయోకాన్ లిమిటెడ్ చైర్‌పర్సన్*

# కశ్మీరులో 4జీ ఎందుకు పునరుద్ధరించరు?

- వారంలో సమాధానమివ్వండి: జస్టిస్ రమణ
- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి మూలంగా నెలకొన్న పరిస్థితి నేపథ్యంలో జమ్మూకశ్మీరులో 4జీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు గురువారం కేంద్రానికి, ఆ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి నోటీసులిచ్చింది. ఈ విషయంలో వారం రోజుల్లో జవాబివ్వాల్సిందిగా జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. జమ్మూకశ్మీరులో ఇంటర్నెట్ స్పీడ్‌ను 2జీకి మాత్రమే పరిమితం చేస్తూ మార్చి 26న జమ్మూకశ్మీరు పాలనా యంత్రాంగం ఇచ్చిన ఆదేశాలపై ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ అనే సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ఇదే ధర్మాసనం జనవరి 10న జారీ చేసిన ఆదేశాల మేరకే ప్రభుత్వం అక్కడ 2జీ ఇంటర్నెట్ సర్వీసులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం భావప్రకటనా స్వేచ్ఛకు, వ్యాపారం సాఫీగా జరుపుకొనేందుకు అవసరమని జస్టిస్ రమణ సంచలనాత్మక తీర్పు ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)ఏ, ఆర్టికల్ 19(1)జీ కింద ఇంటర్నెట్ ప్రాథమిక హక్కులో భాగమని కూడా ఆయన స్పష్టం చేశారు. ఒక రివ్యూ కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉత్తర్వులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. దీనితో కేంద్రం జమ్మూకశ్మీరులో ఇంటర్నెట్ సౌకర్యాన్ని క్రమంగా పునరుద్ధరిస్తూ వచ్చింది. మార్చి 4 నుంచి వెబ్‌సైట్లు, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా సాధనాలను అనుమతిస్తూ వచ్చింది. అయితే పరిమిత డేటా సౌకర్యాన్ని అందించే 2జీ స్పీడ్‌ను మాత్రమే ప్రభుత్వం పునరుద్ధరించింది. మొత్తం దేశమంతటా 3జీ, 4జీ స్పీడ్ లభ్యమవుతుండగా జమ్మూకశ్మీరులో 2జీ సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీనిపై ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ సంస్థ కోర్టును ఆశ్రయించింది. లాక్‌డౌన్ రీత్యా జమ్మూకశ్మీర్‌లో టెక్నాలజీని, అనుసంధానాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నదని, ముఖ్యంగా డాక్టర్లకు, రోగులకు సమాచారం అందడం లేదని పిటిషనర్ తరపున న్యాయవాది వాదించారు. దీంతో కోర్టు నోటీసులు ఇచ్చింది.



ముఖ్యమంత్రి జగన్‌కు చెక్ అందజేస్తున్న సువెన్ సీఈవో జాస్తి వెంకట్



రూ.1.18 కోట్ల రూపాయల చెక్‌ను సీఎంకు అందజేస్తున్న నరసరావు పేటకు చెందిన వైద్యులు, వ్యాపారవేత్తలు

# నాట్కో ఫార్మా విరాళం 2.50 కోట్లు

- రూ.1.50 కోట్ల మందులు కూడా
- సువెన్ లైఫ్ సైన్సెస్ రూ.కోటి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నాట్కో ఫార్మా లిమిటెడ్ సీఎండీ నన్నపనేని వెంకయ్య చౌదరి రూ.2.50 కోట్లను ఎస్‌బీఐ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపారు. రూ.1.50 కోట్ల విలువైన పీపీఈ కిట్లను, హైడ్రాక్సీ క్లోరోక్విన్ ముందులను ఏపీఎంఎస్ఐడీసీ సంస్థకు అందజేశారు. వరుణ్ గ్రూప్ చైర్మన్ వి.ప్రభు కిశోర్, ఎండీ వి.వరుణ్‌దేవ్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలసి రూ.2కోట్ల విరాళం అందజేశారు. అలాగే, నరసారావుపేటకు చెందిన వైద్యులు, వ్యాపార వేత్తలు, ప్రజల తరపున కోటీ 18వేల 227 రూపాయలను సీఎం జగన్‌కు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఇక,



రూ.2 కోట్ల చెక్ అందజేస్తున్న వి.ప్రభు కిశోర్

సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ సీఈవో జాస్తి వెంకట్ రూ.కోటి విరాళాన్ని జగన్‌కు చెక్ రూపంలో అందజేశారు. అలాగే డీజీపీ సవాంగ్‌ను కలిసిన జాస్తి వెంకట్ పోలీసు సంక్షేమ నిధికి రూ.50 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ రోమన్ కేథలిక్ డయోసిస్ బిషప్ జోసఫ్ రాజారావు సీఎం జగన్‌కు రూ.25 లక్షల విరాళం అందజేశారు. గుంటూరు రోమన్ కేథలిక్ డయోసిస్ తరపున బిషప్ భాగ్యయ్య రూ.25 లక్షల చెక్‌ను సీఎంకు అందజేశారు. అలాగే, విశాఖ ఆర్‌సీఎం చర్చి, సెయింట్ ఏన్స్ సంస్థలు రూ.67 లక్షలు విరాళం ప్రకటించాయి. ఇదిలావుండగా, గుంటూరుజిల్లా పలకలూరు విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ రాధిక, నలుబోలు విష్ణు దంపతుల కుమార్తె విజయలక్ష్మి వివాహం స్వగృహంలో నిరాడంబరంగా జరిపించారు. హాజరైన నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు కరోనా సహాయక చర్యల కోసం నూతన దంపతులు రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.

### నారాయణ, సన్ నెట్‌వర్క్ భూరి విరాళం

నారాయణ విద్యాసంస్థలు రూ.2కోట్ల విరాళం ప్రకటించాయి. తెలంగాణ సీఎం సహాయనిధికి రూ.కోటి ఇవ్వగా.. ఏపీకి త్వరలో రూ.కోటి అందిస్తామని విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ తెలిపారు. పీఎం కేర్స్ ఫండ్‌కు సన్‌నెట్‌వర్క్ రూ.10కోట్లు, జిందాల్‌స్టీల్ రూ.5కోట్లు ప్రకటించాయి. విరూపాక్ష ఆర్గానిక్స్ రూ.10 లక్షలు ఇచ్చాయి.

## పెట్రోల్, డీజిల్‌కు తగ్గిన డిమాండ్

- వంటగ్యాస్‌కు తెగ డిమాండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: కరోనా వైరస్ ఆంక్షల వల్ల దేశంలో ఇంధన వినియోగం 66 శాతం మేర తగ్గినట్లు చమురు సంస్థలు వెల్లడించాయి. ఆర్థిక కార్యకలాపాలు, రవాణా నిలిచిపోవడం వల్ల పెట్రోల్, డీజిల్‌లకు డిమాండ్ తగ్గింది. విమానాల్లో వాడే ఇంధనం -ఏటీఎఫ్ వినియోగం ఏకంగా 90 శాతం మేర పడిపోయిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దేశం భారత్. అలాంటి భారత్‌లో మార్చిలో 17.79శాతం పెట్రోలు, 24. 43 శాతం డీజిల్, 32.4 శాతం ఏటీఎఫ్ మాత్రమే వాడడం జరిగిందని, రవాణా రంగం పూర్తిగా స్తంభించిపోవడం వల్ల పెద్ద దెబ్బే తగిలిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వంటగ్యాస్‌కు మాత్రం తెగ గిరాకీ ఏర్పడింది. ఎల్‌పీజీ విక్రయాలు 1.9 శాతం (23 లక్షల) మేర పెరిగినట్లు తేలింది.

## నవ్య | చిత్రజ్యోతి

# లారెన్స్ పెద్ద మనసు



కరోనా బాధితులను ఆదుకోవడం కోసం తన వంతుగా రూ. 3 కోట్లు ఇస్తున్నట్లు నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ ప్రకటించి తన పెద్ద మనసు చాటుకొన్నారు. ఇందులో రూ. 50 లక్షలు పీఎం కేర్స్ ఫండ్‌కు, తమిళనాడు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 50 లక్షలు, మరో రూ. 50లక్షలు చలనచిత్ర కార్మిక సమాఖ్యకు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే నృత్య దర్శకుల సంఘానికి కూడా రూ. 50 లక్షలు, తన దగ్గరున్న దివ్యాంగుల కోసం రూ. 25 లక్షలు ఇస్తానని రాఘవ లారెన్స్ వెల్లడించారు. తను పుట్టిన ఊరు రాయపురంలోని పేద ప్రజానీకం కోసం రూ. 75 లక్షలు వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. తన అభిమాన నటుడు రజనీకాంత్ ఆశీస్సులతో ఆయన నటించే 'చంద్రముఖి 2' చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు రాఘవ లారెన్స్ ఈ సందర్భంగా చెప్పారు.ఆ సినిమా కోసం తనకు వచ్చిన అడ్వాన్స్ నుంచే ఈ డబ్బు ఇస్తున్నట్లు చెప్పారు. 2005లో వచ్చిన 'చంద్రముఖి' చిత్రానికి దర్శకత్వం వహించిన పి.వాసు ఈ సీక్వెల్‌కు దర్శకత్వం వహించనున్నారు. సన్ పిక్చర్స్ బేనరుపై కళానిధి మారన్ ఈ సినిమా నిర్మిస్తారు.

## నాస్తికుడైన నాన్నగారిని మార్చేశారు

- పవన్‌కల్యాణ్



సోషల్ మీడియాలో అడుగుపెట్టినప్పటి నుంచి ఆసక్తికరమైన ట్వీట్లతో ఆకట్టుకుంటున్నారు చిరంజీవి. బుధవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయస్వామితో ఆయనకున్న అనుబంధం గురించి, 1962లో లాటరీలో వచ్చిన హనుమాన్ బొమ్మ గురించి చిరంజీవి చేసిన ట్వీట్‌కు ఆయన తమ్ముడు పవన్‌కల్యాణ్ స్పందించారు. ఆ ఫొటోకు సంబంధించి ఆసక్తికర విషయాలు పవన్ తెలిపారు. "అన్నయ్య చిరంజీవితోనే మా ఇంట్లో ఆంజనేయస్వామిని పూజించడం మొదలైంది. ఆ భక్తి కమ్యూనిస్టు, నాస్థికుడైన మా నాన్నగారిని రామ భక్తునిగా మార్చింది. టీనేజ్‌లో ఉండగా నేను కూడా పలు సందర్భాల్లో హనుమాన్ చాలీసా 108 సార్లు పఠించేవాడిని. జై హనుమాన్" అని పవన్ ట్వీట్ చేశారు.

## అమితాబ్ ముందడుగు



లాక్ డౌన్ కారణంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద ప్రజానీకాన్ని ఆదుకోవడానికి అమితాబ్ బచ్చన్ ముందడుగు వేశారు. గురువారం ఆయన ఉత్తర ముంబై స్లమ్ ఏరియాల్లో ఉంటున్న పేదలకు రెండు వేల ఆహార పొట్లాలు పంచారు. అలాగే మూడు వేల మందికి నెలకు సరిపడే నిత్యావసర వస్తువుల్ని అందజేశారు. ఈ విషయాన్ని తన బ్లాగ్ ద్వారా అమితాబ్ వెల్లడించారు.

అఖిల భారత సినీ కార్మిక సమాఖ్యకు చెందిన లక్షమంది సభ్యులను ఆదుకొంటానని ఆయన ఇటీవల ప్రకటించారు. దీనికోసం కార్యాచరణను ఆయన రూపొందించారు. ' సమాఖ్య సభ్యులకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరిస్తున్నాం. అతి కొద్ది రోజుల్లోనే ఆ పని పూర్తవుతుంది. ఇంట్లో నలుగురు సభ్యులకు చొప్పున నాలుగు లక్షల మందికి నెలకు సరిపడే నిత్యావసర వస్తువుల్ని అందించాలని నా ప్రయత్నం' అని అమితాబ్ పేర్కొన్నారు.

## ఇటలీలో ప్రతిరోజూ గండమే

- శ్వేతా పండిట్



నెలరోజులుగా తన భర్త ఇవానో ప్యూచీతో ఇటలీలోనే క్వారంటైన్ ఉన్నానని గాయని శ్వేతా పండిట్ తెలిపారు. ఆరు నెలలుగా శ్వేతా పండిట్ తన భర్త, కుటుంబ సభ్యులతో కలిసి ఇటలీలోనే ఉంటున్నారు. 'ఇంతకాలం మాతృభూమికి దూరంగా ఉండడం ఇదే మొదటి సారి. వీలైనంత త్వరగా ముంబై వచ్చేయాలనుంది' అని ఆమె చెప్పారు. "రాఖీ పండుగ ముంబైలో జరుపుకోవాలని మార్చిలో ఇండియాకు తిరిగి వచ్చేయాలనుకున్నా. అయితే ఇటలీలో కరోనా విజృంభించడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి. ఇక్కడి ప్రజలకు కరోనాతో పోరాటం రోజురోజుకీ కఠినంగా మారుతోంది. ఆసుపత్రులన్నీ కరోనా బాధితులతో నిండిపోయాయి. వెయిటింగ్ హాల్స్ ఐసీయులుగా మారిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితిని వైద్యులు ఎప్పుడూ చూసి ఉండరు. మరణాల సంఖ్య చూస్తుంటే కడుపు తరుక్కు పోతుంది. ప్రతిరోజూ గండంలాగే ఉంది. ఇలాంటి సమయంలో రిస్క్ తీసుకోవడం కరెక్ట్ కాదని నెల రోజులుగా మా కుటుంబం అంతా క్వారంటైన్‌లో ఉన్నాం.



కొన్ని నెలల క్రితం చూసిన ఇటలీ ఇప్పుడు అలా లేదు. వీధులు నిర్మానుష్యంగా మారాయి. బెర్గామో, మిలన్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో మరణించిన వారిని ఆర్మీ సైనికులు ఎలా తీసుకెళ్లారో కళ్లారా చూశాను. వారిని ఖననం చేయడానికి ఖాళీ స్థలం కూడా లేదు. భయభ్రాంతులకు గురవుతున్న ఇటలీ ప్రజలకు ఇక్కడి గాయనీగాయకులు కొందరు తమ పాటలతో ధైర్యానిస్తున్నారు" అని శ్వేతా పండిట్ తెలిపారు.

# 22 మంది సింగర్స్‌తో ఆ పాట



ఇంతకుముందు ప్రపంచం ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంది. మరెన్నో వైపరీత్యాలను తట్టుకుంది. సమస్త మానవాళిని భయపెట్టి వెంటాడుతున్న కరోనా మహమ్మారిని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. మందేలేని ఈ మహమ్మారిని తరిమి కొట్టడానికి అన్నిరంగాల వారు కృషి చేస్తున్నారు. సినిమా స్టార్లు పలు మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. కవులు తమ కలానికి పని చెప్పి పదునైన పదాలు రచిస్తుంటే... గాయనీగాయకులు గళమెత్తున్నారు. అందులో భాగంగా ప్రముఖ గాయని కె.ఎస్.చిత్ర 'లోకా సమస్తా సుఖినో భవంతు' అంటూ ఓ పాటను రూపొందించి తన ఫేస్‌బుక్ పేజీలో షేర్ చేశారు. మలయాళంలో పేరొందిన 22 గాయనీగాయకులు తమ ఇళ్లల్లో ఉండి ఈ పాటను రూపొందించారు. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన 24 గంటల్లోనే దాదాపు మూడున్నర లక్షల మంది ఈ పాటను వీక్షించారని మలయాళ గాయకుడు వి.దేవానంద్ తెలిపారు. ""స్నేహదీపం మిళి తురక్కు' చిత్రంలోని 'లోకం మురువన్ సుఖం పకరానయ్' అంటూ సాగే అద్భుతమైన భక్తి గీతమిది. చిత్రగారు ఈ ఐడియా చెప్పినప్పుడు మా టీమ్ అంతా ఇందులో భాగం కావాలనుకున్నాం. జానకిగారు పాడిన ఈ అర్థవంతమైన పాటను 'కొవిడ్ 19' అవగాహన కోసం మేమంతా పాడడం చాలా ఆనందంగా ఉంది" అని ఆయన చెప్పారు. "కరోనా దెబ్బతో అతలాకుతలం అవుతున్న మానవాళి త్వరలోనే కోలుకొని లోకం శాంతిగా ఉండాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ, జనాల్లో అవగాహన కలిగించేందుకు ఈ పాటను రూపొందించామని కె.ఎస్. చిత్ర తెలిపారు.

## మెడ్‌టెక్... చంద్రబాబు విజన్: కాల్వ

**అక్కడ తయారైన పరికరాలతో ఫోజులా!: బుద్ధా**

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో కరోనాపై యుద్ధానికి అవసరమైన ఆయుధాలు తయారవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా జోన్ ఏర్పాటుపై పెద్ద ఎత్తున ఆరోపణలు చేసిన వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాతా విచారణ చేస్తామంటూ ప్రకటించింది. తాజాగా కరోనా నేపథ్యంలో అదే మెడ్‌టెక్ జోన్ అక్కరకు రావడంతో టీడీపీ నేతలు వరుసగా వైసీపీపై మాటల దాడికి దిగారు. గురువారం ట్విటర్ వేదికగా పలువురు నేతలు చంద్రబాబు ముందుచూపును పొగుడుతూ, వైసీపీ నేతల తీరును దునుమాడారు. "2016లో చంద్రబాబు శంకుస్థాపన చేసి 2018లో ప్రారంభించిన మెడ్‌టెక్ జోన్ కరోనా కష్ట సమయంలో కాంతి రేఖలా కనిపించింది. ఇదీ చంద్రబాబు విజన్ అంటే!" అని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ట్వీట్ చేశారు. టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న "మెడ్‌టెక్ జోన్‌లో అవినీతి జరిగింది, విచారణ చేస్తున్నాం అంటూ హడావుడి చేశారు. ఇప్పుడు అదే మెడ్‌టెక్‌లో తయారైన వైద్య పరికరాలను పట్టుకుని.. తానే చేయించానంటూ మీడియాకు ఫోజులివ్వడానికి సిగ్గు అడ్డురాలేదా జగన్ గారూ?" అంటూ ట్వీట్ చేశారు. కరోనా కేసు మొట్టమొదట చైనాలో 2019 డిసెంబరులో నమోదయితే, 2020 జనవరిలో ప్రపంచానికి తెలిసింది. కానీ జగన్ మాత్రం 2019 ఆగస్టులోనే కరోనా వస్తుందని కల కని, వైద్య పరికరాలు తయారు చేయించాననడం హాస్యాస్పదంగా ఉంది. పైగా కరోనాని ఎదుర్కొన్న ధీరుడు జగన్ అని వైసీపీ నేతలు డప్పు కొట్టడం వింతగా ఉందని విమర్శించారు.

## గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ఇంటివద్దే జరుపుకోండి: జగన్

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సండే వేడుకల్ని క్రైస్తవ సోదరులు వారి వారి ఇళ్లల్లోనే ఉంటూ జరుపుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. కరోనా నుంచి మానవాళిని రక్షించాలని కరుణామయుడిని మనమంతా ప్రార్థించాలి అని సూచించారు. ఈ మేరకు గురువారం అని ట్వీట్ చేశారు.

## ఉమ్మడి ప్రవేశ పరీక్షలన్నీ వాయిదా!

అమరావతి, (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్)లను వాయిదా వేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రత్యేకాధికారి ఎం.సుధీర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత రీషెడ్యూల్ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

## జేఈఈ పరీక్ష కేంద్రాలు మార్చుకునే చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రం మార్చుకునేందుకు ఎన్టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) అవకాశం కల్పించింది. అవసరమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్ష కేంద్రం మార్పు అవకాశం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది..

## నాయీ బ్రాహ్మణులు, రజకులకు 15వేలు ఇవ్వాలి

విజయవాడ, ఏప్రిల్ 9: లాక్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో వెనుకబడిన కులాల జీవనం దుర్భరంగా మారిందని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అత్యంత వెనుకబడిన కులాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనుకొండ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షలమంది నాయీ బ్రాహ్మణులు, 25 లక్షలమంది రజకులు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, లాక్‌డౌన్ నేపథ్యంలో వారికి ఉపాధి లేకుండా పోయిందన్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులకు కుటుంబానికి రూ.15వేలు అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## 'సరుకు' రవాణాకు స్వేచ్ఛ

విజయవాడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అత్యవసరాలను రవాణా చేసే వాహనాలతోపాటు ఇతర సరుకులు, ముడిపదార్థాలు, వస్తువులు తదితరాలను తీసుకొని వెళ్లే లారీలు యథావిధిగా తిరగడానికి అవకాశం కల్పిస్తూ కేంద్రం సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. సరుకు రవాణా చేపట్టే జాతీయ పర్మిట్ లారీలు దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగవచ్చని కృష్ణా జిల్లా టీడీసీ ఎస్ వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతికి చెప్పారు. సరకు రవాణా వాహనాలను ఎవరూ అడ్డగించరని స్పష్టం చేశారు.

## కోమటి జయరాంకు మాతృ వియోగం



కమలమ్మ (ఫైల్)

వెల్వడం (మైలవరం రూరల్), ఏప్రిల్ 9: ప్రవాస భారతీయుడు, తానా ప్రముఖుడు కోమటి జయరాంకు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి కమలమ్మ (85) అనారోగ్య కారణాలతో బుధవారం విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. కరోనా నేపథ్యంలో తల్లిని చివరి చూపు చూసుకునేందుకు కూడా ఆయనకు అవకాశం లేకపోయింది.

## అనుమానాస్పద స్థితిలో బుల్లితెర నటి మృతి



విశ్వశాంతి (ఫైల్)

అమీర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా సింహాచలం సమీపంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన విశ్వశాంతి (23) హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లితో కలిసి ఉంటూ టీవీ సీరియళ్లలో నటిస్తున్నారు. కొంతకాలం క్రితం తల్లి విశాఖకు వెళ్లిపోవడంతో.. ఆమె ఒంటరిగా ఉంటున్నారు. మూడు రోజులుగా విశ్వశాంతి ఫ్లాట్ నుంచి బయటకు రాకపోవడంతో.. అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ అనుమానంతో తలుపు తట్టాడు. స్పందన లేకపోవడంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు.. తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లి చూడగా, విశ్వశాంతి విగతజీవిగా పడి ఉన్నారు. ఆమె తలకు బలమైన గాయాలై, తీవ్ర రక్తస్రావమైన గుర్తులు ఉన్నాయి.

## విచారణలన్నీ ఆన్‌లైన్‌లోనే: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో రాష్ట్రంలోని దిగువ కోర్టులు, ట్రైబ్యునళ్లలో విచారణ ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేపట్టడానికి తగిన మార్గదర్శకాలను హైకోర్టు తాజాగా జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఖరారు చేసిన వాటిపై హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రకటన విడుదల చేశారు. అన్ని దిగువ కోర్టుల్లోనూ అత్యవసర కేసుల విచారణ కోసం అనువైన యాప్/సాఫ్ట్‌వేర్ ద్వారా వీడియో కాన్ఫరెన్సింగ్ నిర్వహించాలి. సివిల్ కేసుల్లో తీర్పులు/ఉత్తర్వులు జారీ చేయాలంటే ముందుగా ఇరుపక్షాలకూ వాట్సాప్, ఈ-మెయిల్‌లో నోటీసు పంపాలి. జిల్లా కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో 'నోటీసు' అప్‌లోడ్ చేసి, ఇరువైపు న్యాయవాదులకూ వాటిని అందజేసి సివిల్ కేసుల్లో తీర్పులు/ఉత్తర్వులు జారీ చేయవచ్చు.



ఉద్యోగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

### ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు
## చెవిరెడ్డి భారీ వితరణ

**రూ.1.6 కోట్ల నిత్యావసరాలు పంపిణీ**

తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరోనా, లాక్‌డౌన్ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజానీకానికి తాను అండగా నిలుస్తానని చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. కరోనా వ్యాప్తి నివారణకు విధుల్లో ఉన్న 11,500మంది ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు రూ1.6 కోట్లతో నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. 10 కిలోల బియ్యం, 5 కిలోల గోధుమ పిండి, 2 లీటర్ల నూనె.. ఇలా 25 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గతంలోనూ నియోజకవర్గంలోని ఇంటింటికి రెండు విడతల్లో శానిటైజర్లు అందజేశారు. బుధవారం నుంచి ప్రతి ఇంటికీ సర్జికల్, క్లాత్ మాస్కుల పంపిణీ చేపట్టారు. ప్రతి కుటుంబానికి పది కోడిగుడ్లు, 10 కిలోల చొప్పున 1600 టన్నుల కూరగాయలు, 15 చొప్పున 23 లక్షల సి-విటమిన్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు చెవిరెడ్డి తెలిపారు.



### మహాత్ముని సాక్షిగా

కరోనా మహమ్మారి వ్యాపించకుండా చేద్దాం...చేతులు కడుక్కోండి...మాస్కులు ధరించండి...భౌతికదూరం పాటించండి...అంటూ పాలకులు, యంత్రాంగం, అనేక సంస్థలవారు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. అలాగే ప్రజానీకం కూడా ఎవరికి తోచిన రీతిలో వారు తమ వంతు కృషి చేస్తుండడం విశేషం. విజయనగరంలోని గుంటూరు వారి వీధిలో బృందావనం అపార్టుమెంట్ వద్ద గాంధీ విగ్రహానికి ఇదిగో ఇలా మాస్క్ కట్టి...ప్రజలను జాగ్రత్తలు పాటించాలని సూచించడం ఆకర్షణగా నిలిచింది.

-విజయనగరం





### బావిలో పడి.. లేచిన ఏనుగు!

చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం మండలాల్లోని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి గాంధీనగర్ సమీపంలోని వ్యవసాయ బావిలో పడిపోయింది. గురువారం ఉదయాన్నే ఏనుగు ఘీంకారాలు విన్న గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి ఎస్కలేటర్ సాయంతో కొంత మట్టిని బావిలోకి వేశారు. దీంతో ఏనుగు అతికష్టం మీద మోకాళ్ల సాయంతో ఎగబడి బావినుంచి వెలుపలికి వచ్చి అటవీ ప్రాంతంలోకి పరుగులు తీసింది. అటవీ ప్రాంతంలో తాగేందుకు నీళ్లు లేకపోవడంతో ఏనుగు ఇక్కడికి వచ్చి ఉంటుందని అధికారులు తెలిపారు.

-పలమనేరు

## వాన పోటు పిడుగు పాటు
# 14 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

వేలాది ఎకరాల్లో వాణిజ్య, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా వరుణుడు బీభత్సం సృష్టించాడు. గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. పంట చేలన్నీ నీట మునిగాయి. నెల్లూరు జిల్లాలో పిడుగుపాటుకు గురై ఏడుగురు మృతి చెందారు. అల్లూరు మండలం పడమర గోగులపల్లెకు చెందిన కె.సుబ్బారావు(54), బోగోలు మండలం భాస్కర గిరివారికండ్రిగకు చెందిన పెంచల్ రెడ్డి(62), దగదర్తి మండలం చెన్నూరులో సుబ్బరాయుడు(50), వరిగుంటపాడు గొల్లపల్లిలో పి.ఆంజనేయులు(35), శ్యాంసుందరం(40), నాయుడుపేట మండలం పూడేరు గ్రామంలో రైతు గుండాల శ్రీనివాసులు(37) పిడుగుపాటుకు గురై మరణించారు. ఇదే మండలం గొట్టిప్రోలు గ్రామానికి చెందిన ఆవుల గురవయ్య పిడుగు శబ్దానికి గుండెపోటుకు గురై మృతిచెందాడు. గుంటూరు జిల్లా నగరం మండలం పెదపల్లిగొల్లపాలెంకు చెందిన రైతు బెల్లంకొండ లక్ష్మయ్య(74), రేపల్లె మండలం గంగపాలెంకు చెందిన మత్స్యకారుడు కన్నా నరేశ్(37) పిడుగుపడి మరణించాడు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మిట్టపాలెంలో పిడుగుపడి లక్ష్మణరావు(55) అనే రైతు మృతిచెందారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. పూతలపట్టు మండలంలో ఓ ఫుడ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీపై పిడుగు పడి రూ.10లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది.



చాగలమర్రి మండలంలో దెబ్బతిన్న అరటి

### రైతుకు తీరని నష్టం

నెల్లూరు జిల్లాలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి సుమారు 10వేల టన్నుల ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైస్‌మిల్లుల వద్ద నిల్వఉంచిన ధాన్యం బస్తాలు, రోడ్లమీద, కల్లాల్లో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం రాశులు అన్నీ తడిసిపోయాయి. కావలి, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల పరిధిలో వరి పంటకు తీవ్ర నష్టం సంభవించింది. సంగం, ఇందుకూరుపేట, కోవూరు మండలాల్లో 150ఎకరాల్లో అరటి నేలకూలింది. ప్రకాశం జిల్లాలో పలుచోట్ల కల్లాల్లోని మిర్చి తడిసింది. బొప్పాయి, అరటి, నిమ్మతోటల్లో కాయలు రాలిపోయాయి. పర్చూరు, మార్టూరు, దర్శి, వైపాలెం తదితర వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో కల్లాల్లో ఉన్న మిరపకాయలు తడిసిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో పొలాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న పూర్తిగా నీటమునగడంతో రైతులు బావురమంటున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరిపనలు నేలకొరిగాయి. అరటి పంటకు అపార నష్టం జరిగింది. మామిడికాయలు నేలరాలాయి. మిరప, నువ్వులు ఎందుకూ కొరగాకుండా పోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఏపుగా పెరిగి కోతకు వచ్చిన చేలు అకాల వర్షంతో పూర్తిగా నేలనంటాయి. కర్నూలు జిల్లా పాములపాడు, చాగలమర్రి, కొలిమిగుండ్ల, మద్దికెర, సంజామల, మహానంది, బండి ఆత్మకూరు తదితర మండలాల్లో వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. శ్రీశైలంలో మధ్యాహ్నం రెండు గంటల పాటు వర్షం పడింది. కడప జిల్లా రైల్వేకోడూరు, రాజంపేట, పులివెందుల, రాయచోటి, కడప నియోజక వర్గాల్లో 2663.60 హెక్టార్లలో అరటి, మామిడి, తమలపాకు, మునగ పంటలు దెబ్బతినడంతో 3,045మంది రైతులు రూ.39.95 కోట్లు నష్టపోయారని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి వివరించారు. చిత్తూరు జిల్లాలో గాలుల తీవ్రత, వడగండ్ల వానలకు మామిడి పంట దెబ్బతింది. కాయలు, పిందెలు నేలరాలడంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాలో వరితో పాటు ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 250ఎకరాల్లో వరి, అరటి, చీనీ, దానిమ్మ, మామిడి, బొప్పాయి, కళింగర, కర్బూజ పంటలకు రూ.3 కోట్లకుపైగా పంట నష్టం జరిగింది.

## నేడు, రేపూ వానలు

**రాష్ట్ర రైతుల్లో ఆందోళన**

అమరావతి/విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విదర్భ నుంచి తమిళనాడు వరకు నెలకొన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రలో అనేక ప్రాంతాల్లో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలితో కూడిన అకాల వర్షం కురవగా.. శుక్ర, శనివారాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించింది. కాగా.. నెల్లూరు జిల్లాలో ఐదారు మండలాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. నాయుడుపేటలో 102, గూడూరులో 100, ముత్తుకూరులో 82, మద్దిపాడులో 94.5 మిల్లీమీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా చెదురు మదురుగా జల్లులుపడ్డాయి. లాక్‌డౌన్ కారణంగా పంట ఉత్పత్తుల మార్కెటింగ్ లేక.. గిట్టుబాటు ధర దొరక్క అల్లాడుతుంటే.. ఇప్పుడు కల్లాల్లో ఉన్న పంట కూడా తడిసిపోవడంతో నాణ్యత లేదంటూ వ్యాపారులు ధర తగ్గిస్తారేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చి, అమ్ముకునే తరుణంలో పాడైన ఉత్పత్తి అమ్మాలంటే కష్టమని.. గిట్టుబాటు ధర రాకపోతే ఆర్థిక ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

### కోస్తా, సీమలకు వర్షసూచన

ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో కోస్తాలో పలుచోట్ల 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. పిడుగులతో పలుచోట్ల వర్షాలు పడతాయని.. ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాను హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాగా.. ఉత్తరాదిలో పయనించే వెస్ట్రన్ డిస్టర్బెన్స్ ప్రభావంతో మధ్య భారతం నుంచి దక్షిణభారతం వరకు ద్రోణులు ఏర్పడుతుంటాయని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ తెలిపారు. దీనికితోడు సముద్రం నుంచి తేమగాలులు రావడంతో వర్షాలు కురుస్తుంటాయని వివరించారు. గురువారం దక్షిణకోస్తాలో సముద్రం నుంచి వచ్చే తేమ కారణంగా మేఘాలు ఆవరించి భారీవర్షాలు కురిశాయన్నారు. రెండు, మూడు రోజులు ఈ వాతావరణం కొనసాగిన తర్వాత వర్షాలు తగ్గిపోతాయన్నారు.

## చేపల వేటకు వెళ్లి...
## ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

**నాలుగు మృతదేహాలు లభ్యం.. మరో ఇద్దరి కోసం గాలింపు**

కృత్తివెన్ను, ఏప్రిల్ 9: ఏటిపాయాల్లో చేపలు పట్టుకొనేందుకు పడవల్లో వెళ్లిన మత్స్యకారులు అకాల వడగండ్ల వర్షం ధాటికి గల్లంతయ్యాయరు. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం గుడిదిబ్బ పల్లిపాలెనికి చెందిన 15మంది మత్స్యకారులు, ఒర్లగొందితిప్ప గ్రామానికి చెందిన మరో ఐదుగురు మత్స్యకారులు వారి గ్రామాలకు సమీపల్లోనున్న పాయల్లో వలకట్ల చేపల వేటకు బుధవారం రాత్రి వెళ్లారు. వేట ముగించుకొని తెల్లవారుజామున తిరిగి బయల్దేరారు. ఈదురు గాలులు, వర్షంతో పాయలు పొంగి, పడవలన్నీ నీటమునిగాయి. గుడిదిబ్బ పల్లిపాలెం గ్రామానికి చెందిన 12మంది తీరానికి చేరుకోగా, ముగ్గురు గల్లంతయ్యారు. ఒర్లగొందితిప్పలో ఐదుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టి ఒర్లగొందితిప్పకు చెందిన జల్లా ఏసురాజు, జల్లా ముత్యాలును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. జల్లా పెద్దిరాజులు(60), జల్లా వెంకటేశ్వరరావు(52) మృతదేహాలు ఇంతేరు వద్ద ఒడ్డుకు చేరాయి. జల్లా దావీదు(22)కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వీరంతా ఒక కుటుంబానికి చెందినవారు. గుడిదిబ్బ పల్లిపాలెంలో గల్లంతైన వనమాలి వెంకటేశ్వరరావు(61), మోకా నాగేశ్వరరావు(62) మృతదేహాలు లభ్యం కాగా, బలగం నరసింహమూర్తి కోసం గాలిస్తున్నారు. మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే జోగి రమేష్, సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం తరపున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## రూపాయి రాలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే రోజాపై ప్రశంసల వర్షం కురిపించారు. చాలా మంది నేతలు మాస్కులు పంచి ప్రచారం చేసుకుంటున్నారని... వీరంతా రోజాను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. వెంకట్రామిరెడ్డి సెల్ఫీ వీడియోలో ఇంకా ఏమన్నారంటే... 'అందరికీ నమస్కారం... కరోనా వైరస్ గురించి ప్రపంచమంతా తల్లకిందులవుతోంది. అన్ని చోట్లా మున్సిపాలిటీల్లో గానీ, పంచాయతీల్లో గానీ కులాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా సహాయం చేయుచున్నారు. కానీ నగరి పరిస్థితికి వచ్చేసరికి ఒక ఎమ్మెల్యే గారు మాత్రమే అన్ని విధాలా అన్ని శాఖలవారికీ సహకరిస్తూ ముందుకు వస్తున్నారు.. మిగతా చోట్ల మాజీ కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు తమకు నచ్చిన విధంగా సహాయం చేస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం ఒక్కరు కూడా సాయం చేయడం గానీ, ముందుకు రావడం గానీ లేదు. నగరిలో నాలుగు కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రజలు ఇంత అవస్థ పడుతున్నారు. ఎమ్మెల్యే గారే కనుక ఆ సాయం కూడా చేయకపోయి ఉంటే ప్రజల పరిస్థితి ఎలా ఉండేది? అందరికీ భోజనాలు పెట్టిస్తూ ఐదు మండలాలకూ మీకు ఎంత అవసరమో నేను అరేంజ్ చేస్తాను.. డబ్బుల విషయం గానీ అని చెప్పారు. కాబట్టి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు.. అటువంటి ఎమ్మెల్యే ఉండాలి ఎక్కడైనా! మిగతా వారంతా మేము నాయకులమని ఎగబడతారు అన్ని విషయాల్లో.. ఇప్పుడసలు అడ్రసు లేరు. ఇపుడు మా దగ్గర కొచ్చి మాస్కులు తీసుకుంటారు.. కొందరు కుట్టిస్తాము.. ఏదో సేవ చేస్తామని, మాస్కులు పంచుతా ఉండామని డబ్బాలు కొట్టుకుంటున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేగారికి మా మున్సిపల్ శాఖ తరపున, పోలీసు, వైద్య సిబ్బంది తరపున ఎప్పటికీ ఆమెకు రుణపడి ఉంటాము. ప్రజలందరూ ఆలోచించండి... ఎమ్మెల్యేగారు ఎలా చేస్తున్నారు? మిగతావారు ఎవరన్నా పట్టించుకుంటున్నారా? ఏదో నాలుగు మాస్కులిచ్చేసి ఏదో ఘనకార్యం చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారి వీధుల్లోకి మేము, మా సిబ్బంది, పోలీసులు, ఏఎన్ఎంలు, డాక్టర్లు అందరం ధైర్యంగా వెళుతున్నాం. మాకు ఎలాంటి మాస్కులు ప్రభుత్వం నుంచీ రాలేదు. పీపీఈ డ్రస్సులు, గ్లవుజులు, బూట్లు లేవు. అయినా పోతున్నాం. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేయాలనే ఈ వీడియో పంపుతున్నా" అని వెంకట్రామిరెడ్డి తన సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు.

## రెఫరెన్స్ వేరు.. రికమండేషన్ వేరు!

**పొలిటికల్ 'పాలకమండళ్ల'పై మంత్రి సురేశ్ వివరణ**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని 14 యూనివర్సిటీల పాలక మండళ్లకు 63 మందిని రెఫరెన్స్‌ల (రాజకీయ సిఫారసులు) ఆధారంగా నియమించామని విద్యా శాఖా మంత్రి ఆదిమూలపు సురేశ్ పేర్కొన్నారు. ఎలాంటి రెఫరెన్స్‌లు లేకుండా 53 మందిని నియమించామన్నారు. నియామకాల్లో ప్రతిభకే ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడించారు. విశ్వవిద్యాలయాల పాలక మండళ్లను పక్కా రాజకీయ తరహాలో నింపడం... 'ఫలానా నేత సిఫారసు మేరకు నియమిస్తున్నాం' అంటూ నేరుగా నోట్‌ఫైల్‌లోనే రాసిన వైనం తీవ్ర విమర్శలకు దారి తీసింది. దీనిపై గురువారం హైదరాబాద్ లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. రెఫరెన్స్‌కు, రికమండేషన్‌కు చాలా తేడా ఉందంటూ సమర్థించుకున్నారు.

## లాక్‌డౌన్ తర్వాతే వైఫల్యాలపై మాట్లాడదాం: పవన్

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ తర్వాతే రాజకీయాలు, ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడదామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'కరోనా సమయంలో రాజకీయాలు, ప్రభుత్వంపై విమర్శలు చేయడం మన ఉద్దేశం కాదు. సంయమనం పాటిస్తూ ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అధికారుల నుంచి తగిన సహాయం, సేవలు అందేలా చూడాలి. లాక్‌డౌన్ పొడిగింపు, అప్పుడు అనుసరించే విధానాలపై ప్రధాని మోదీ త్వరలో ప్రకటన చేసే అవకాశం ఉంది. దాని ప్రకారం పేదలకు మనం ఏ విధంగా సహాయం చేయాలో ప్రణాళిక అమలు చేద్దాం' అని పవన్ తెలిపారు.



# వైద్యులపై వీరంగం

కరోనా బాధితులకు సేవలు అందిస్తున్న వైద్యసిబ్బందికి తగిన రక్షణ పరికరాలు సమకూర్చమని అడిగినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుధాకర్ అనే ఓ వైద్యుడిని సస్పెండ్ చేసింది. నర్సీపట్నం ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి చెందిన ఈయన చేసిన తప్పిదమల్లా రోగలక్షణాలతో వస్తున్నవారిని పరీక్షిస్తున్న వైద్యులకు మాస్కులు కూడా లేకపోతే ఎలా? అని ప్రశ్నించడమే. కనీస రక్షణలేని స్థితిలో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేయలేననీ, సెలవు ఇస్తే వెళ్ళిపోతాననీ అన్నాడు. తాను పనిచేస్తున్న ఆస్పత్రిలో తామంతా ఎదుర్కొంటున్న విషమస్థితిని మీడియాతో చెప్పుకుంటూ, తనతో వస్తే వాస్తవాలు చూపుతానన్నాడు. నర్సీపట్నంలో రెండు పాజిటివ్ కేసులు నమోదైన సందర్భంలో స్థానిక అధికారులు ఏర్పాటు చేసుకున్న సమావేశానికి తనను వెళ్ళనివ్వకపోవడంతో ఈ డాక్టర్ అక్కడ చేరిన మీడియాతో ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇది ప్రభుత్వానికి ఆలోచన బదులు ఆగ్రహం తెప్పించి సదరు వైద్యుడు సస్పెండ్ అయ్యారు. వ్యవహారం ఇంతటితో ఆగలేదు. ప్రభుత్వాన్ని, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను కించపరిచారంటూ ఆస్పత్రి సూపరెంటెండెంట్ ఆయనపై ఓ ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు ఈ దళిత వైద్యుడిపై కేసు కూడా పెట్టారు. ఇదంతా విన్న తరువాత, కరోనా మహమ్మారిని ముందే పసిగట్టి హెచ్చరించిన వైద్యుడిని చైనా ప్రభుత్వం వెంటాడివేధించిన ఘట్టం ఇప్పటికే గుర్తుకొచ్చి ఉంటుంది. ఆ వైద్యుడి హెచ్చరికలను చైనా బేఖాతరు చేసినందువల్లనే, యావత్ ప్రపంచం ఇప్పుడు పడరాని పాట్లు పడుతున్నది.

పాలకులకు లోటుపాట్లు ఎత్తిచూపితే నచ్చదు. అంతా సవ్యంగా ఉన్నదన్న తమ వాదనే అందరూ ఆమోదించాలని అనుకుంటారు. అది జరగనప్పుడు ఇలా నోరుమూయిస్తుంటారు. సుధాకర్ వాదన సత్యదూరమైతే ప్రభుత్వం ఖండించవచ్చు. ఆ ఆసుపత్రిలో ఎంతమంది సిబ్బంది ఉన్నారో, ఎన్ని మాస్కులు సమకూర్చారో, వాటిని వారంతా ఎంతకాలం వినియోగిస్తున్నారో, ఇతరత్రా రక్షణకవచాలు అక్కడ ఎన్ని పోగుబడివున్నాయో చెప్పవచ్చు. అదేమీలేకుండా, సస్పెండ్ చేయడం, కేసుపెట్టడం వల్ల ఆయన వాదనలను ప్రభుత్వం సమర్థంగా తిప్పికొట్టినట్టు కాదు. ప్రభుత్వం అన్నీ సమకూర్చినా సదరు డాక్టర్ అనవసరపు ఆరోపణలు చేశాడని ప్రజలు అనుకోకపోగా, ఈ చర్య వారికి నిరంకుశంగా కనిపిస్తుంది. కరోనా నివారణలో దేశానికే ఆదర్శంగా ఉండాలని హితబోధలు చేస్తున్నవారు ఒక వైద్యుడిపై ఇలా వ్యవహరిస్తే ఎలా? కరోనా ఎదుర్కొనే విషయంలో ప్రభుత్వాలు పడుతున్న కష్టాలు, లోటుపాట్లు ప్రజలకు తెలియనివేమీ కావు. మాస్కులు, పీపీఈల కొరత నిజం. సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాల్సింది పోయి కొరత ఎత్తిచూపినవారిని శిక్షించడం దుర్మార్గం. వైద్యులకు రక్షణ అక్కరలేదా అన్న సుధాకర్ ప్రశ్న అన్యాయమైనదేమీ కాదు. ఇప్పటికే మూడువందల యాభై పైచిలుకు బాధితులతో ఆంధ్రప్రదేశ్‌లో వ్యాధి తీవ్రమవుతున్న మాట నిజం. గత వారంలో దేశ సగటు కంటే నాలుగురెట్లు ఎక్కువగా రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు పెరిగాయన్న వాదనలున్నాయి. మూడోదశలోకి వస్తున్నామనీ, రెండు లక్షల పరీక్షలు చేయవలసి ఉన్నదని ప్రభుత్వ అధికారులే అంటున్నారు.

కరోనా లక్షణాలతో వస్తున్నవారి సంఖ్య పెరుగుతున్న కొద్దీ, వైద్యుల్లో భయం హెచ్చి రక్షణ పరికరాల కొరతను ఎత్తిచూపడం సహజం. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా బాధితుడికి సేవలు అందించిన డాక్టర్, హౌస్‌సర్జన్, ఇద్దరు స్టాఫ్‌నర్సులకు వైరస్ సోకింది. ఏకంగా నలుగురు వైద్య సిబ్బందికి కరోనా పాజిటివ్ వచ్చిన తరువాత కూడా మిగతా వైద్యులెవరూ నోరువిప్పకూడదంటే ఎలా? వారి రక్షణ అవసరాలన్నీ ప్రభుత్వం నిజంగానే తీర్చగలుగుతుంటే ఇటువంటి ఘటనలు ఎందుకు జరుగుతాయి? సమీక్షించుకోవాల్సి పోయి, వైద్యులపైనే అర్థంలేని ఆరోపణలు చేస్తే ప్రజల్లో ప్రభుత్వ పనితీరుపట్ల నమ్మకం సన్నగిల్లుతుంది. కర్నూలు జిల్లాలో ప్రభుత్వానికీ, ప్రైవేటు ఆస్పత్రులకు మధ్య రేగిన వివాదం కూడా సరిపడా రక్షణకవచాలు లేని దుస్థితిని తెలియచెబుతున్నది. కొవిడ్ రోగులకు తొలుత ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స అందించి, ఆ తరువాత పెరుగుతున్న అవసరానికి అనుగుణంగా ప్రైవేటు ఆస్పత్రులను వినియోగించుకోవాల్సి ఉంది. కానీ, అత్యధిక కరోనా కేసులతో అగ్రస్థానంలో ఉన్న కర్నూలులో ప్రభుత్వ ఆస్పత్రిని మినహాయించి ఎస్మా తప్పదన్న హెచ్చరికలతో ప్రభుత్వం నేరుగా ప్రైవేటు ఆస్పత్రులమీద పడింది. అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రులు నగరం మధ్యలోనే ఉన్నప్పటికీ, కర్నూలు ఆసుపత్రికి మాత్రం అదే కారణంగా చూపుతూ మినహాయింపునిచ్చింది. ఇలా ఒకపక్క ప్రభుత్వ వైద్యులను సిబ్బందినీ వదిలేసి, మరోపక్క తమకు మాస్కులు, పీపీఈలు ఇవ్వకుండా చికిత్స చేయమనడం ప్రైవేటు వైద్యులకు ఆగ్రహం కలిగిస్తున్నది. అరెస్టులకైనా సిద్ధమే కానీ, తగిన రక్షణలు లేకుండా వైద్యం అందించేది లేదని వారంతా అంటున్నారు. కరోనా కష్టకాలంలో వైద్యులను అవమానించడం, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయడం సమాజానికి ఎనలేని కీడుచేస్తుందని ప్రభుత్వం గుర్తించాలి.

## నార్లమాట

### అసామాన్యుడు



ప్రేమించేవారి వలె విద్వేషించేవారు, గౌరవించేవారి వలె తిరస్కరించేవారు, భూషించేవారి వలె దూషించేవారు ఒకే వ్యక్తికి విశేష సంఖ్యలో ఉంటే, అతడు నిశ్చయంగా అసామాన్యుడే. నవ భారత నాయకులలో ఇట్టి ఒక అసాధారణ వ్యక్తి డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్.

ఇంతేకాక, డాక్టర్ అంబేద్కర్ జీవితాన్ని గురించి, భావాలను గురించి, ఉద్యమాలను గురించి, వాటి సాఫల్య వైఫల్యాలను గురించి, నిష్పాక్షికంగా ఆలోచించటానికి కొంతకాలంగా కృషి జరుగుతుంది. ఇందుకు ఒక సరికొత్త నిదర్శనం 'అంబేద్కర్: ఎ క్రిటికల్ స్టడీ' అనే గ్రంథం. దీని రచయిత డాక్టర్ డబ్ల్యు ఎన్ కుబేర్. కుబేర్ వివరిస్తున్నట్టు అంబేద్కర్ జీవితం ఎంత ముఖ్యమైనదో ఆయన చింతన అంత ముఖ్యమైనది. కొన్ని విధాల ఆయన చింతనే మరింత ముఖ్యమైనది. అంబేద్కర్‌ను మించిన మేధావులు ఉండవచ్చు కాని నిర్భీతిగా ఆలోచించడంలో, ఆలోచించినదాన్ని నిర్భీకంగా వెల్లడించడంలో ఆయనను మించగలవారు లేరు. లోకంలో తనను ఎంతగా అపార్థం చేసుకున్నా, ఎంతగా ఆడిపోసుకున్నా ఎంతగా హింసించినా ఎంతమాత్రం సంచలించక తన ఆలోచనలను వెల్లడించగలవాడే నిజమైన మేధావి. అంబేద్కర్ వలె 'మేధావి' అనే ప్రశంసకు తగినవారు నవ భారతంలో బహుశా పట్టుమని పదిమంది కూడా లేరేమో!

అంబేద్కర్ వంటి పండితులుండవచ్చు. కాని, ఆ పాండిత్య వైవిధ్యంలో ఆయనను మించగలవారు లేరు. ఆర్థిక శాస్త్రం, న్యాయశాస్త్రం, సాంఘిక శాస్త్రం మొదలైన పెక్కింటిలో ఆయన ప్రథమ శ్రేణికి చెందినవారు. మేధావులైన వారు, పండితులైన వారు ప్రజానాయకులుగా రాణించడం చాలా అరుదు. నవ భారత నాయకులలో అంబేద్కర్ స్థానం గాంధీ, జిన్నాల స్థానం తర్వాత. వారిద్దరిలో కానరాని ఒక ప్రత్యేక విశేషం అంబేద్కర్‌లో ఉండేది. అది ఆయన ఆధునిక దృష్టి. ఆధునికత్వం ప్రాతిపదికగా ఒక జీవిత విధానాన్ని రూపొందించడానికి ఆయన ప్రయత్నించారు.

*1973 మే 14 ఆంధ్రజ్యోతి సంపాదకీయం 'అంబేద్కర్' నుంచి*

# బ్రాండ్ మోదీ కాదు, టీమ్ఇండియా ముఖ్యం

**■ రాజ్‌దీప్ సర్దేశాయి**



దీపశిఖ

నరేంద్ర మోదీ ఉన్నప్పుడు ప్రజలు మరో నేతకు నీరాజనాలు పడతారా? పట్టరు, పట్టబోరనే ప్రగాఢ విశ్వాసం తోనే భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లపై నేరుగా 'మోదీకి సాటి రాగల మేటి ఎవరు?' అనే ప్రశ్నాస్త్రాన్ని సంధించింది. అలా నాయకత్వ అంశానికి అమిత ప్రాధాన్యాన్ని సంతరింపచేయడం ద్వారా ఆ ప్రజాస్వామ్య పోరాటాన్ని ఇంచుమించు అధ్యక్ష తరహా ఎన్నికల పోరాటంగా బీజేపీ మార్చి వేసింది. ఐక్యత నామ మాత్రంగాకూడా లేని ప్రతిపక్షాలు 'మహాబలుడు' మోదీని సమర్థంగా ఎలా ఎదుర్కోగలుగుతాయి? బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించింది. మోదీ రెండో ప్రభుత్వం పెనుమార్పులకు ఉపక్రమించింది. ఇంతలోనే కొవిడ్19 సంక్షోభం ముంచుకొచ్చింది. 29 రాష్ట్రాల ముఖ్య మంత్రులు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు మొక్కవోని దీక్షతో కరోనా వైరస్‌పై మహా పోరాటం చేస్తున్నారు. భవిష్యత్తులో నాయకత్వ ప్రత్యామ్నాయాల సంగ్రహావలోకానికి కరోనా కల్లోలం ఎంతైనా పురిగొల్పుతోంది.

స్వతంత్ర భారత దేశ చరిత్రలో కొవిడ్ 19 సంక్షోభం లాంటి విషమ పరిస్థితి ఇంతకుముందెన్నడూ నెలకొనలేదు. ఒకటి రెండు రాష్ట్రాలలోగాక ఆసేతు హిమాచలం ఈ ఆత్యయిక స్థితి ఏర్పడ్డది. కరోనాపై ఈ మహా సమరంలో అగ్రగామిగా పరిగణన పొందేందుకు ముఖ్యమంత్రులు పోటీ పడుతున్నారు. గతంలో రాష్ట్రాలు వేర్వేరుగా వరదలు, కరువులు, సునామీ లాంటి ప్రాకృతిక విపత్తులు, సామాజిక దుర్ఘటనల బారిన పడ్డాయి. వాటినవి చాలవరకు సొంతంగా ఎదుర్కొని కష్టాలను అధిగమించాయి. అయితే యావద్భారత రాష్ట్రాల సంయుక్త సంకల్పం ఒక మహా విషమ పరీక్షకు గురికావడం ఇదే మొదటిసారి. ఒక విధంగా నిజమైన అధికారాలు, బాధ్యతలు ఢిల్లీలో కాక, రాష్ట్ర రాజధానులలో వున్నాయనే విషయాన్ని ఈ దేశ పాలకులకు, ప్రజలకు కరోనా సంక్షోభం తిరుగులేని విధంగా గుర్తు చేసింది. 'ఢిల్లీ రాజే' కాకుండా ఎంతో విభిన్న నాయకులు ఈ దేశంలో వున్నారని, విలక్షణ నాయకత్వ శైలులు వర్ధిల్లుతున్నాయనే సత్యాన్ని మోదీ కేంద్రిత రాజకీయ విశ్వం ఎట్టకేలకు గుర్తించి, అంగీకరించడం అనివార్యమయింది.

ఆ సత్యానికి ఒక తార్కాణం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధావ్ ఠాక్రే. కీర్తిశేషుడైన తండ్రి బాల్ ఠాక్రే 'ఛరిష్మా' (జన సమ్మోహన శక్తి) ఏమాత్రం లేకపోవడంతో పాటు ఎలాంటి పాలనానుభవం కూడాలేని ఉద్ధావ్ ఒక 'యాదృచ్ఛిక' ముఖ్యమంత్రి మాత్రమేనన్న భావన ప్రజలలో విస్తృతంగా వున్నది. గత నవంబర్‌లో ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన ఉద్ధావ్ తొమ్మిది నెలలైనా గడవక ముందే కరోనా వైరస్‌పై మహారాష్ట్ర పోరాటానికి ఒక 'ప్రతీక'గా భాసిల్లుతున్నారు. మరాఠీ న్యూస్ టెలివిజన్‌లో ఉద్ధావ్ ప్రతిరోజూ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ కరోనాపై యుద్ధాన్ని నిర్దేశిస్తున్నారు. ఆయన రోజువారీ ప్రసంగాలు మహారాష్ట్ర ప్రజలకు ప్రస్తుత సంక్షోభ సమయంలో ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయనడం సత్య దూరం కాదు. వైరస్ వ్యాప్తిని నిర్దిష్ట కుల మతాలకు అంటగంటే ప్రయత్నాలను ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అటువంటి కుత్సిత ప్రయత్నాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షిస్తామని ఉద్ధావ్ హెచ్చరిస్తున్నారు. కరోనాపై ఉద్ధావ్ సాగిస్తున్న పోరు ఆయన నేతృత్వంలో శివసేన, తన మౌలిక వైఖరుల నుంచి ఎంత దూరం ప్రయాణించిందో స్పష్టం చేసింది. మార్చి తొలినాళ్ళలో ముంబైలో తబ్లీఘ్ జమాత్ మత సమ్మేళనానికి మహారాష్ట్ర పోలీసులు అనుమతినివ్వడానికి ససేమిరా అన్నారన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. ముంబై పోలీసులకు భిన్నంగా ఢిల్లీ పోలీసులు తమ విధ్యుక్తధర్మ నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించడం ఎటువంటి ఉత్పాతానికి దారి తీసిందో మరి చెప్పనవసరం లేదు.

కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కూడా ఆ సత్యానికి ఒక నిండు తార్కాణమే. దేశంలో వామపక్షాలు అధికారంలో వున్న ఏకైక రాష్ట్రం కేరళ. విజయన్ ఇంతవరకు కేరళకే పరిమితమైన ఒక స్థానిక రాజకీయనాయకుడుగా మాత్రమే సుపరిచితుడు. కరోనా సంక్షోభం ఆయన ఒక విభిన్న, విలక్షణ నాయకుడు అనే విషయాన్ని దేశానికి చాటిచెప్పింది. కరోనా బాధితులైన పేదలకు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడం గానివ్వండి, వైరస్ బాధితులు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాల నేర్పాటు చేయడం గానివ్వండి, మరీ ముఖ్యంగా లాక్‌డౌన్‌ను అమలుపరచడంలో గానివ్వండి కేరళ దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. ప్రజారోగ్య వ్యవస్థకు అత్యధిక స్థాయిలో నిధులు కేటాయించే సంప్రదాయం కేరళకు మొదటి నుంచీ వున్నది. ఇది, నిస్సందేహంగా ఒక సానుకూల అంశమే అయినప్పటికీ కరోనాపై పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళడంలో విజయన్ పాత్ర విస్మరించలేనిది.

కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో పలు రాజకీయ పార్టీల నేతృత్వంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సమర్థంగా వ్యవహరిస్తున్నాయి. ఉదాహరణకు పంజాబ్‌లో వలసకూలీలు పంటకోతల తరుణం ముగిసేవరకు వ్యవసాయ క్షేత్రాల్లోనే ఉండిపోయేందుకు ప్రోద్బలంగా వారికి ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని



srini

> నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి అయినప్పుడు తనను తాను 'టీమ్ ఇండియా' కెప్టెన్‌గా చెప్పుకున్నారు. అధికారాల కేంద్రీకరణను అరికట్టి 'సహకార సమాఖ్య పద్ధతి'ని సువ్యవస్థితం చేయాలని ఆయన నొక్కి చెప్పారు. కరోనా మహమ్మారిపై జాతి సమష్టి సమరం సాగించేందుకు ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ప్రాకృతిక విపత్తులు, సామాజిక సంక్షోభాల నెదుర్కోవడంలో అనుభవమూ, అవగాహన వున్న సమర్థులతో 'జాతీయ కార్యాచరణ బృందం'నొకదాన్ని తక్షణమే ఏర్పాటుచేసేందుకు ప్రధానమంత్రి పూనుకోవాలి.

సమకూర్చడానికి ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ వెనుకాడలేదు. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దినసరి కూలీలకు, సన్నకారు రైతులకు ఆదాయ భరోసా కల్పించారు. ఒడిషాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కరోనా రోగుల చికిత్సకు శీఘ్రగతిన ఒక అధునాతన ఆస్పత్రిని నిర్మించారు. ఛత్తీస్ గఢ్‌లో ముఖ్యమంత్రి భూపేస్ బాఘెల్ ప్రతి ఒక్కరికీ నిత్యావసర సరుకులను అదనంగా సరఫరా చేసేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టారు. అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని రాజస్థాన్ ప్రభుత్వం భిల్వారా నగరంలో కరోనా వైరస్‌ను అరికట్టేందుకు అనుసరించిన పద్ధతులు ఇప్పుడు దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం విస్తృతంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆస్పత్రులకు నాణ్యమైన వైద్య పరికరాలను సమకూర్చింది. అసోంలో సోనోవాల్ ప్రభుత్వం కరోనా నెదుర్కొనేందుకు తన వైద్య పరమైన సంసిద్ధతను ప్రశస్తంగా మెరుగుపరచుకున్నది. బెంగాల్‌లో మమతా బెనర్జీ 'సఫల్ బంగ్లా' పథకం కూరగాయల ధరలను అదుపులో ఉంచింది.

కరోనా యుగంలో కేంద్రరాష్ట్ర సంబంధాలకు ఒక కొత్త రూపునివ్వాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఒక కొత్త పద్ధతిలో ఆ సంబంధాలను పునర్నిర్మించుకోవడం చాలా ముఖ్యం. 'ఢిల్లీ పాలకులకు అన్ని తెలుసు' అనే మనస్తత్వం ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ వ్యవస్థలోను విస్తృతంగా వుండేది. దీనివల్ల విధాన నిర్ణయాలుతీసుకునే అధికారాలన్నీ కేంద్రీకృతమైపోయాయి. మోదీ పాలనలో పెద్ద నోట్ల రద్దు, అధికరణ 370 రద్దు మొదలైన ప్రధాన నిర్ణయాలు అన్నిటినీ కనీస సంప్రదింపులతో మాత్రమే తీసుకోవడం జరిగింది. ఎంతో విస్తృత చర్చ అవసరమైన ఆ నిర్ణయాలను దాదాపు ఏకపక్షంగా తీసుకోవడం వల్లే ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలలో గరిష్ఠ విధ్వంసానికి దారితీశాయి. విధాన నిర్ణయాలలో 'ఆదేశించి, నియంత్రించే' ధోరణి ప్రత్యామ్నాయ అభిప్రాయాలను సహించదని మరి చెప్పనవసరంలేదు. కరోనా వైరస్‌పై యుద్ధం లాంటి పరిస్థితులలో ఇటువంటి వ్యవహార శైలిలో మౌలిక మార్పులు చోటుచేసుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడానికి స్వస్తిచెప్పి, సంబంధిత వ్యక్తులు, సంస్థలు విధాన నిర్ణయాలలో భాగస్వాములను చేయవలసివుంది మరింత స్పష్టంగా చెప్పాలంటే విధాన నిర్ణయాలను వైయక్తికంగా కాకుండా విస్తృత సమాలోచనలతో సమష్టిగా తీసుకోవాలి. కరోనాపై పోరులో దేశవ్యాప్తంగా అమలులో వుండేలా ఒకే నిబంధనావళిని రూపొందించుకోవల్సిన అవసరమున్నది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, భారత వైద్య పరిశోధనా మండలి, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో కలసికట్టుగా కృషి చేసేందుకు జాతీయ నిబంధనావళి ఎంతైనా అవసరం. ప్రైవేట్ ల్యాబ్స్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అనుమతినివ్వడం లేదా డాక్టర్లు, నర్సులకు వ్యక్తిగత పరిరక్షణ సామగ్రి సత్వర సరఫరా మొదలైన విషయాలలో నిర్ణయాలు తీసుకోవడంలో అనవసర జాప్యం జరుగుతుందని పలు రాష్ట్ర ప్రభుత్వాలు వాపోతున్నాయి. కరోనాపై పోరులో శీఘ్ర నిర్ణయాలు తీసుకోవలసివున్నవేళ ఇటువంటి జాప్యం మేలు చేస్తుందా?

ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకోవల్సివుంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన తరచు రాష్ట్ర స్వతంత్ర ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని విమర్శిస్తుండేవారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసే విషయమై చర్చించేందుకు ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ తొలిసారి మార్చి 20న మాత్రమే సమావేశమయ్యారు. అప్పటికే దేశంలో కరోనా కేసుల సంఖ్య 200కి మించిపోయింది. ఐదు రోజుల అనంతరం కేవలం నాలుగు గంటల వ్యవధిలో దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను అమలు పరచనున్న విషయాన్ని ప్రజలకు మోదీ తెలియజేశారు. అయితే ముఖ్య మంత్రులకు ఈ విషయాన్ని ఆయన ముందస్తుగా తెలియజేయలేదు. 'తొమ్మిది నిమిషాల పాటు విద్యుత్ దీపాలు ఆర్పివేసి దివ్వెలు వెలిగించాలనే' కార్యక్రమానికి పిలుపునిచ్చే ముందు కూడా ముఖ్యమంత్రులనుగానీ, రాష్ట్ర విద్యుత్ మంత్రులనుగానీ ప్రధాని మోదీ విశ్వాసంలోకి తీసుకోలేదు. కరోనా బాధిత వర్గాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించే విషయంలో కూడా రాష్ట్రాల ఆర్థిక మంత్రులను ప్రధాని మోదీ సంప్రదించనేలేదు ఇటీవల మాత్రమే ఆయన కరోనా సమస్యపై ప్రతిపక్ష నేతలతో చర్చలు జరపడం ప్రారంభించారు. నిజానికి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడే నెల రోజుల క్రితమే ఆయన ఈ చర్చలు, సంప్రదింపులను ప్రారంభించివుంటే బావుండేది.

మోదీ తొలిసారి ప్రధానమంత్రి అయినపుడు తననుతాను 'టీమ్ ఇండియా' కెప్టెన్‌గా చెప్పుకున్నారు. కేంద్రీకృత అధికార వ్యవస్థ స్థానంలో 'సహకార సమాఖ్య పద్ధతి'ని సువ్యవస్థితం చేయాల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. తన ఈ స్ఫూర్తిదాయక మాటలను కార్యాచరణ లోకి తీసుకురావాల్సిన సమయమాసన్నమయింది. కరోనాపై సమష్టి సమరం సాగించేందుకు ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు; ప్రాకృతిక విపత్తులు, సామాజిక సంక్షోభాల నెదుర్కోవడంలో అనుభవమూ, అవగాహన వున్న సమర్థులతో ఒక 'జాతీయ కార్యాచరణ బృందం' (నేషనల్ టాస్క్ ఫోర్స్)ను తక్షణమే నేర్పాటుచేసేందుకు ప్రధాని మోదీ పూనుకోవాలి. ఈ మహాయుద్ధానికి 'జనరల్' మోదీ నేతృత్వం వహించాలి. అయితే ప్రతి 'బ్రిగేడ్' కమాండర్ సమర సామర్థ్యాన్ని గుర్తించి, గౌరవించాలి. కరోనాపై యుద్ధంలో 'టీమ్ ఇండియా'దే ప్రధాన పాత్ర కావాలి; 'బ్రాండ్ మోదీ' గౌణ పాత్ర వహించాలి.

*(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)*

## వాస్తవాలు గ్రహించాలి!



ఈ దేశంలో మతం అనేది మనిషిని వదలనంతగా మన జీవితాలతో ముడివేసుకొని పోయింది. ఆయా మతస్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏమాత్రం మార్పు లేకుండా, మార్చుకోవడానికి వీలు లేకుండా తమ మతాన్ని సాధారణ జనంపై రుద్దుతూనే ఉన్నారు. ఈ ధోరణి అన్ని మతాల్లోనూ ఉన్నప్పటికినీ ఇస్లాం మతంలోని 'తబ్లిఘ్ జమాత్' వారు మరికొంత సాంప్రదాయులు. ప్రాపంచిక వ్యవహారాలపై దృష్టి పెట్టరు. సామాజిక మార్పులను పట్టించుకోరు. అల్లాహ్ బోధనలను తూచా తప్పకుండా పాటించాలని, నమాజ్‌ను, తదితర నియమాలను అనుసరించాలని బోధనలు చేస్తుంటారు. ప్రపంచ ముస్లింలలో వీరిని అనుసరించేవారు కోట్ల సంఖ్యలో ఉన్నట్లుగానే వీరి వాదనలు, బోధనలు అంగీకరించనివారు, అనుసరించనివారు అంతకు అనేక రెట్లు ఉన్నారు. ఇస్లాం మతంలోని వివిధ జమాతులను అనుసరించేవారు గమనించవల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. దేశ రాజ్యాంగానికి లోబడే తమకు హక్కులు కల్పించబడ్డాయని, ఆ మేరకు పౌరులుగా తమందరిపై బాధ్యతలుంటాయని గ్రహించాలి. సైన్స్ సాధించిపెట్టిన ఆధునిక వసతులను, సదుపాయాలను, సౌకర్యాలను అనుభవిస్తున్నట్లుగానే మారుతున్న ప్రాపంచిక పరిస్థితుల్ని పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి. ఈ విషయాలను జమాతుల ద్వారానే సాధారణ ముస్లింలకు చేరవేయాలి. ఎందుకంటే ఈ జమాతుల ప్రభావం వీరిపైనే ఎక్కువగా ఉంటుందని ఇటీవలి సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

> దయచేసి అందరూ, ముఖ్యంగా ముస్లింలు, రోజువారీ సమాజాన్ని గమనించండి. తెలుసుకోండి. వైద్యులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాధికారులు ఇస్తున్న సూచనలను గమనించండి. ప్రభుత్వాదేశాలను, సూచనలను అనుసరించండి. రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకొని అనుసరించండి. ముస్లింలతో పాటు మిగతావారూ భావోద్వేగాలను విడనాడి నిజానిజాలు గ్రహించాలని కోరుతున్నాం.

ముస్లింలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విభజన రేఖలు గీస్తున్న వర్గం ఇప్పటికే నిజాముద్దీన్ సభ విషయంలో అనేక అసత్యాలను ప్రచారంలోకి తెచ్చింది. భారతీయులను నాశనం చేయడానికే ముస్లింలు సభ నిర్వహించారని ప్రచారాలు చేస్తున్నారు. అదే నిజమైతే ఆ సభకు వెళ్లొచ్చినవారు మజీదులకో, తమ ఇళ్లకో ఎందుకు వెళ్తారు? కుటుంబ సభ్యులకే కరోనా అంటించరు కదా! ముస్లింలనే టార్గెట్ చేసే పైవర్గంతోపాటు మీడియా కూడా బాధ్యతారాహిత్యంగా విషం చిమ్మడం చూస్తున్నాం! WHO సూచనలను అనుసరించి విదేశీయుల రాక పోకలను కట్టడిచేసి ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదు. నిజాముద్దీన్ సభ మీదే దృష్టి కేంద్రీకరించి, దాదాపు 55 వేల మంది గడిచిన నెల రోజుల్లో విదేశాల నుంచి భారతదేశానికి వచ్చారనే విషయాన్ని విస్మరిస్తున్నామేమో!

నిజాముద్దీన్ సభకు వెళ్లి వచ్చిన జమాత్ సభ్యులారా! మీ కుటుంబ సభ్యుల విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. ప్రభుత్వాలు, పోలీసులు, వైద్యులకు సహకరించండి. లేదంటే మొత్తం ముస్లిం సమాజం నింద మోయాల్సి వస్తున్నది. మతం పేరిట ఆధునిక రాజకీయ, సామాజిక, వైద్య విధానాలను, అభివృద్ధిని విస్మరించడాన్ని మేం సమర్థించం. అలా విస్మరిస్తే ఒక్క ఇస్లాం సమాజానికే కాదు, సహ సమాజం అంతటికి హాని చేసిన వారవుతారు. దయచేసి అందరూ, ముఖ్యంగా ముస్లింలు రోజువారీ సమాజాన్ని గమనించండి. తెలుసుకోండి. వైద్యులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాధికారులు ఇస్తున్న సూచనలను గమనించండి. ప్రభుత్వాదేశాలను, సూచనలను అనుసరించండి. రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకొని అనుసరించండి. ముస్లింలతోపాటు మిగతావారూ భావోద్వేగాలను విడనాడి నిజానిజాలు గ్రహించాలని కోరుతున్నాం.

*ఖాజా, డా.రియాజ్ మహమ్మద్, వహీద్ మహమ్మద్, సయ్యద్ ఖుర్షీద్, నబి కరీమ్ ఖాన్ (ఒంగోలు), నస్రీన్ ఖాన్, డా.అఫ్సర్, ఎస్.పి.గఫార్, సైబాబ, ఎస్.పి.మహమూద్, షఫీ షేక్, షేక్ మస్తాన్ వలి (కడప), ఇనాయతుల్లా (కర్నూలు), డా.మహమ్మద్ రఫీ, అక్బర్ (ఆర్టిస్ట్), నిసార్ (వాగ్గేయకారులు)*

**❑ ముస్లిం థింకర్స్ ఫోరమ్**

# కరోనా అనంతర సమాజం

జనవరి 2020 కి ముందున్నది కరోనా పూర్వ సమాజం. తర్వాతిది కరోనా ప్రభావిత సమాజం.. కరోనా అనంతర సమాజం. ఈ అనంతర ప్రపంచం ముందటి ప్రపంచంలా ఉండదు.

సెప్టెంబర్, 2011లో అమెరికాలోని ట్విన్ టవర్స్ మీద ఉగ్ర దాడి జరిగింది. ఆ తరువాత ప్రపంచ వ్యాప్తంగా భద్రతా వ్యవస్థలో అనూహ్యమైన మార్పు వచ్చింది. ఇదే విధంగా వైరస్ అనంతర ప్రపంచంలోనూ ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి.

ఆరోగ్య, వైద్య రంగాలలో అత్యున్నత శిఖరాలను అధిరోహించామని భావించే అభివృద్ధి చెందిన దేశాలు కరోనా ముందు వెలవెలబోతున్నాయి. ఇరవయ్యో శతాబ్దం అజేయమైన శాస్త్ర, సాంకేతిక విజయాలను అనేకం సాధించిందని నమ్ముతున్నాం. ఈ అజేయం అని మనం విశ్వసిస్తున్న శాస్త్ర సామర్థ్యం ఏ మేరకు అజేయం అన్నది కరోనా సంక్షోభమే తెలుపుతోంది.

ప్రకృతి మనిషికన్నా శక్తిమంతమైనదా కాదా? నిజంగానే ఆధునిక మానవుడు అంతకుమించిన శక్తిని సంతరించుకున్నాడా? ప్రజాస్వామ్యం మంచిదా లేక నియంతృత్వం దిశగా అడుగులు వేయటం అనివార్యమా? ప్రపంచీకరణ మంచిదా లేదా జాతీయ, ప్రాంతీయవాదాలకు పరిమితం కావటమే మానవజాతికి శ్రేయస్కరమా? మానవాళి ఆలోచనకు కరోనా పెట్టిన ఇటువంటి అంశాలు, సంశయాలు అనంతం.

మానవ నాగరికత ఇకముందు యుద్ధం, కరువులు, మహమ్మారులకు ఎర కావలసిన అవసరం లేదని ఘంటాపథంగా చెప్పిన శాస్త్రవేత్తల కథనాలు కాకమ్మ కబుర్లేనా? హోమోసెపియన్స్ ఇపుడు హోమో డుయస్‌గా రూపాంతరం చెందాయనటం నిజమా కాదా?

ఎవరి బతుకులు వాళ్ళే బతకాలి. ఎవరి చావు వాళ్ళే చావాలని దేశాధినేతలు అందరూ అంటున్నారు. ప్రపంచం అంటే ఒక పెద్ద షాపింగ్ మాల్ తప్ప మరింకేమీ కాదని ఒప్పుకుంటున్నారు. ప్రజలకు సంబంధించిన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. చైనా, అమెరికాల మధ్య సాగుతోన్న మాటల యుద్ధం కన్నా దీనికి పెద్ద తార్కాణం అవసరం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, కరోనాని చైనా వైరస్ అంటున్నాడు. ఇది అమెరికా తలపెట్టిన ప్రయోగం తాలూకు వైఫల్యం అని చైనా అంటున్నది. ఈ వైరస్‌తో తమ దేశం పేరును జోడించటం పట్ల అభ్యంతరం చెబుతున్నది. 1918లో స్పానిష్ ఫ్లూ అనేవారు కాబట్టి దీనిని చైనా వైరస్ అనటంలో తప్పేంలేదని అమెరికన్ అధికారులు వాదిస్తున్నారు.

ఒక వైపున భయం, మరో వైపున నమ్మకం. ఒక విచిత్రమైన విరోధాభాసలో ఉన్నాం. బెట్రాండ్ రస్సెల్ 'ఇన్ఫ్రా రేడియోస్కోప్' శీర్షికతో ప్రపంచం అణుయుద్ధ ప్రమాదం గురించి ఆందోళనకు గురి అయివున్న సందర్భంలో ఒక కథ రాశారు. మంగళ గ్రహవాసులు భూమండలాన్ని ఆక్రమించుకునే యత్నంలో వున్నట్లు 'ఇన్ఫ్రా రేడియోస్కోప్' యంత్రం కనిపెడుతుంది. సైంటిస్టుల పేరుతో జరిగిన ఈ ప్రచారం అగ్ర రాజ్యాలు ఏకం అయ్యేలా చేస్తుంది. ఒక సదుద్దేశంతో రూపొందించిన ఈ పథకం ఒక దశలో బట్టబయలు అవుతుంది. అగ్రరాజ్య కూటములు తిరిగి మళ్ళీ ఘర్షణకు దిగుతాయి. మళ్ళీ యుద్ధాలు.. మారణ హోమాలు.. ప్రపంచ వినాశనం.. అని ఈ కథ ఒక హెచ్చరిక చేస్తుంది. తమ విధేయతలను, ప్రాధాన్యాలను కొత్త పద్ధతిలో తిరిగి నిర్వచించుకుని, దానికి అనుకూలంగా వ్యవహరించని పక్షంలో ఈ వినాశనాన్ని నివారించటం అసాధ్యం అని ప్రబోధిస్తుంది.

రాసేల్ కార్సన్ 'ది సైలెంట్ స్ప్రింగ్' కూడా ఇదే రకమైన హెచ్చరిక చేస్తుంది. క్రిమి సంహారకాలు, కీటక నాశనులతో కేవలం క్రిమికీటకాలే కాదు, మెలమెల్లగా ప్రాణికోటి, అంతిమంగా ప్రకృతి కూడా అంతం అవుతుందని చెబుతుంది. ఇటువంటి ప్రమాదాలనే జాన్ హర్సే రచన 'హిరోషిమా' కూడా ప్రస్తావించింది. రసాయనిక ఆయుధాలు కేవలం ప్రాణాంతకమైనవి మాత్రమే కాదు, అవి ప్రపంచ మానవాళి ముంగిట తెరుచుకుంటూన్న నరక ద్వారాలని వివరించింది. మానవ నిర్మిత ఆయుధాలు, రసాయనాలు లేదా ఇతర గ్రహాల ఆక్రమణల పరిణామాలను ఇపుడు ఈ కరోనా సంక్షోభం నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యం పునాదులు అత్యంత బలంగా ఉన్నాయనుకునే యూరప్ రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం నియంతృత్వ ప్రమాదం నుంచి చాలా ముందుకు వచ్చానని భావించింది. ప్రస్తుతం అక్కడ యువకులు, వృద్ధులకు అందించే వైద్యం విషయంలో చూపుతున్న వివక్ష, మానవ హక్కులు, మటుమాయం అవుతోన్న రాజ్య సంక్షేమ స్వభావం దాచేస్తే దాగని అనేకానేక సత్యాలను ఆవిష్కరిస్తున్నాయి.

> రాజ్య నియంత్రణ లేని నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థని యథాతథంగా కొనసాగించడమా లేదా సారభూత ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతపరచటమా? ఇదీ ఈనాడు ప్రపంచ మానవాళి ముందు పడగ విప్పిన ప్రధానమైన ప్రశ్న. కరోనా అనంతర సమాజం తీసుకునే నిర్ణయం మీదనే మానవాళి భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

కరోనా అనంతర సమాజం అనేక మౌలికమైన ప్రశ్నలను సంధించబోతున్నది. ప్రజాస్వామ్యం గురించీ, పౌరసత్వం గురించీ మళ్ళీ సరికొత్త ప్రశ్నలతో సంసిద్ధం అవుతున్నది. ఆరోగ్య పరిరక్షణ విషయంలో పౌరులకు రాజ్యం ఏ మేరకు స్వేచ్ఛ ఇస్తుంది, ఏ మేరకు నియంత్రిస్తుంది అనే అంశాన్ని చర్చకు తెస్తుంది. ఇటలీ వర్సెస్ చైనా, చైనా వర్సెస్ బ్రిటన్ వర్సెస్ రష్యా వంటి చర్చలు అనివార్యంగా ముందుకు వస్తాయి. కేవలం మార్కెట్ నియమ నిబంధనలను పరిరక్షించటమే ప్రధాన ధ్యేయంగా భావిస్తున్న రాజ్యం, ఉదారవాద ఆర్థిక విధానాల వైఫల్యం గురించిన చర్చలు, వివాదాలు ఇకముందు మరిన్ని కొత్త పుంతలు తొక్కనున్నాయి.

కరోనా వైరస్ వూహాన్ ప్రయోగశాలలోంచి వచ్చిందా, గబ్బిలంలోంచి వచ్చిందా, ఆధునిక మానవుని మితిమీరిన స్వార్థం కారణంగా అదుపు తప్పిన జీవ రసాయనిక ప్రయోగాల దుష్ఫలితమా అనేది తక్షణం తేలే అంశం కాదు. అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం వలన కలిగిన నష్టంతో పోల్చితే అనేక రెట్లు ఎక్కువ నష్టం ఈ వైరస్ వల్ల కలగబోతోందని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. అత్యంత అమానవీయమైన నయా ఉదారవాద ప్రపంచీకరణ నిజ స్వరూపాన్ని వైరస్ బట్టబయలు చేసింది. అయితే, ఈ ప్రపంచీకరణను ప్రవచించిన సిద్ధాంతకర్తలు పెట్టుబడి, పారిశ్రామిక ఆదానప్రదానాలు మంచివే అని మళ్ళీ చెప్పటానికి ప్రయత్నిస్తారు. నియంత్రణ లేని రీతిలో సాగుతూన్న మనుషుల రాకపోకల వల్లనే ముప్పు ఏర్పడనుందని సిద్ధాంతీకరిస్తారు. ప్రపంచీకరణ గతం కన్నా వేగంగా ముందుకు సాగేలా చేయటానికి ఎంతకైనా తెగిస్తారు.

ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, సంస్కృతి, పని ప్రదేశాల స్థితిగతులు వాతావరణం, వీటన్నింటికీ సంబంధించిన మౌలికమైన మార్పులు రేపటి ప్రపంచంలో అనివార్యం అవుతాయి. ఏ ఆర్థిక విధానాలు ప్రపంచాన్ని ఈ స్థితికి తీసుకు వచ్చాయనే మీమాంస ఊపిరి పోసుకుంటుంది. నయా ఉదారవాద విధానాల కారణంగా పెరుగుతూ వస్తూన్న అసమానతల్నీ, వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వాల్నీ, ఆ ప్రభుత్వాలలో వున్న అమానవత్వాన్నీ స్పష్టంగా అర్థం చేసుకునే సందర్భాన్నీ, అవకాశాన్నీ కరోనా కల్పించింది. నయా ఉదారవాదంలోని డొల్లతనాన్ని బలంగా బయటపెట్టింది. అమెరికా తిరుగులేని





ఒక అగ్రరాజ్యం కనుక అది ఎటువంటి పరిస్థితినైనా అతి సునాయాసంగా ఎదుర్కోగలదని ప్రపంచ వ్యాప్తంగా అధిక సంఖ్యాకుల నమ్మకాన్ని ఇది వమ్ము చేసింది.

పెట్టుబడిదారీ విధానానికీ, మార్కెట్ ఎకానమీకీ అమెరికా అతి పెద్ద నమూనా. ప్రజల ధన, మాన, ప్రాణాల పరిరక్షణకు పూర్తి బాధ్యత వహించవలసిన అక్కడి ప్రభుత్వం అందుకు ఎంతమాత్రం సంసిద్ధంగా లేదు. అమెరికాలో ఏదీ తయారు కాదు. వస్తువుల ఉత్పత్తితో సంబంధం లేని వ్యవస్థను అది బలోపేతం చేసుకుంది. అమెరికాలో వెంటిలేటర్లు లేవు. కనీసం శానిటైజర్లు లేవు. అన్నీ చైనా నుంచి రావాలి. అమెరికాలో ఒక డిఫెన్స్ చట్టం వుంది. ఇటువంటి స్థితిలో ఆ చట్టాన్ని అమలు చేయవచ్చు. అన్ని పనులు నిలిపివేసి వెంటిలేటర్లు తయారు చేయమని ప్రైవేటు కంపెనీలను ఆదేశించవచ్చు. అది మార్కెట్ ప్రయోజనాలకు ప్రతికూలం కాబట్టి ట్రంప్ ఆ పని చేయడు. పైగా జనం పెద్ద సంఖ్యలో చనిపోతారని పబ్లిగ్గా అంగీకరిస్తున్నాడు. పరిశ్రమల జాతీయకరణకు అమెరికా పూర్తిగా వ్యతిరేకం అంటున్నాడు. అమెరికాలో మార్కెట్ ఫండమెంటలిజం పరాకాష్టకు చేరుకుంది. అందుకే అక్కడి ప్రభుత్వం మార్కెట్ జోలికి వెళ్ళజాలదు. మార్కెట్ ద్వారానే ఆర్థిక వ్యవస్థ నిర్వహణ జరిగేలా చూస్తుంది. దాని కోసం ఎటువంటి దారుణమైన నిర్ణయం తీసుకునేందుకైనా అది సంసిద్ధంగా వుంటుంది. ఇదీ ట్రంప్ ప్రకటన సారాంశం.

మార్కెట్ వ్యవస్థను అధిగమించి ఆలోచిస్తేనే తప్ప ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకదు. ఒక ప్రదేశంలో నివసించే ప్రజలందరి ఆకాంక్షలు, అవసరాల వ్యక్తీకరణే ప్రజాస్వామ్యం. వాటిని తీర్చడానికి మార్కెట్ అనేది ఒక సాధనం. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమం. మార్కెట్ కాదు. మార్కెట్ అనేది కేవలం ఉన్నత వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే ఒక వ్యవస్థ. మార్కెట్‌కు స్వేచ్ఛను ప్రసాదించటం అంటే ఉన్నత వర్గాలకు స్వేచ్ఛను ప్రసాదించడమే. అంటే ఆ మేరకు మిగిలిన వర్గాలకు స్వేచ్ఛను నిరాకరించడమే. ప్రజాస్వామ్యం నియంత్రణలో మార్కెట్ వుండాలి తప్ప మార్కెట్ నియంత్రణలో ప్రజాస్వామ్యం ఉండకూడదు. కానీ ఉదారవాద ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని మార్కెట్ వ్యవస్థ స్థాయికి కుదించి వేశాయి. ఈ ఆర్థిక విధానాల కారణంగా ప్రాతినిధ్య ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు తగిన జవసత్వాలను సమకూర్చుకుంటూ నూతన ఉత్తేజాన్ని పొందే శక్తిని పూర్తిగా కోల్పోయాయి. భారత దేశం కూడా ఇదే మార్గంలో ప్రయాణం చేస్తోంది. కరోనా సంక్షోభం పరిష్కారం విషయంలో మన కేంద్ర ప్రభుత్వం కన్నా రాష్ట్రాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నాయనటం అసత్యం కాదు.

రాజ్యవ్యవస్థ నిర్మాణంలోనే బాధ్యతారాహిత్యం అనే అంశ అంతర్లీనంగా వుంటుందని నయా ఉదారవాద పితామహులు ఒక సిద్ధాంతం చేశారు. దీనికి భిన్నంగా మార్కెట్ వ్యవస్థలో, తన మనుగడను సుస్థిరం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే అయినప్పటికీ బాధ్యతను స్వీకరించే గుణం ఉంటుందని ప్రపంచాన్ని నమ్మించారు. సంక్షేమ రాజ్యవ్యవస్థలోని బాధ్యతా రాహిత్యానికీ, మార్కెట్ వ్యవస్థలోని బాధ్యతను స్వీకరించే గుణానికీ మధ్య పోటీ పెట్టారు. తమకు అనుకూలంగా ప్రపంచం మద్దతును కూడగట్టారు. శ్రేయోరాజ్య వ్యవస్థలో గూడుకట్టుకున్న బాధ్యతారాహిత్యాన్ని ప్రభుత్వ అసమర్థతగా చిత్రించటం తప్ప వ్యవస్థాగత మూలాల్లోకి వెళ్లి పరిష్కారాన్ని అన్వేషించే గట్టి ప్రయత్నం ఇప్పటివరకూ జరగలేదు.

రాజ్య నియంత్రణ లేని నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థని యథాతథంగా కొనసాగించడమా లేదా సారభూత ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతపరచటమా? ఇదీ ఈనాడు ప్రపంచ మానవాళి ముందు పడగ విప్పిన ప్రధానమైన ప్రశ్న. కరోనా అనంతర సమాజం తీసుకునే నిర్ణయం మీదనే మానవాళి భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

**◆ ఖాదర్ మొహియుద్దీన్**



# నివేదన

దైవమార్గం

ఏసు ప్రభువును శిలువ వేసి, విశ్వాసుల నుంచి దూరం చేయడానికి సమాధి చేసినా (మరో మాటలో చెప్పాలంటే ఐసొలేషన్) ఆయన పునరుత్థానానికీ, అనుయాయులకు తిరిగి దర్శనం ఇవ్వడానికీ అది అడ్డు కాలేదు. కాబట్టి గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వేడుకలను సామూహికంగా నిర్వహించుకొనే వీలు ఈ ఏడాది లేదనే విచారం అవసరం లేదు. విశ్వాసుల దగ్గరకే ప్రభువు వస్తాడు. ఆయనను హృదయంలోకి ఆహ్వానిద్దాం.



నేడు గుడ్ ఫ్రైడే

# దైవానికి దగ్గరవుదాం!

పవిత్ర వారంలో మానవాళిని పాప విముక్తులను చేయడానికి ఏసు ప్రభువు శిలువను ఎక్కిన రోజు- గుడ్ ఫ్రైడే. ఈ పవిత్రమైన వారాన్నీ, రాబోయే ఆదివారం నాడు ఏసు పునరుత్థానానికి సూచికగా నిర్వహించే ఈస్టర్ పండుగనూ క్రైస్తవ విశ్వాసానికి పునాదులుగా బైబిల్ అభివర్ణించింది. 'మ్రాని కొమ్మల ఆదివారం' (పామ్ సన్‌డే)తో ప్రారంభమయ్యే వేడుకలు ఈస్టర్‌తో... అంటే ఎల్లుండి ఆదివారంతో ముగుస్తాయి. క్రిస్మస్ తరువాత క్రైస్తవులు జరుపుకొనే కార్యక్రమాల్లో ఈస్టర్ వేడుకలు ఎంతో ప్రధానమైనవి. అయితే ఎంతో ఉత్సాహంగా సాగే ఈ ఉత్సవాలను ఈ ఏడాది సామూహికంగా నిర్వహించుకొనే పరిస్థితి లేదు.

ప్రకృతి సంబంధమైన విలయాలు ముంచుకొచ్చినప్పుడూ, అంటువ్యాధుల మహమ్మారులై విరుచుకుపడినప్పుడూ దైవాన్ని ఆలంబనగా చేసుకొని, మనోస్థైర్యంతో మెలగడమే మానవుల కర్తవ్యం. ప్రస్తుత కరోనా ఉపద్రవం కూడా అలాంటిదే! ఇలాంటి సందర్భాలను దైవానికి మరింత దగ్గరగా చేరుకోవడానికి



అందివచ్చిన అవకాశంగా మలచుకోవడం మన చేతుల్లోనే ఉంది. ప్రార్థన చర్చిలో చేశామా, ఇంట్లో నిర్వహించామా అనేది ప్రధానం కాదు. కావలసిందల్లా అంచలమైన విశ్వాసం. విపత్కర పరిస్థితుల్లో దైవం మనకు తోడుగా నిలబడతాడన్న నమ్మకం.

> **గతం, వర్తమానం, భవిష్యత్తు... ఇవి ఎలా ఉన్నాయన్న దానితో నిమిత్తం లేని శాశ్వత సత్యం ఒకటే! మనకు అండగా దైవం ఉన్నాడనే నమ్మకం. ఆ నమ్మకాన్ని గట్టిపరచుకుంటూ, ఈ విపత్తు నుంచి మానవాళి క్షేమంగా బయటపడాలని ప్రార్థన చేద్దాం. ఈ గుడ్ ఫ్రైడే, ఈస్టర్ దినాల్లో అంతకన్నా ప్రయోజనకరమైన ప్రార్థన, దైవాన్ని మెప్పించే ప్రార్థన మరొకటి ఉండదు!**

❖ ప్రస్తుతం సామాజికమైన దూరం తప్పనిసరి. కాబట్టి నిత్యం ప్రార్థన చేయడానికి ఇంట్లో అనువైన ప్రదేశాన్ని సిద్ధం చేసుకోండి. కుటుంబ సభ్యులందరూ ప్రార్థన చేయడానికి రోజూ నిర్ణీత సమయాన్ని ఎంచుకోండి. శిలువపై ఏసు ప్రభువు ఉన్న బొమ్మ లేదా ఏదైనా పవిత్రమైన బొమ్మను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోండి. కొవ్వొత్తులు వెలిగించండి. చదవడానికి బైబిల్‌ను అందుబాటులో పెట్టుకోండి. కీర్తనలూ, బైబిల్‌లోని నిర్ణీతమైన పంక్తులూ చదువుతూ ప్రార్థన చేయండి.

❖ సంగీతాన్ని దైవ భాష అంటారు. దైవాన్ని ప్రస్తుతించే పాటలు పాడండి. లేదా యూట్యూబ్ లాంటి మాధ్యమాల్లో లభ్యమవుతున్న సన్నుతి గీతాలను వినండి. వాటి భావాన్ని మనసులో నింపుకోండి.

❖ ప్రపంచవ్యాప్తంగా వివిధ క్రైస్తవ సంస్థలూ, ప్రసిద్ధమైన చర్చిలూ వీడియోల ద్వారా, ఆడియోల ద్వారా పవిత్ర వారం, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందేశాలనూ, ప్రార్థనలనూ, కీర్తనలనూ, పరిమితమైన వ్యక్తులతో నిర్వహించే వేడుకలనూ ప్రత్యక్షంగానో, రికార్డు చేసిన వెర్షన్లనో ప్రసారం చేస్తున్నాయి. మాధ్యమాల ద్వారా వాటి గురించి తెలుసుకొని ప్రార్థన సమయంలో ల్యాప్‌టాప్‌ల ద్వారా, ఫోన్ల ద్వారా వాటిని చూడవచ్చు, వినవచ్చు.

❖ తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, లాక్‌డౌన్ సమయంలో ఫేస్‌బుక్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా పవిత్ర సందేశాలను ప్రజలు విరివిగా వినియోగించుకుంటున్నారు. వాటి వివరాలను మీ పరిచయస్థులకు తెలియజేయండి.

❖ దూరంగా ఉన్న బంధువులతో, మిత్రులతో మాట్లాడి మీ అనుభవాలనూ, అనుభూతులనూ పంచుకోండి.

మన చుట్టూ ఉన్న వారందరూ బాగుంటేనే ఉత్సవం. కరోనా ఉద్ధృతి కారణంగా ఆహారానికీ, ఇతర సౌకర్యాలకూ నోచుకోని అభాగ్యులు ఎందరో ఉన్నారు. మీ స్థాయిలో, పరిధిలో వీలైనంత సాయం చెయ్యండి. ఇది ప్రభువుకు ఎంతో ప్రీతికరమైన సేవ అని గుర్తుపెట్టుకోండి.

## మంచి రోజులు వస్తాయి!

"ఒక అంటువ్యాధి విజృంభించి, కనీవినీ ఎరుగని విషాదాన్ని మిగుల్చుతున్న ఈ సమయంలో అందరూ దైవం వైపు మరలాలి. ఇప్పుడు మనం అనుభవిస్తున్న విషాద పరిస్థితిలో అనవసరమైన విషయాల్లో చిక్కుకోకూడదు. గట్టిగా పట్టించుకోవాల్సిన వాటి మీద దృష్టి పెట్టాలి. తోటివారికి సాయపడకపోతే జీవితానికి పరమార్థం లేదని తెలుసుకోవాలి. జీవితానికి కొలమానం ప్రేమ మాత్రమే! బాధల్లో ఉన్నవారికీ, ఎంతో అవసరంలో ఉన్నవారికీ మనం చేరువ కావాలి. మనకు లేని దాని గురించి కాదు, ఇతరులకు మనం చేయగలిగే మంచి ఏమిటో ఆలోచించాలి. ఇది ప్రతి ఒక్కరికీ విషమమైన సమయం. ఇలాంటి సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి, రోగులకు సేవ చేస్తున్న వారు హీరోలు. ఈ కాలాన్ని వీలైనంత ఉత్తమంగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నిద్దాం. ఉదారంగా ఉందాం. మన పొరుగున ఉన్న ఆర్తులకు సాయం చేద్దాం. ఒంటరితనం అనుభవిస్తున్న వారికి ఊరటను అందిద్దాం. మనతో మనం గడపడానికి దొరికిన ఈ అదనపు కాలాన్ని ప్రేమ, సహనంతో ఉత్తమమైన సమయంగా మలచుకుందాం. చెడు నుంచీ, ఈ అంటువ్యాధి నుంచీ అంతిమంగా విముక్తి చెందే మంచి రోజులు వస్తాయని ఆశిద్దాం. ఆశ ఎప్పుడూ నిరాశపరచదు. ఎందుకంటే అది భ్రమ కాదు కాబట్టి!"



**- క్యాథలిక్ క్రైస్తవుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్**

# రోగ నివారణ కోసం...

భూగోళాన్ని కల్లోలపరుస్తున్న కరోనా వ్యాధి నివారణ కోసం, లోక క్షేమం కోసం శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సంకలన పరచి అందించిన శ్లోకాలివి. ఈ శ్లోకాలలో ప్రస్తావించిన భగవంతుడి నామాలను ప్రజలు జపిస్తే, సత్ఫలితాలు కలుగుతాయి.

**సంకల్పం:**

**మమోపాత్త శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం**
**జ్వర ఔపసర్గికాది నానావిధ సాంక్రామిక రోగాణాం ఉన్మూలనార్థం**
**ఆరోగ్య ప్రాప్త్యర్థం అస్మద్దేశీయానాం విదేశీయానాం చాపి సర్వేషాం**
**వ్యాధి భయ నివృత్త్యర్థం సర్వలోక క్షేమార్థం**
**రోగ నివారక భగవన్నామ స్తోత్ర పారాయణం కరిష్యే**

ఇలా చేద్దాం!



**రోగ నివారణ శ్లోకాః**

**అచ్యుతానంత గోవింద నామోచ్చారణ భేషజాత్ !**
**నశ్యంతి సకల రోగాః సత్యం సత్యం వదామ్యహం !!**

**శరీరే జర్జరీ భూతే వ్యాధిగ్రస్తే కళేబరే !**
**ఔషధం జాహ్నవీ తోయం వైద్యో నారాయణో హరిః !!**

**సుమీనాక్షిపతే శంభో సోమసుందర నాయక !**
**ఇమాం ఆపదముత్పన్నాం మదీయాం నాశయ ప్రభో !!**

**ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః**
**ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః !**
**సంకీర్త్య నారాయణ శబ్ద మాత్రం**
**విముక్త దుఃఖాః సుఖినో భవంతి !!**

**బాలాంబికేశ వైద్యేశ భవరోగ హరేతి చ !**
**జపేన్నామ త్రయం నిత్యం మహారోగ నివారణం !**

**పంచాపగేశ జప్యేశ ప్రణతార్తి హరేతి చ !**
**జపేన్నామ త్రయం నిత్యం పునర్జన్మ న విద్యతే !!**

**అపస్మార కుష్ఠ క్షయార్శః ప్రమేహ**
**జ్వరోన్మాద గుల్మాది రోగా మహాంతః !**
**పిశాచాశ్చ సర్వే భవత్పత్రభూతిం**
**విలోక్య క్షణాత్ తారకారే ద్రవంతే !!**

**కిరంతీ మంగేభ్యః కిరణ నికురంబామృతరసం**
**హృది త్వా మాధత్తే హిమకర శిలామూర్తిమివ యః !**
**స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ**
**జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధారసిరయా !!**

**నామ జపం**

**అచ్యుతాయ నమః**
**అనంతాయ నమః**
**గోవిందాయ నమః**

ఈ నామాలను 36, 108, 336 లేదా 1008 సార్లు జపించాలి.

సందేశం



## శుభ్రత పాటిద్దాం!

ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఇళ్ళకే పరిమితం కావడం ప్రజలందరికీ శ్రేయస్కరం. అలాగే వ్యక్తిగత శుభ్రతను కూడా తప్పకుండా పాటించాల్సిందే! ఇస్లామ్ ధర్మంలో 'తహరత్'... అంటే శుచి, శుభ్రతలకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. నమాజ్, దివ్య ఖుర్‌ఆన్ పారాయణ, కాబా గృహ ప్రదక్షిణలకే ఈ ధర్మం పరిమితం కాదు. 'తహరత్' కూడా ధర్మంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ విషయాన్ని ఖుర్‌ఆన్, హదీస్‌లు స్పష్టంగా చెప్పాయి.

దేవుడు తనవైపు మరలేవారినీ, పవిత్రంగా శుభ్రంగా ఉండేవారినీ మాత్రమే ప్రేమిస్తాడని అల్లాహ్ పేర్కొన్నారు (దివ్య ఖుర్‌ఆన్ - అల్‌బఖర 2:222). ప్రార్థనల సమయంలో పాటించాల్సిన నియమాల్లో పరిశుభ్రత ముఖ్యమైనది. "విశ్వాసులారా! నమాజ్ చేయడానికి సిద్ధమయినప్పుడు ముందుగా మీరు ముఖాన్నీ, మోచేతుల వరకూ చేతులనూ కడుక్కోండి; తలను తడి చేత్తో స్పృశించండి; కాళ్ళను చీలమండల దాకా కడుక్కోండి. అశుభ్రమైన అవస్థ ఏర్పడితే తలంటు స్నానం చేయండి" అని దివ్య ఖుర్‌ఆన్ ఆదేశించింది (అల్ మాయిద 5:6). కరోనా మహమ్మారి ప్రబలుతున్న ప్రస్తుత సమయంలో పరిశుభ్రత మరింత కీలకం.

> **అరబ్బీ భాషలో ఒక సామెత ఉంది. 'అల్ వఖాయః ఖైరుమ్ మినల్ ఇలాజ్'- అంటే 'వైద్యం కన్నా పత్యం మిన్న' అని అర్థం. ఈ సామెతలో గొప్ప వివేకం ఉంది. ఇది శారీరక ఆరోగ్యం విషయంలో నివారణలు మాత్రమే కాకుండా... అవసరమైనప్పుడు ధర్మం విషయంలో, ప్రాపంచికమైన విషయాల్లో నివారణ, నియంత్రణ కలిగి ఉండాలని సూచిస్తోంది. భౌతిక దూరాన్ని పాటించడం, ప్రార్థనలు ఇంటికే పరిమితం చేసుకోవడం - ఇవన్నీ ధార్మికపరమైన నియంత్రణలే.**

మహా ప్రవక్త మహమ్మద్ ఒక రోజు మసీదులో కూర్చొని ఉన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఒక వ్యక్తి లోనికి ప్రవేశించాడు. అతని జుట్టూ, గడ్డం అంతా చిందరవందరగా ఉన్నాయి. మహా ప్రవక్త చూసి, తల, గడ్డం సరిగ్గా దువ్వుకొని రావాలంటూ చేత్తో సంజ్ఞ చేశారు. అతను బయటకు వెళ్ళి, అంతా సంస్కరించుకొని వచ్చాడు.

అప్పుడు మహా ప్రవక్త "ఇది బాగుందా? లేక చిందర వందర వెంట్రుకలతో సైతానులా కనబడడం బాగుందా?" అని అతణ్ణి ప్రశ్నించారు. పరిశుభ్రత వల్ల తేజస్సు వృద్ధి అవుతుందని అల్లాహ్ చెప్పారు. "ప్రళయదినాన నా అనుచరులందరినీ (కర్మ విచారణ కోసం) పిలవడం జరుగుతుంది. 'ఉజూ' (శరీరాన్ని శుభ్రం చేసుకోవడం) ప్రభావం వల్ల వారి ముఖాలు, కాళ్ళు, చేతులు ఉజ్జ్వలంగా ఉంటాయి. శరీర వర్ఛస్సునీ, తేజస్సునూ వృద్ధి చేసుకోవాలని అనుకున్నవారు ఉజూ చేస్తున్నప్పుడు పూర్తిగా ముఖాన్ని కడుక్కోవాలి" అని (హదీస్ గ్రంథం: బుఖారీ) సూచించారు. పవిత్రత, పరిశుభ్రత విషయంలో దైవ ప్రవక్త ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన అంశాల్లో దంతధావనం ఒకటి. 'మిస్వాక్ (పళ్ళుతోము పుల్ల) నోటిని బాగా శుభ్రపరచి, దైవాన్ని అమితంగా ప్రసన్నం చేసే వస్తువు' అని హదీస్ గ్రంథం పేర్కొంటోంది.

ప్రాణాంతకమైన కరోనా వైరస్ సోకకుండా మాస్కులు, చేతి తొడుగులు ధరించాలి. శుచినీ, శుభ్రతనూ పాటించాలి. ప్రమాదం రాకముందే జాగ్రత్త తీసుకోవాలి. ధర్మపరమైన విషయాలలో నియంత్రణ కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే అది పరలోకంలో దాసుడికి గొప్ప విజయాన్ని అందిస్తుంది.

**● మహమ్మద్ వహీదుద్దీన్**

## అంతా... మన చేతుల్లోనే!

సద్గురువాణి

కొన్ని సమయాలలో పనులు చేయడం కన్నా క్రియారహితంగా ఉండడం ఎంతో ముఖ్యం. ఇది అలాంటి సమయమే! పనులను తక్కువగా పెట్టుకుంటే, ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిది. అవును! ఇంతకు ముందు ఇలాంటి అంటువ్యాధులు ఎన్నిటినో మనం చూశాం. మలేరియాతో పాటు డెంగ్యూ, చికున్ గున్యా లాంటి వ్యాధులను ఎదుర్కొన్నాం. ఆ వ్యాధులకు దోమలు వాహకాలు. కాబట్టి దోమలను నిర్మూలించడానికి చర్యలు తీసుకున్నాం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వాహకాలం మనమే! మనల్ని మనం చంపుకోలేం కదా? కాబట్టి మనం కొద్దిగా తగ్గి ఉండాలి.

జీవితాలను తరచి చూసుకోవడానికీ, ఎలా ఉండాలో వ్యూహరచన చేసుకోవడానికీ ఇదే సరైన సమయం. మన జీవితం చాలా సున్నితమైనది. ఒక సూక్ష్మక్రిమి మనల్ని చంపగలదు. ఈ శత్రువు మనకు కనిపించదు. అదే దాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది.

నిత్యం పనులు అంటూ బయట తిరిగేవారు ఇప్పుడు చెయ్యడానికి ఎక్కువ పని లేనప్పుడు ఎలా ఉండాలో నేర్చుకోవాలి. యోగసాధనకు ఇంతకు ముందు తీరిక లేనివారికి ఇప్పుడు సమయం వచ్చింది. కళ్ళు మూసుకొని ధ్యానం చెయ్యండి. కుదరకపోతే కళ్ళు మూసుకొని ఉండండి.



### విపత్తు వేళ విభజనలు వద్దు!

"ఒక భయంకరమైన మహమ్మారి ఇప్పుడు మన ఎదుట నిలిచి ఉంది. ఇలాంటి సమయంలో మన దేశాన్ని కులాలూ, మతాల పేరిట విభజించవద్దు. మన తరంలో ముంచుకొచ్చిన ఈ మహమ్మారి అతి పెద్ద విపత్తుగా మారకుండా చూడాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఇప్పుడు మనం బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. ఎరుకతో వ్యవహరించాలి. ఇది పెద్ద విపత్తుగా కాకుండా ఒక చిన్న సమస్యగా దాటిపోయేలా చూడాలి. సోషల్ మీడియాను బాధ్యతారహితంగా ఉపయోగించకండి. కరోనా వైరస్ వ్యాప్తికి ఒక మతం వారో, వర్గం వారో కారణం అనే అనుచితమైన ప్రచారాలు చేయకండి. ఒక గంభీరమైన సమస్య మన ముందు ఉంది. ఇలాంటప్పుడు మన సమాజాన్ని విభజించి, ఆ సమస్యను మరింత పెంచకూడదు. మనం సమస్య పరిష్కారంలో భాగం కావాలి తప్ప సమస్యలో భాగం కాకూడదు."

మన గురించీ, మన జీవన వాస్తవికత గురించీ ఆలోచించడానికి కూడా ఇది సరైన సందర్భమే! మన జీవితాలు ఎంత సున్నితమైనవో, ఎంత అస్థిరమైనవో తెలిసింది కదా! ఆ జ్ఞానోదయం ఇంకా కాకపోతే కరోనా క్రిమిని తలచుకుందాం. తేలిగ్గా అర్థం అవుతుంది. ఎవరో తుమ్మితే సంభవించే పరిణామాలతో మన ప్రాణాలు పోవచ్చు. ఇది మంచి గుణపాఠం. అయితే భయపడే సమయం కాదు. జాగ్రత్తగా ఉండాలి. ప్రతి చర్యనూ ఆచరణాత్మకంగా తీసుకోవాలి. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి, భాగస్వాములు కావాలి. అనారోగ్య లక్షణాలు ఎవరికి కనిపించినా పరీక్షలు చేయించుకోవాలి. బతికి ఉండాలంటే కొంతకాలం పనుల్ని పక్కన పెట్టాలి. ఇంటికే పరిమితం కావాలి. స్నేహాలనూ, సాన్నిహిత్యాలనూ కొన్ని రోజులు తప్పించుకోక తప్పదు. ప్రేమను హృదయంలో పెంచుకుందాం. దాన్ని కొన్నాళ్ళు వ్యక్తం చెయ్యకుండా దాచుకుందాం. పరిస్థితులు చక్కబడేదాకా నిబద్ధతతో ఉందాం. దగ్గు లాంటి సమస్యలు ఉంటే ఇతరులకు దూరంగా ఉందాం. ఇది వివక్ష కాదు. కేవలం స్పృహతో జీవించడం. ఈ వివేకం ఉన్నవారు ఈ పరిస్థితుల నుంచి బయటపడతారు.

అయితే అనవసరమైన భయాందోళనలు అవసరం లేదు. కావలసిందల్లా జాగ్రత్త! తప్పు చేసినప్పుడు కలిగేవి భయాందోళనలు. జాగ్రత్త పడడం అంటే సరైన పనులు చేయడం! మనం చేయగలిగే అతి సులువైన పని అందరికీ దూరంగా ఉండడం! బయటకు వీలైనంత తక్కువగా రావడం!! ఈ సమయాన్ని ధ్యానం లాంటి వాటికి ఉపయోగిద్దాం. జీవితం మన మీదకు ఎలాంటి సవాలు విసురుతుందో మనం నిర్ణయించలేం. కానీ ఆ పరిస్థితిలో మనం ఏం చెయ్యాలనేది ఎంచుకోవడం మాత్రం నూటికి నూరుశాతం కచ్చితంగా మన చేతుల్లోనే ఉంది!

**● సద్గురు జగ్గీవాసుదేవ్**



## ప్రకృతిని కాపాడితేనే...

నవజీవన వేదం

'సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక వ్యాధి ఎలా విజృంభిస్తుంది?' అంటే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు 'వడ్లగింజలు' కథలో చెప్పినట్టుగా రెట్టింపు, రెట్టింపు అయిపోతూ ఉంటుంది. కరోనా వ్యాధి ప్రతి ఆరు రోజులకు బాధితుల సంఖ్యను, మృతుల సంఖ్యను రెట్టింపు చేస్తోంది. మీరు గమనిస్తే ఆ విషయం అర్థమవుతుంది. రోజూ ఒకటి, రెండు పెరగడం కాదు. ఆరు రోజుల క్రితం వంద ఉంటే ఇప్పుడు రెండు వందలు అవుతుంది. క్రమశిక్షణ పాటించని దేశాల్లో దీని తీవ్రత ఎక్కువ. ప్రభుత్వాలు చెప్పినా ప్రజలు వినరు. క్రమశిక్షణ పాటించరు. అలాంటి దేశాలకు కరోనా విస్తరిస్తోంది. వాటి ద్వారా మనకూ వస్తోంది. మన దగ్గర కూడా క్రమశిక్షణ చాలా తక్కువ. 'ఎంతమంది పోయినా ఫరవాలేదు, నా ఇష్టం వచ్చిన ధోరణిలోనే ఉంటాను!' అన్నట్టు ప్రవర్తిస్తారు. మన బుద్ధిలో మార్పు రానంత వరకు ఎన్ని చట్టాలు పెట్టినా ఫలితం ఉండదు. విదేశాల నుంచి వచ్చిన వారిని పద్నాలుగు రోజుల పాటు ఇంటి పట్టునే ఉండమంటే ఉండకుండా తప్పించుకు తిరుగుతున్నారు. కొంతమంది విమానం దిగేముందు జ్వరం మాత్ర వేసుకొని వచ్చారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు!

ఐసొలేషన్ అంటే అంత భయం ఎందుకు? ఇంట్లో ఇద్దరు ఉంటే ఎవరి ఫోన్లలో వాళ్ళు బిజీగా ఉంటున్నారు కదా! అది ఏకాంతం కాదా? దేశం కోసం, ధర్మం కోసం, ప్రజాసంక్షేమం కోసం మన నుంచి వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా ఉండడం కోసం పద్నాలుగు రోజులు కాలు బయటపెట్టకుండా ఉండలేమా? శ్రీరాముడు పద్నాలుగేళ్ళు అరణ్యంలో ఉన్నాడు. వ్యాధి విస్తరించకుండా ఉండాలంటే మనం ఏకాంతంగా ఉండడానికి సిద్ధపడాలి. 'ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్' అనేది ఇప్పుడు బాగా వర్తిస్తుంది. ఖర్చులు తగ్గించుకోవడానికి, ఆరోగ్యం బాగా చూసుకోవడానికి, ఏకాంతంగా గడపడానికి, మనుషుల మధ్య అనుబంధం పెరగడానికి కరోనా సహకరించింది అనుకోవాలి.

వెంట్రుకలో వెయ్యో వంతులేని క్రిమి, కోట్ల జనాభాను శాసిస్తోంది. వేదాంతం ఇక్కడే నేర్చుకోవాలి. 'నలుగురూ కలవద్దు' అంటే వింటారా? ప్రతిచోటా ఊరేగింపులు, గుమికూడటమే. ఆలయాలన్నీ మూతపడ్డాయి. ఇన్ని ఆలయాలు, ఇన్ని ఆరాధనలు మనల్ని ఎందుకు కాపాడలేకపోతున్నాయి? ఎందుకంటే మన బుద్ధి మార్చుకోవడం లేదు. మనస్సు మార్చుకోవడం లేదు. మనస్సుకేసి, బుద్ధికేసి చూడడం లేదు. పూజ వల్లనో, వ్రతం వల్లనో, దర్శనం వల్లనో ఏదో అయిపోవాలని ఆశిస్తున్నాం. అలా ఎప్పటికీ జరగదు. ఈ అతి చేయడాన్ని తగ్గించుకుని మన పూజా మందిరంలో దేవుడి దగ్గర ఒక స్తోత్రం చదువుకుంటే సరిపోదా? కరోనాను మించిన దైవం ఉందా? దైవలీల అంటే ఇదే కదా! రాష్ట్రప్రభుత్వం చెప్పినా, కేంద్ర ప్రభుత్వం చెప్పినా, పర్యావరణ ప్రేమికులు చెప్పినా వినని వాళ్ళం ఈరోజు చేతులు వంద సార్లు కడుగుతున్నాం. మూతి ముప్ఫైసార్లు కడుగుతున్నాం. బస్టాండులో బల్లలన్నీ ఎప్పుడైనా తుడిచారా? ఇప్పుడు కడిగేస్తున్నారే! కరోనా దేవతా! నీకు నమస్కారం. దేశంలో చాలా మార్పులు తెచ్చింది కరోనా. ఇప్పుడు అందరికీ భయం వచ్చేసింది. అయితే తగ్గాక కూడా ఇది అలాగే కొనసాగాలి. ప్రకృతికి మానవుడు ఒక శతాబ్దకాలంగా చేస్తున్న హానికి ప్రతిక్రియే ఇటువంటి వ్యాధి. ఇటలీలో వృద్ధులకు వైద్య చికిత్సలు చేయడానికి నిరాకరించారన్న వార్తలు చదివాం. ఒక్కరోగం కారణంగా ప్రపంచం ఎంత అమానుషం అయిపోతుందో ఆలోచించండి. మానవ సంబంధాలు ఇంతే! ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తే ఈ ఘోష తప్పదు. ఇప్పటికైనా ప్రకృతిని కాపాడుకోవడం మీద దృష్టి పెడదాం!



**● డా. గరికిపాటి నరసింహారావు**

ధర్మపథం



## మహమ్మారి చెప్పిన మహా సత్యం!

'నా కులమే గొప్పది, నా జాతే గొప్పది, నా దేశమే గొప్పది, నా వంశమే గొప్పది...' ఇలా అనేక అహంకారాలతో విర్రవీగేవారు మనలో చాలామందే ఉన్నారు. ఈ అహంకార అంధకారం వల్లనే ఎన్నో జాతులు, ఎన్నో దేశాలు తమ చరిత్రను రక్తంతో రాసుకున్నాయి. ఈ అహంకారం వల్లే ప్రపంచ యుద్ధాలు వచ్చి పడ్డాయి. మనిషిలోని మానవత్వాన్ని ఈ అహంకారాలు నమిలి మింగేశాయి. ఇప్పటికీ 'నాదే అగ్ర రాజ్యం. మేమే ప్రపంచ శాసకులం' అని విర్రవీగే దేశాలూ ఉన్నాయి.

ఒకనాడు బుద్ధుడి సోదరుడు ఆనందునికి సందేహం వచ్చింది... 'మానవుల్లో ఉత్తమ జాతి ఏది?' అని!

వెంటనే బుద్ధుడి దగ్గరకు వచ్చి- "భగవాన్! సింధు దేశానికి చెందిన సైంధవ అశ్వాలు ఉత్తమమైనవి. వృషభాల్లో కొన్ని వృషభాలు శ్రేష్ఠమైనవి. ఏనుగుల్లో ఛద్దంతి జాతి ఏనుగులు ఉత్తమోత్తమం. ఫలాల్లో ఉత్తమమైనవి ఉన్నాయి. అలాగే మానవుల్లో ఉత్తమమైన జాతి ఏది?" అని అడిగాడు.

అప్పుడు బుద్ధ భగవానుడు చిరునవ్వు నవ్వి "ఆనందా! మనుషులు శారీరక బలంతో కాకుండా బుద్ధి బలంతో, గుణంతో రాణిస్తారు. ఒక జాతిలోనో, ఒక కులంలోనో, ఒక దేశంలోనో ఉన్నతుడు, ఉత్తముడు జన్మించవచ్చు. జాతి జాతంతా ఉత్తమమైనదీ, మహోన్నతమైనదీ అంటూ మానవుల్లో ఏదీ ఉండదు" అని చెప్పాడు.

ఎవరికి వారు... లేదా ఆర్థిక బలమో, అంగ బలమో (ఆయుధ బలం) ఉన్నవారు 'నా దేశం గొప్పది' అని చెప్పుకోవచ్చు. కానీ ప్రకృతికి మనుషులంతా ఒక్కటే! ఈ విషయం ఇన్నాళ్ళకు కరోనా మహమ్మారి అనే శత్రువు మనకు గుర్తు చేసింది. మనం ఇన్నాళ్ళూ వంశం, కులం, ప్రాంతం, దేశం పేరుతో పెంచుకున్న శత్రుత్వాలన్నీ చెరిపేసింది. 'మనుషులంతా ఒక్కటే' అనే మహాసత్యాన్ని ఆ మహమ్మారి ప్రత్యక్షంగా చూపించింది. మనుషుల మధ్య మమకారాలూ, మాధుర్యాలూ, సహకారాలూ మాత్రమే ఉండాలని చెళ్ళున చరిచి మరీ చెప్పింది!

**● బొర్రా గోవర్ధన్**

## టాప్ సెల్లర్‌గా బ్రయాంట్ నవల




వాషింగ్టన్: బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబి బ్రయాంట్ రాసిన స్పోర్ట్స్ ఫాంటసీ నవల 'ద విజెనార్డ్ సిరీస్: సీజన్ 1' టాప్ సెల్లర్‌గా నిలిచింది. ద న్యూయార్క్ టైమ్స్ మిడిల్ గ్రేడ్ హార్డ్ కవర్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. బాలల బాస్కెట్‌బాల్ పుస్తకాల్లో అమెజాన్ బెస్ట్ సెల్లర్‌గానూ చోటు దక్కించుకుంది. హెలికాప్టర్ ప్రమాదంలో బ్రయాంట్, అతడి కుమార్తె మృతి చెందిన సంగతి తెలిసిందే.

## సన్‌రైజర్స్ విరాళం రూ. 10 కోట్లు

హైదరాబాద్: కరోనా మహమ్మారిపై పోరాటానికి ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ ముందుకొచ్చింది. తన వంతుగా సన్ టీవీ గ్రూప్ నుంచి రూ. 10 కోట్ల విరాళాన్ని అందజేస్తున్నట్టు ఫ్రాంచైజీ తన అధికారిక ట్విటర్‌లో తెలిపింది. అయితే, ఈ మొత్తాన్ని ఏ నిధికి ఇస్తున్న విషయాన్ని ఆ ఫ్రాంచైజీ వెల్లడించలేదు.

## 42 కిలో మీటర్లు.. 749 మంది రన్నర్లు!

### నేడే 'హోమ్ మారథాన్'

దుబాయ్: ప్రపంచ వ్యాప్తంగా కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ఎన్నో దేశాలు లాక్‌డౌన్ పాటిస్తున్నాయి. దీంతో ఇళ్లల్లో నుంచి కదల్లేని పరిస్థితి. కాలు కదపకుండా ఇళ్లల్లోనే ఉండడం ఫిట్‌నెస్ ప్రేమికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఇందులోంచి పుట్టిందే 'మారథాన్ ఎట్ హోమ్'. శుక్రవారం నిర్వహించనున్న ఈ వినూత్న మారథాన్‌లో 62 దేశాలకు చెందిన 749 రన్నర్లు పాల్గొననున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు.. అంటే 10 గంటలపాటు మారథాన్ సాగనుంది. ఇందులో భాగంగా రన్నర్లు తమ ఇంట్లోనే 42.196 కిలోమీటర్లు పరుగెత్తాల్సి ఉంటుంది. దుబాయ్ స్పోర్ట్స్ కౌన్సిల్, మిడిల్ ఈస్ట్ రన్ క్లబ్ కలిసి ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ మారథాన్‌లో పాల్గొనాలనుకునే వారు నిర్వాహకులు సూచించిన స్ట్రావా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. టాప్‌లో నిలిచిన వారికి బహుమతులు కూడా ఉంటాయి.



## అమెరికాలో చిక్కుకుపోయా

### కాపాడాలంటూ హాకీ ఒలింపియన్ వేడుకోలు

న్యూఢిల్లీ: హాకీ ఒలింపియన్, 1975 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యుడు అశోక్ దివాన్ అమెరికాలోని కాలిఫోర్నియాలో చిక్కుకుపోయారు. తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులుపడుతున్న తనను స్వదేశం తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు రంగంలోకి దిగిన క్రీడా శాఖ.. విషయాన్ని విదేశాంగ శాఖ దృష్టికి తీసుకుపోయింది. కాలిఫోర్నియా రాజధాని సాక్రమెంటోలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లిన దివాన్.. ఈనెల 20న స్వదేశం రావాల్సి ఉంది. కానీ కరోనా మహమ్మారితో ఆయన ప్రయాణం వాయిదాపడింది. మరోవైపు దివాన్‌ను హఠాత్తుగా ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దాంతో తనను అమెరికానుంచి రప్పించాలని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నరీందర్ బాత్రాను అశోక్ అభ్యర్థించారు. ఈ విషయాన్ని బాత్రా.. క్రీడా మంత్రి కిరణ్ రెజిజు దృష్టికి తీసుకుపోయారు. విదేశీ వ్యవహారాల శాఖతో మాట్లాడి అశోక్‌ను స్వదేశం రప్పించేలా చూడాలని కోరారు.




## వింబుల్డన్ బీమా రూ. 946 కోట్లు!

### ఐపీఎల్‌కూ అవకాశం ఉందా?



న్యూఢిల్లీ: కరోనా వైరస్ దెబ్బకు ఈ ఏడాది వింబుల్డన్ రద్దయింది. అయినా ఆ టోర్నమెంట్ నిర్వాహకులకు ఆర్థికంగా ఎలాంటి నష్టం ఉండదు. కారణం ఆ చాంపియన్‌షిప్‌నకు వారు బీమా చేయించడమే. దాంతో టోర్నీ రద్దయినందుకు బీమా కంపెనీ నుంచి వింబుల్డన్ (ఆల్ ఇంగ్లండ్ క్లబ్) నిర్వాహకులకు ఏకంగా రూ. 946 కోట్ల మొత్తం అందనుంది. మరి కొవిడ్-19 ధాటికి ఐపీఎల్ కూడా రద్దయితే.. బీసీసీఐకి కూడా బీమా లభిస్తుందా? అన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే బోర్డు మాత్రం బీమా రాకపోవచ్చనే అంటోంది. కారణం ఇన్సూరెన్స్ అనేది ఒక్కో ప్రాంతానికీ తేడా ఉండడమేనట! ఏదైనా అంటువ్యాధితో టోర్నీ రద్దయితే బీమా క్లెయిమ్ చేసే నిబంధన పాలసీలో ఉండడంవల్లే ఆల్‌ఇంగ్లండ్ క్లబ్‌కు బీమా లభిస్తోందని బీసీసీఐ చెబుతోంది. వింబుల్డన్‌తో ఐపీఎల్‌ను పోల్చే ముందు మార్కెట్ పరిస్థితులు, బీమా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని బోర్డు అధికారి అన్నారు. వైరస్ బారినపడి టోర్నమెంట్ రద్దయితే బీమా చెల్లించే నిబంధన భారత బీమా మార్కెట్‌లో ఉన్నదా..అన్నది చూడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'బీమా విషయంలో ప్రాంతానికీ ప్రాంతానికీ మధ్య తేడా ఉంటుంది. ఇంగ్లండ్ బీమా మార్కెట్ భిన్నంగా అభివృద్ధి చెందింది. ఇంగ్లండ్‌లో రీ ఇన్సూరెన్స్‌కు సంబంధించి పెద్దపెద్ద సంస్థలున్నాయి. అలాగే అక్కడి బీమా రంగంలో సంక్లిష్టతలు, ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకొని వింబుల్డన్‌లాంటి బీమా సదుపాయంపై చర్చించాలి' అని ఆయన సూచించారు. 'ఏదైనా మహమ్మారివల్ల టోర్నమెంట్ నిర్వహించలేకపోతే నష్ట పరిహారం చెల్లించే పాలసీ భారత బీమా మార్కెట్‌లో ఉంటుందని అనుకోవడం లేదు' అని అన్నారు.

### బెక్‌హామ్ కాళ్లకు..



ఇంగ్లండ్ ఫుట్‌బాల్ మాజీ స్టార్ డేవిడ్ బెక్‌హామ్ కాలికి కూడా బీమా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా బీసీసీఐ అధికారి గుర్తు చేశారు. బీసీసీఐ కాంట్రాక్టు జాబితాలో ఉన్న క్రికెటర్లకు అలాంటి బీమా సదుపాయం ఉండడం కష్టమేనని వ్యాఖ్యానించారు. 'బెక్‌హామ్ కాళ్లకు 2006లో 100 మిలియన్ పౌండ్లకు బీమా కల్పించారు. మన మార్కెట్‌లో అలాంటి పాలసీ ఉండకపోవచ్చు. కానీ కరోనా మహమ్మారి నేపథ్యంలో భవిష్యత్తులోనైనా భారత బీమా కంపెనీలు ఈ తరహా ఇన్సూరెన్స్‌పై దృష్టిసారిస్తాయని అనుకుంటున్నా' అని ఆ అధికారి అభిప్రాయపడ్డారు.



## పైసల కోసం ప్రాణాలను పణంగా పెట్టం

### అక్తర్ ఇండో-పాక్ సిరీస్ ప్రతిపాదనపై కపిల్

న్యూఢిల్లీ: కరోనాపై పోరాటం కోసం నిధులు సేకరించడానికి భారత్, పాకిస్థాన్ మధ్య మూడు వన్డేల సిరీస్ నిర్వహించాలని పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ చేసిన ప్రతిపాదనను భారత దిగ్గజం కపిల్‌దేవ్ తీవ్రంగా విమర్శించాడు. తమకు అలాంటి అగత్యం పట్టలేదన్నాడు. ఆటగాళ్ల ప్రాణాలను పణంగా పెట్టి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సమంజసం కాదని చురకంటించాడు. ఖాళీ స్టేడియాల్లో చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్‌లు నిర్వహించాలని.. టీవీల్లో ప్రసారమయ్యేలా చూస్తే మంచి రేటింగ్ వస్తుందని అక్తర్ సూచించాడు. 'అతడి అభిప్రాయాన్ని చెప్పాడు. కానీ, మనకు డబ్బు అవసరం లేదు. ఇప్పుడు కావాల్సిందల్లా విపత్కర పరిస్థితుల్లో ఇరుదేశాల ప్రభుత్వాలు ఎలా సహరించుకుంటున్నాయన్నదే ముఖ్యం' అని కపిల్ అన్నాడు. కరోనాపై పోరులో ప్రభుత్వానికి అండగా బీసీసీఐ రూ. 51 కోట్ల భారీ విరాళం ఇచ్చిందని.. అవసరమైతే ఇంకా ఇవ్వడానికి సిద్ధంగానే ఉంటుందన్నాడు. రానున్న ఆరు నెలలపాటు క్రికెట్ గురించి ఆలోచించక పోవడమే మంచిదని కపిల్ అభిప్రాయపడ్డాడు.



## విరాట్‌పై మా వ్యూహం అదే..

### క్లార్క్ విమర్శలకు ఆసీస్ కెప్టెన్ పెయిన్ కౌంటర్

హోబర్ట్: ఐపీఎల్ కాంట్రాక్టుల కోసం విరాట్ కోహ్లీని కవ్వించకుండా మా వాళ్లు నోటికి తాళాలేసుకున్నారని విమర్శించిన మైకేల్ క్లార్క్‌కు ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ టిమ్ పెయిన్ కౌంటర్ ఇచ్చాడు. టీమిండియా ఆసీస్ టూర్‌లో కోహ్లీని రెచ్చగొట్టకూడదనే వ్యూహంలో భాగంగానే ఆ విధంగా వ్యవహరించినట్టు తెలిపాడు. 'కోహ్లీ పట్ల ఎవరూ మెతక ధోరణి కనబరిచినట్టు నాకు అనిపించలేదు. ఉద్దేశపూర్వకంగా అతడిని అవుట్ చేయకుండా ఉండాలనే ప్రయత్నమూ చేయలేదు. విరాట్‌ను కవ్విస్తే అతడు మరింతగా రెచ్చిపోయి భారీ స్కోరు సాధిస్తాడమోననే ఉద్దేశంతో అలా వ్యవహరించామ'ని చెప్పాడు. 2018-19 ఆస్ట్రేలియా టూర్‌లో భారత్ 2-1తో టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించింది. అయితే, ఐపీఎల్ కాంట్రాక్టులు దక్కవనే భయంతోనే ఆ సిరీస్‌లో ఆసీస్ ఆటగాళ్లు దూకుడుగా వ్యవహరించలేదని క్లార్క్ ఆరోపించిన సంగతి తెలిసిందే.


క్లార్క్

## కౌంటీతో పుజారా ఒప్పందం రద్దు



న్యూఢిల్లీ: బ్రిటన్‌లో కొవిడ్-19 విజృంభణ కారణంగా టీమిండియా క్రికెటర్ చటేశ్వర్ పుజారా ఇంగ్లిష్ కౌంటీ క్లబ్ జట్టు గ్లోస్టర్‌షైర్‌తో ఒప్పందం రద్దు చేసుకున్నాడు. కౌంటీ చాంపియన్‌షిప్‌లో గ్లోస్టర్‌షైర్ తరఫున పుజారా ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

## లబుషేన్ ప్రాక్టీస్.. శునకం కీపింగ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ మర్నస్ లబుషేన్ లాక్‌డౌన్‌లోనూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇందుకోసం అతడికి పెంపుడు శునకం సహాయం చేస్తోంది. లబుషేన్‌కు టెన్నిస్ బాల్‌తో అతడి స్నేహితుడు త్రోడౌన్లు చేస్తుంటే.. శునకం కీపర్‌గా బంతిని అందుకుంటోంది.

## చనిపోయినా పర్లేదనుకున్నా!


వివ్ రిచర్డ్స్

సిడ్నీ: క్రికెట్ అంటే విపరీతమైన ప్రేమ అని.. అందుకోసం తాను చనిపోయినా పర్లేదనుకునేవాడినని వెస్టిండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ పేర్కొన్నాడు. తాను ఆడే రోజుల్లో వివ్ ఎందరో మేటి ఫాస్ట్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నాడు. కానీ ఎప్పుడూ హెల్మెట్ పెట్టుకోలేదు. అప్పట్లో బౌన్సర్ల నిబంధన కూడా లేదు. అయినా అలా బెదురు లేకుండా ఎలా బ్యాటింగ్ చేశారని..ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్‌వాట్సన్ ఆన్‌లైన్ చాట్‌లో రిచర్డ్స్‌ను ప్రశ్నించాడు. 'క్రికెట్ అంటే నాకు విపరీతమైన అనురక్తి. అది ఎంతంటే..హెల్మెట్ లేకుండా ఆడే క్రమంలో నా ప్రాణం పోయినా పర్లేదనుకునేవాడిని' అని రిచర్డ్స్ బదులిచ్చాడు.

## నీ అంత నైపుణ్యం లేదు..

### పేస్ చాలెంజ్‌కు భూపతి స్పందన



న్యూఢిల్లీ: డబుల్స్‌లో మాజీ సహచరుడు లియాండర్ పేస్ విసిరిన 'ఫ్రయింగ్ ప్యాన్' చాలెంజ్‌ను టెన్నిస్ దిగ్గజం మహేశ్ భూపతి స్వీకరించాడు. లాక్‌డౌన్‌తో ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్న ఆటగాళ్లు విభిన్న పనులు చేస్తూ.. సహచరులకు సవాలు విసురుతున్నారు. ఈ నేపథ్యంలో పేస్ 'ఫ్రయింగ్ ప్యాన్' సవాలు విసిరాడు. 'గయ్స్.. లాక్‌డౌన్‌లో ఉన్న మీకో చాలెంజ్. ఎంతమంది నా ప్యాన్ సవాలును స్వీకరిస్తారు' అంటూ ప్యాన్‌తో టెన్నిస్ బంతిని వాలీలుగా కొడుతున్న వీడియోను ట్వీట్ చేశాడు. ఇందుకు స్పందించిన భూపతి.. ఓ చిన్న ప్యాన్‌తో బంతిని కొట్టిన వీడియోను పోస్ట్ చేశాడు. 'లియాండర్. ఇదిగో.. నీ సవాలుకు నా ప్రతి సవాలు. కానీ నీ అంత నైపుణ్యంగా ప్యాన్‌తో బంతిని కొట్టలేకపోయా' అని సరదాగా కామెంట్ చేశాడు.

# బిజినెస్

## డిజిటల్ చెల్లింపులే మేలు: ఆర్‌బీఐ

ముంబై: కరోనా వైరస్ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులే మేలని ఆర్‌బీఐ బ్యాంకుల ఖాతాదారులకు సూచించింది. అన్ని రకాల చెల్లింపుల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే నెఫ్ట్, ఐఎంపీఎస్, యూపీఐ, బీబీపీఎస్‌వంటి డిజిటల్ చెల్లింపుల సౌలభ్యాన్ని ఉపయోగించుకోవాలని కోరింది. ఈ తరహా చెల్లింపులతో బ్యాంకులకు వెళ్లనవసరం లేకుండానే ఆర్థిక లావాదేవీలు ముగించుకోవడంతో పాటు సామాజిక దూరం పాటించినట్టవుతుందని పేర్కొంది. ఈ మేరకు బాలీవుడ్ బాద్‌షా అమితాబ్ బచ్చన్ ద్వారా ప్రచారం ప్రారంభించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా ఇటీవల ఒక వీడియోలో 'పే డిజిటల్. స్టే సేఫ్' అని సందేశం ఇచ్చారు.

## పీఎంజేడీవై ఖాతాల్లో సొమ్ము భద్రం: ఎస్‌బీఐ

హైదరాబాద్: నగదు బదిలీ పథకం ద్వారా ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల్లో జమ చేసే నగదును, లబ్ధిదారులు వెంటనే తీసుకోకపోతే ఆ సొమ్ము ప్రభుత్వానికి బదిలీ అవుతుందన్న వార్తలను ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ తోసిపుచ్చింది. సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఓపీ మిశ్రా గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించిన వచ్చిన పుకార్లను తోసిపుచ్చారు. దీనిపై ఎలాంటి భయాలు అవసరం లేదని, అత్యవసరమైతే తప్ప, ఖాతాదారులు తమ ఖాతాల నుంచి ఈ నగదు విత్‌డ్రా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. సామాజిక దూరం పాటించడం కోసం ఖాతాదారులు డిజిటల్ చెల్లింపుల సౌలభ్యాన్ని ఉపయోగించుకోవాలని కూడా మిశ్రా కోరారు.

## యూకో బ్యాంకు రుణ, ఎఫ్‌డీ వడ్డీ రేట్ల తగ్గింపు

హైదరాబాద్: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటును, ఎంసీఎల్‌ఆర్‌ను తగ్గిస్తున్నట్టు యూకో బ్యాంకు ప్రకటించింది. శుక్రవారం నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. ఏడాది ఎంసీఎల్‌ఆర్ రేటు 0.25 శాతం తగ్గి 7.95 శాతానికి దిగి వస్తుంది. అలాగే భిన్న కాలపరిమితులుండే ఎఫ్‌డీలపై కూడా వడ్డీ రేటును 0.25 శాతం నుంచి 0.50 శాతం మేరకు తగ్గించారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| 9వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 365 | విశాఖపట్నం | 345 |
| 10వ తేదీకి.. | | వరంగల్ | 368 |
| చిత్తూరు | 443 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 80 |
| వరంగల్ | 85 | గుంటూరు | 80 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 80 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | 98 |
| కర్నూలు | 85 | నెల్లూరు | 98 |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | 108 |
| గోదావరి | 85 | | |




## 'సాయం' ముసుగులో మోసం

### ఈఎంఐలు వాయిదా వేయిస్తామంటూ ఫోన్ కాల్స్

### ఎలాంటి సమాచారం ఇవ్వొద్దని బ్యాంకుల హెచ్చరిక

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు రాటుదేలిపోతున్నారు. బ్యాంకు కస్టమర్ల ఖాతాలు ఖాళీ చేసేందుకు రోజుకో ఎత్తుగడ వేస్తున్నారు. రుణ కిస్తీ (ఈఎంఐ)ల వసూళ్లపై ఆర్‌బీఐ విధించిన మూడు నెలల మారిటోరియం (వాయిదా) సౌకర్యాన్ని ఇప్పుడు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. మీ ఖాతా వివరాలు చెప్పండి. ఈఎంఐల వాయిదాకు 'సాయం' చేస్తామంటూ ఖాతాదారులకు బురిడీ కొడుతున్నారు. ఖాతా వివరాలు చెప్పిన వెంటనే ఆ ఖాతాలోని సొమ్మంతా కొట్టేస్తున్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకులతోపాటు మరికొన్ని బ్యాంకులు తమ ఖాతాదారులను హెచ్చరించాయి.

#### ఇదీ మోసం చేసే తీరు

బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వ్యక్తులే ఈ సైబర్ కేటుగాళ్ల టార్గెట్. వారి వివరాలు తెలుసుకుని 'మీకు ఈఎంఐల వాయిదా' కావాలా? కావాలంటే మమ్మల్ని సంప్రదించండి' అని ఫోన్ చేస్తారు లేదా ఈ-మెయిల్ పంపిస్తారు. ఇది నిజమేననుకుని ఎవరైనా వారిని సంప్రదిస్తే మాటలతో నమ్మించి వారి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డుల సీవీవీ నంబర్లు లేదా పిన్ నంబర్లు రాబడతారు. ఈ వివరాలు చెప్పగానే ఆ బ్యాంకు ఖాతాలో ఉన్నదంతా ఊడ్చేస్తారు. లేదా ఈఎంఐల వాయిదాకు సంప్రదించమంటూ మీ ఈ-మెయిల్, వాట్సప్ నంబరుకు మెసేజ్‌లు లేదా ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు పంపుతారు. ఒకవేళ వచ్చిన ఆ ఈ-మెయిల్‌ను క్లిక్ చేస్తే మీకు తెలియకుండానే మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో ఆటోమేటిక్‌గా కొన్ని మాల్‌వేర్స్ ఇన్‌స్టాల్ అయి మీ బ్యాంకు లావాదేవీలన్నీ ఈ కేటుగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతాయి. ఆ సమాచారం ఆధారంగా మీ ఖాతాల్లోని సొమ్మంతా మాయం చేస్తారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి మోసాలు బ్యాంకుల దృష్టికి రావడంతో అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులను కోరుతున్నాయి.

## ఇది మహా మాంద్యమే: ఐఎంఎఫ్

### 1930 తర్వాత అతిపెద్ద ఆర్థిక సంక్షోభం



వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గత నెలలోనే మహా మాంద్యంలోకి జారుకుందనడానికి మరిన్ని ఆధారాలు అందుబాటులోకి వచ్చాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. 1930 నాటి మహా మాంద్యం తర్వాత ఇదే అతిపెద్ద ఆర్థిక సంక్షోభం కానుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. ఈ ఏడాది 170కి పైగా దేశాల తలసరి ఆదాయ వృద్ధి రుణాత్మక స్థాయికి క్షీణించనుందన్నారు. 1929లో అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం ప్రపంచదేశాలన్నింటికీ విస్తరించి, దశాబ్ద కాలం పాటు కొనసాగింది.

కోవిడ్-19 ప్రభావం వల్ల అతలాకుతలం అయిన ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ మరో 2.3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక ప్యాకేజిని ప్రకటించింది. చిన్న, మధ్య తరహా సంస్థల రుణాల్లో 60 కోట్ల డాలర్ల రుణాలను కొనుగోలు చేసేందుకు మెయిన్ స్ట్రీట్ లెండింగ్ ప్రోగ్రామ్ ఈ ప్యాకేజీలో ప్రధానమైనది. ప్రస్తుత సంక్షోభానికి ముందు

### అమెరికన్ ఫెడరల్ మరో భారీ ప్యాకేజి

చక్కని ఆర్థిక స్తోమత కలిగి ఉండి 10 వేల మంది కార్మికులు పని చేస్తున్న సంస్థలను ఎంపిక చేసి వాటికి నాలుగేళ్ల కాలపరిమితి గల రుణాలు అందిస్తారు. అసలు, వడ్డీ చెల్లింపులన్నింటినీ ఒక ఏడాది వాయిదా వేస్తారు. మూడున్నర కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న 40 వేల కంపెనీలకు ఇది లాభం చేకూరుస్తుందని ట్రెజరీ శాఖ మంత్రి ముంచిన్ అన్నారు.

### అదే బాటలో భారత్

కరోనా కష్టాల నుంచి ఊరట కల్పించేందుకు గత నెలలో ప్రకటించిన రూ.1.75 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీకి అదనంగా మరో రూ.లక్ష కోట్లకు పైగా విలువైన ఆర్థిక ప్యాకేజీని భారత ప్రభుత్వం త్వరలోనే ప్రకటించవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్ తాజా నివేదిక అంటోంది. ఇది జీడీపీలో 0.30-0.35 శాతానికి సమానమని సంస్థ ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు వడ్డీ రేటు రాయితీ, స్థిరాస్తి రంగానికి ప్రోత్సాహకాలు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరిన్ని మూలధన నిధులు వంటివి ఇందులో ఉండవచ్చు.

## హైదరాబాద్‌లో అమెజాన్ పాంట్రీ పునరుద్ధరణ

హైదరాబాద్: హైదరాబాద్‌లో అమెజాన్ పాంట్రీ, అమెజాన్ ఫ్రెష్ సర్వీసులను పునరుద్ధరించినట్టు ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ తెలిపింది. వరంగల్‌లోనూ అమెజాన్ పాంట్రీ సేవలు అందిస్తున్నట్టు తెలిపింది. వీటి ద్వారా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిత్యావసర సరుకులను కస్టమర్లకు డెలివరీ చేస్తున్నట్టు తెలిపింది.

## త్వరలో కొరియర్, పార్సిల్ సర్వీసులకు అనుమతి!

న్యూఢిల్లీ: వ్యాపారాలకు త్వరలోనే కాస్త ఊరట లభించే సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం త్వరలోనే కొరియర్, పార్సిల్ సర్వీసులకు అనుమతిచ్చే అవకాశం ఉన్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవర్గాల ద్వారా తెలిసింది. ఒకవేళ ఈ సర్వీసులకు అనుమతి లభిస్తే కంపెనీలు వివిధ రకాల డాక్యుమెంట్లను పంపడానికి, పొందడానికి అవకాశం ఏర్పడనుంది.

## స్పెన్సర్స్‌తో ఫ్లిప్‌కార్ట్ జట్టు

హైదరాబాద్: ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. రిటైల్ చెయిన్ స్టోర్ స్పెన్సర్స్‌తో జట్టుకట్టింది. ఇందులో భాగంగా నిత్యావసర సరుకులను హైదరాబాద్‌లో కస్టమర్ల ఇంటికే డెలివరీ చేయనుంది. ప్రయోగాత్మకంగా నగరంలో ఈ సేవలను ప్రారంభిస్తోంది. రెండు సంస్థల ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ మూలంగా వేగవంతంగా, సురక్షితంగా కస్టమర్లకు సరుకులను డెలివరీ చేసే అవకాశం ఉందని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తి తెలిపారు.

## టారిఫ్ రేట్లు తగ్గించిన బ్లూడార్ట్

ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ సర్వీసులు అందిస్తున్న బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్.. రిటైల్ టారిఫ్ ధరలను 25 శాతం మేర తగ్గించింది. భారత్ కరోనా సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది.

## సిమెంట్ గిరాకీకి గండి

### తెలుగు రాష్ట్రాల్లో 65 శాతం సామర్థ్య వినియోగం

### కరోనా నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో లాక్‌డౌన్ కారణంగా 2020-21 ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ గిరాకీ బాగా పడిపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలం తర్వాత కానీ కొనుగోళ్లు తిరిగి పుంజుకునే అవకాశం కనిపించడం లేదు. లాక్‌డౌన్ నుంచి కనీసం మే చివరినాటికైనా బయట పడలేదంటే.. సిమెంట్ గిరాకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 నుంచి 40 శాతం వరకూ తగ్గే వీలుందని ఇండ్‌రా, క్రిసిల్ సహా పలు రేటింగ్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత కూడా కనీసం నెల రోజుల పాటు కార్మికుల లభ్యత, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగవచ్చని ఇండ్‌రా పేర్కొంది. ద్వితీయార్థంలోనే మళ్లీ నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

### తెలుగు రాష్ట్రాల్లో నిలిచిన ఉత్పత్తి

లాక్‌డౌన్‌తో తెలుగు రాష్ట్రాల్లోని సిమెంట్ కంపెనీలు ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశాయి. నిర్మాణ కార్యక్రమాలు పుంజుకుని సిమెంట్‌కు గిరాకీ పెరుగుతున్న తరుణంలో కోవిడ్- 19 ప్రతికూల ప్రభావాన్ని చూపిందని, కార్మికులు ఉపాధి కోల్పోయేలా చేసిందని స్థానిక సిమెంట్ కంపెనీ అధిపతి ఒకరు తెలిపారు. లాక్‌డౌన్ తర్వాత పరిశ్రమ గాడిలో పడేందుకు కనీసం ఒక నెల రోజులైనా పడుతుందన్నారు.

#### ఇప్పటికే కష్టాల్లో

2019-20లో జనవరి వరకూ సిమెంట్ ఉత్పత్తి అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 1.1 శాతం పెరిగి 27.88 కోట్ల టన్నులకు చేరింది. గృహ రంగం నుంచి గిరాకీ తగ్గడం, మౌలిక సదుపాయాల రంగంలో ప్రాజెక్టులు మందగించడం ఇందుకు కారణాలు. గత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి 13 శాతం పెరిగిందని పరిశ్రమ ప్రతినిధి ఒకరు చెప్పారు. మొత్తం సిమెంట్ గిరాకీలో 35-40 శాతం గిరాకీ ఈ రెండు రంగాలదే.

కంపెనీల ఆదాయం, లాభాలపై కోవిడ్ ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయలేమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 9.8 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 2.8 కోట్ల టన్నుల సిమెంట్‌ను ఇక్కడే వినియోగిస్తున్నారు. 2.8 కోట్ల టన్నుల సిమెంట్‌ను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో గిరాకీకన్నా సరఫరా ఎక్కువగా ఉన్నందున 60-65 శాతం సామర్థ్యాన్నే తెలుగు రాష్ట్రాల్లోని సిమెంట్ ఫ్యాక్టరీలు వినియోగించుకుంటున్నాయి.

సాధారణంగా వానాకాలం తర్వాత నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభంకావడంతో గిరాకీ, ధరలు కూడా పెరుగుతాయి. నవంబరు నుంచి జనవరి మధ్య కాలంలో గిరాకీ, ధరలు కొద్దిగా పుంజుకున్నాయి. మార్చి మొదటి వరకూ పరిస్థితులు ఆశావహంగా ఉన్నాయి. లాక్‌డౌన్ తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.

- ఎస్.శ్రీకాంత్ రెడ్డి, జేఎండీ, సాగర్ సిమెంట్

# లాక్‌డౌన్‌లో ప్రేమపెళ్లి

▸▸ 40 కి.మీ. ఒంటరిగా నడిచి వెళ్లి తాళి కట్టించుకున్న పెళ్లికుమార్తె



మచిలీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు కరోనా భయం.. మరోవైపు లాక్‌డౌన్ దిగ్బంధం. ఇవేమీ ప్రేమ పెళ్లికి అడ్డుకాలేదు! లాక్‌డౌన్‌ను కూడా లెక్కచేయని అమ్మాయి 40 కిలోమీటర్లు ఒంటరిగా నడిచివెళ్లి ప్రియుడితో తాళి కట్టించుకుంది. ఆ వివరాలు...కృష్ణా జిల్లా మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన కళ్ళేపల్లి సాయి పున్నయ్య, హనుమాన్ జంక్షన్‌కు చెందిన సీహెచ్ భవానీ కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం యువతి ఇంట్లో తెలిసింది. ఆమె తల్లిదండ్రులు పున్నయ్యకు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో ప్రేమికులిద్దరూ ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి ఒంటరిగా బయల్దేరిన భవానీ 40 కి.మీ కాలినడకన మచిలీపట్నం చేరుకుంది. అక్కడ ప్రేమికులిద్దరూ బుధవారం వివాహం చేసుకున్నారు. వారి వినతిపై పోలీసులు జోక్యం చేసుకొని ఇరు కుటుంబాలకు నచ్చజెప్పి, కొత్త దంపతులను వారి వెంట పంపించారు.

## చంద్రబాబు ఏపీలోకి రావాలంటే 14 రోజులు క్వారంటైన్‌కు వెళ్లాలి: మోపిదేవి

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): "కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది. హైదరాబాద్‌లో కూర్చుని ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజకీయ విమర్శలు చేయడం అర్థరహితం" అని మంత్రి మోపిదేవి వెంకట రమణ ఆక్షేపించారు. హైదరాబాద్‌లో కూర్చుని వీడియో కాన్ఫరెన్స్, టెలీ కాన్ఫరెన్స్‌ల ద్వారా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఏదైనా ఉంటే ఆయన ఇక్కడికి వచ్చి మాట్లాడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోకి రావాలంటే ఆయన తెలంగాణ ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్నారు. ఆ పత్రంతో ఏపీలోకి వచ్చిన తరువాత 14 రోజుల పాటు క్వారంటైన్‌కు వెళ్లాల్సి ఉంటుందని మంత్రి అన్నారు.

## సురేశ్ కూడా క్వారంటైన్‌కు వస్తారా?: అచ్చెన్న

'ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రానికి వచ్చినా క్వారంటైన్‌కి వెళ్లి రావాల్సిందేనని మంత్రి మోపిదేవి అంటున్నారు. మరి విద్యాశాఖ మంత్రి ఆది మూలపు సురేశ్ లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి హైదరాబాద్ ఎలా వెళ్లారు? అక్కడ ప్రెస్‌మీట్ కూడా నిర్వహించారు. మరి ఆయన తిరిగి రాష్ట్రానికి వచ్చేప్పుడు ఈ ప్రభుత్వం మంత్రిని క్వారంటైన్‌కి పంపుతుందా? అని టీడీఎల్పీ ఉపనేత కె.అచ్చెన్నాయుడు గురువారం ట్వీట్ చేశారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వైద్యులకు కరోనా

▸▸ మాస్క్ అడిగిన పాపానికి సస్పెన్షనా?: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి): మాస్క్ అడిగిన పాపానికి వైద్యుడిని సస్పెండ్ చేయడం ముఖ్యమంత్రి జగన్ మూర్ఖత్వానికి పరాకాష్ట. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి వల్లే వైద్యులు కూడా కరోనా బారిన పడుతున్నారు. అనంతపురంలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు వైద్య సిబ్బందికి కరోనా సోకిందంటే ఇక ప్రజల సంగతేంటి? అని టీడీపీ మాజీ మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్యులకు మాస్కులు, వ్యక్తిగత రక్షణ కిట్లు ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్లే వారికి కరోనా సోకిందన్నారు.

## వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా?

▸▸ అనంతలో జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణ

అనంతపురం వైద్యం, ఏప్రిల్ 9: కరోనా నియంత్రణకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అంటూ అనంతపురం జిల్లా సర్వజనాస్పత్రిలో జూనియర్ వైద్యులు నిరసన వ్యక్తంచేశారు. గురువారం విధులు బహిష్కరించి, చాంబర్లలోనే ఉండిపోయారు. పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్క్‌లు ప్రతి డాక్టర్‌కు ఇవ్వకపోతే ఎలాగంటూ వాదనకు దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు అక్కడకు చేరుకొని జూనియర్ వైద్యులు, ఆస్పత్రి వైద్యాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ప్రతి డాక్టర్‌కు ఎన్-95 మాస్క్‌లు అందిస్తామని, ఎక్కడ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ భరోసా ఇవ్వడంతో జూనియర్ వైద్యులు శాంతించారు.

## నేను క్వారంటైన్‌కా?.. అధికారమే మాది!!

▸▸ కేంద్ర కార్పొరేషన్ అధికారిణి వీరంగం

అమరావతి, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ కార్పొరేషన్‌లో పనిచేసే ఓ ఉన్నతాదికారిణి మార్చి 21వ న హైదరాబాద్ వెళ్లారు. ఏప్రిల్ 6న హఠాత్తుగా విజయవాడ వచ్చారు. ఒక కాంట్రాక్టరుకు బిల్లుల చెల్లింపు చెక్‌లు సంతకం చేసేందుకే ఆగమేఘాల మీద వచ్చారని తెలిసింది. కోటి రూపాయలకు పైగా ఉన్న బిల్లుల చెల్లింపు చెక్‌లను ఆమె కారులోనే కూర్చుని సంతకాలు పెట్టేశారు. ఆ మర్నాడు నేరుగా తన కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలో ఉన్న కొందరు.. హోం క్వారంటైన్ అవసరం లేదా? చెక్‌పోస్టుల్లో ఆపుతున్నారు కదా? అని అడిగారు. అంతే! ఆమె అగ్గిమీద గుగ్గిలమయ్యారని సమాచారం. 'నేను ఫలానా సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని. నాపైన, ఆపైన, ఇంకా పైన... చివరికి రాష్ట్ర ప్రభుత్వాన్ని పాలించేవారి వరకు ఒకటే వర్గం. నాకేంటి క్వారంటైన్' అంటూ చిందులు తొక్కారని తెలిసింది.

## సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలివ్వండి:ఉషారాణి

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కరోనా (కోవిడ్-19) మహమ్మారిని నియంత్రించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి విరాళాల రూపంలో మద్దతు పలకాలని రెవెన్యూ, విపత్తు, దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి వి. ఉషారాణి పిలుపునిచ్చారు. విరాళాల సొమ్ముకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపు లభిస్తుందని పేర్కొన్నారు. నాలుగు బ్యాంకు ఖాతాల వివరాలను ఉషారాణి వెల్లడించారు.

**బ్యాంకు ఖాతాలివే:**

1. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ సచివాలయం బ్రాంచ్- అకౌంట్ నంబర్ 38588079208/ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0018884., 2. ఆంధ్రా బ్యాంకు, ఏపీ సచివాలయం బ్రాంచ్/అకౌంట్ నంబర్ 110310100029039, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఏఎన్‌డీబీ0003079., 3. యాక్సిస్ బ్యాంక్, సూర్యారావుపేట, విజయవాడ/అకౌంట్ నంబర్918020099083519, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: యూటీఐబీ0000555, 4. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, విజయవాడ/అకౌంట్ నంబర్50200034620709, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: హెచ్‌డీఎఫ్‌సీ0000109.

## కొవిడ్‌పై పోరాటానికి అండగా ఉంటాం

▸▸ సీఎం లేఖకు రతన్ టాటా స్పందన

అమరావవతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కరోనా(కొవిడ్ -19)పై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధానికి మద్దతుగా తమవంతు మద్దతు ఉటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్ సంస్థల అధిపతి రతన్ టాటా హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం సీఎంకు లేఖ రాశారు. రాష్ట్రానికి సాయమందించాలంటూ ఇటీవల జగన్ రాసిన లేఖను ఇందులో ప్రస్తావించారు. జీవితంలో ఎవరూ చూడని విధమైన విలయం వచ్చిందని .. కొవిడ్ -19కు ప్రపంచమే కంపించిపోతోందని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. కొవిడ్-19పై సాగిస్తున్న యుద్ధంపై తాము కేంద్రీకృతమైన సేవలు అందించాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. సంబంధిత మెడికల్ కిట్లు, వైద్య పరికరాలను అందించాలని నిర్ణయించామని, అయితే.. ప్రపంచ వ్యాప్తంగా వీటి తయారీ నిలిచిపోవడంతో.. సమీకరించే పనిలో ఉన్నామని తెలిపారు. దేశంలోని రాష్ట్రాలన్నింటికీ కొవిడ్-19పై చేసే యుద్ధంలో సహకారం అందిస్తామని, ఆంధ్రప్రదేశ్‌కూ సాయమందిస్తామని రతన్ టాటా హామీ ఇచ్చారు.

# కొడుకు కోసం కన్నతల్లి సాహసం!

▸▸ లాక్‌డౌన్‌తో నెల్లూరులో చిక్కుకున్న కుమారుడు

▸▸ స్కూటీపై 1400 కి.మీ.లు వెళ్లి తీసుకొచ్చిన తల్లి

ఏఎస్‌పేట, ఏప్రిల్ 9: లాక్‌డౌన్ కారణంగా కుమారుడు నెల్లూరులో చిక్కుకుపోయాడు. తానేమో తెలంగాణ రాష్ట్రంలో ఉంది. ఈ కట్టడిలో ఎన్ని కష్టాలు పడుతున్నాడో తెలియదు. వేళకు తింటున్నాడో లేదో తెలిసే దారే లేదు! దీంతో ఆ తల్లే తన కుమారుడి దగ్గరకు దారిపట్టింది. స్కూటీపై ఒంటరిగా సుమారు 1400 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఎట్టకేలకు కుమారుడిని కలుసుకొని, అదే స్కూటీపై ఇంటికి తీసుకెళ్లింది. గురువారం సోషల్ మీడియాలో హల్‌చల్ అయిన ఈ ఉదంతం వివరాలు.. తెలంగాణలోని బోధన్‌కు చెందిన రజియా బేగం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 12 ఏళ్ల క్రితం భర్త మృతి చెందిననాటినుంచీ పిల్లలే ఆమెకు సర్వస్వం. వారిలో చిన్న కుమారుడు నిజాముద్దీన్ నెల్లూరు జిల్లా ఏఎస్‌పేటలో స్నేహితుడి ఇంటికి నెలరోజుల క్రితం వచ్చారు. లాక్‌డౌన్‌తో ఇక్కడే చిక్కుకుపోయారు. కుమారుడి గురించి కలతచెందిన ఆమె.. స్థానిక పోలీసులకు విషయం చెప్పి వారి నుంచి లేఖ (ఎన్‌వోసీ) తీసుకున్నారు. సోమవారం ఉదయం బోధన్ నుంచి స్కూటీపై బయలుదేరి.. సుమారు 700 కిలోమీటర్లు ప్రయాణించి మంగళవారానికి ఏఎస్‌పేటకు చేరుకున్నారు. తెలంగాణ పోలీసులు ఇచ్చిన లేఖ ఉండటంతో ఆమెను మన పోలీసులు ఎక్కడా అడ్డుకోలేదు. తన కుమారుడితో సాయంత్రం తిరుగు ప్రయాణమై బుధవారం మధ్యాహ్నానికి క్షేమంగా ఆమె బోధన్ చేరుకున్నారు.



కుమారుడిని నెల్లూరు నుంచి తీసుకొచ్చిన రజియా బేగం

# ఒకే కుటుంబంలో నలుగురికి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా కేసుల ఉధృతి తగ్గడం లేదు. గురువారం కొత్తగా 15 కేసులు నమోదయ్యాయి. ప్రకాశంలో 11, గుంటూరులో 2, కడప, తూర్పుగోదావరి జిల్లాలో ఒక్కొక్కరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఏపీలో కరోనా కేసుల సంఖ్య 363కి చేరింది. ప్రకాశం జిల్లాలో ఒక్కరోజే 11 కేసులు నమోదవడం తీవ్ర కలకలకం రేపింది. వీటిలో 10 ఒంగోలు ఇస్లాంపేటకు చెందినవి కావడం ఆందోళన కలిగించే విషయం. వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. ఆ ఇంట్లోని వ్యక్తికి ఇంతకుముందే పాజిటివ్ వచ్చింది. ఇప్పటికే ఇస్లాంపేటలో ఏడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గురువారం నమోదైన మరో కేసు ఒంగోలులోని గోపాల నగరానికి చెందిన వారు.

### గుంటూరులో తొలి కరోనా మరణం

కరోనా మహమ్మారి గుంటూరు జిల్లాలో తొలిసారిగా ఒకరిని బలి తీసుకుంది. నరసరావుపేటకు చెందిన 45 ఏళ్ల వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఇంటింటికీ వెళ్లి కేబుల్ బిల్లు వసూలు చేసే అతనికి ఈ నెల 6న పాజిటివ్ అని తేలింది. దీంతో అతన్ని విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అతడికి క్షయ కూడా ఉండడంతో కరోనా ప్రభావం ఎక్కువై మూడు రోజుల్లోనే మరణించాడు. కాగా.. పొన్నూరుకు చెందిన మాజీ సైనికుడి (70)కి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో విజయవాడకు తరలించారు. ఇటీవల గుంటూరు వచ్చిన అతనికి ఢిల్లీ కనెక్టివిటీ ద్వారా సోకిందేమోనని అనుమానిస్తున్నారు.

### మృతుడి సోదరుడూ మృతి

కృష్ణాజిల్లా కరోనా వైరస్ బారినపడి మృతి చెందిన వ్యక్తి సోదరుడు మృతి చెందాడు. మచిలీపట్నానికి చెందిన రోల్డ్‌గోల్డ్ వ్యాపారికి పాజిటివ్ రావడంతో విజయవాడలో చికిత్స పొందుతూ మరణించారు. పెడన క్వారంటైన్ సెంటరులో ఉన్న అతడి సోదరుడికి గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. వైద్యపరీక్షల్లో నెగెటివ్ అని తేలిన తర్వాతే మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

### ఉపాధ్యాయుడికి కరోనా

విశాఖ జిల్లా పాయకరావుపేట మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు (38)కి తూర్పుగోదావరిజిల్లాలో కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. అతనికి న్యుమోనియా కూడా ఉండడంతో ముందుజాగ్రత్తగా విశాఖకు తరలించారు. ఆయిన భార్యకు నెగెటివ్ వచ్చింది. ఆయనకు వ్యాధి లక్షణాలున్నా సమాచారమివ్వకుండా దాచిపెట్టినందుకు ఉపాధ్యాయుడి మావయ్య, ఆర్‌ఎంపీ వైద్యుడు, లాబ్ టెక్నీషియన్‌లపై కేసులు నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ నయీమ్ అస్మీ తెలిపారు.

### కడప జిల్లాలో మరొకటి

కడప జిల్లాలో మైదుకూరుకు చెందిన మహిళకు పాజిటివ్ నిర్ధారణ అయింది. ఢిల్లీ వెళ్లొచ్చిన కొడుకు నుంచి ఆమెకు వైరస్ సోకింది.

### చిత్తూరులో కోలుకున్న బాధితుడు

చిత్తూరు జిల్లాలో తొలి కరోనా పాజిటివ్ కేసుగా నమోదైన యువకుడు కోలుకున్నాడు. గురువారం అతడ్ని వైద్యులు డిశ్చార్జి చేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన 23 ఏళ్ల యువకుడు లండన్ నుంచి మార్చి 19న స్వస్థలం చేరుకున్నాడు. అతనికి కరోనా పాజిటివ్ అని 24న తేలింది. దీంతో అతనికి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స అందించారు. రెండోసారి కూడా నెగెటివ్ రిపోర్టు రావడంతో గురువారం అతన్ని డిశ్చార్జి చేశారు.



విజయవాడలో బైక్‌లపై తిరిగే వారిని పక్కన నిలబెట్టిన పోలీసులు. (ఇన్‌సెట్) పోలీసులు స్వాధీనం చేసుకున్న తాళాలు

## నివురుగప్పిన నిప్పులా...

(మొదటి పేజీ తరువాయి)

సర్వేలో 12,311 మంది అనుమానితులను గుర్తించారు. వీరిలో 1754 మందిని మాత్రమే గృహనిర్బంధంలో ఉండాలని సూచించారు. 26 మందిని ఆస్పత్రికి తరలించి, పరీక్షలు నిర్వహించినట్లు అధికారులే స్వయంగా వెల్లడించారు. క్వారంటైన్‌లో ఉన్నవారందరికీ పరీక్షలు చేస్తే కరోనా ప్రభావితులంతా బయటపడే అవకాశాలున్నాయి.

**నిర్లక్ష్యానికి భారీ మూల్యం:** ఒకవైపు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుంటే... బాధితుల వైపు నుంచి కూడా తప్పిదాలు కనిపిస్తున్నాయి. చాలామంది కరోనా లక్షణాలున్నా ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కరోనాతో మృతి చెందిన కేసులను పరిశీలిస్తే... వారికి ఆ లక్షణాలున్నా ఆస్పత్రికి వెళ్లకుండా ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. మరోవైపు కరోనా వ్యాప్తి చెందడం వెనుక అధికారుల పాత్ర కూడా ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లో కరోనాతో మృతి చెందిన వారి దేహాన్ని సాధారణ రోగుల మాదిరిగా వారి బంధువులకు ఇచ్చేశారు. వేలసంఖ్యలో పరీక్షలు చేసే సామర్థ్యం మన దగ్గర ఉన్న పరీక్షా కేంద్రాలకు లేదు. లాక్‌డౌన్ నిబంధనలను కూడా ప్రజలు ఉల్లంఘిస్తున్నారు. మహారాష్ట్రలో 25,753 మందికి కరోనా పరీక్షలు చేస్తే 1297 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కేరళలో 11,252 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 345మందికి పాజిటివ్ అని తేలింది. ఏపీలో కేవలం 5612మందికే పరీక్షలు నిర్వహించారు. వీరిలో 348మందికి పాజిటివ్ వచ్చింది. మరింత మందికి పరీక్షలు చేస్తే కేసుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి.

## ▸▸ యముడితో జాగ్రత్త

కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహనకు విజయనగరం పోలీసులు వినూత్న ఆలోచన చేశారు. యముడి వేషధారికి కరోనా వైరస్ ఆకారంలో తయారు చేసిన గదను ఇచ్చి రోడ్డుపైకి వచ్చే వారికి హెచ్చరిస్తున్నారు. ఇంట్లో ఉంటావా? లేక యమపురికి వస్తావా అంటూ వారు వాహనదారులతో మాట్లాడటం అందరినీ ఆలోచింపజేసింది. విజయనగరంలోని వీటీ అగ్రహారం, వై.జంక్షన్ వద్ద గురువారం ఈ ప్రదర్శనలు ఇచ్చారు.

**- విజయనగరం క్రైం**



## నాడు మయసభ అన్నారు

▸▸ నేడు అదే నోటితో మెచ్చుకుంటున్నారు

▸▸ విశాఖ మెడ్‌టెక్ జోన్‌పై జగన్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెడ్‌టెక్ జోన్ మయ సభని.. అక్కడ ఏమీ లేదని విమర్శించిన నోటితోనే ఇప్పుడు అది దేశానికి గర్వకారణమని ప్రశంసించడం సంతోషకరమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వైద్యులకు మాస్కులివ్వాలని అడిగినందుకు నర్సీపట్నం డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన గురువారం వేర్వేరు లేఖలు రాశారు. 'మెడ్‌టెక్ జోన్ ప్రాధాన్యాన్ని జగన్ ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించడం సంతోషం. గత ప్రభుత్వ దూరదృష్టి, ముందు చూపు ఆలోచనలు మెడ్‌టెక్ జోన్ పనితీరులో ప్రతిఫలిస్తున్నాయి. ప్రస్తుత సంక్షోభంలో 55 నిమషాల్లోనే కరోనా నిర్ధారణ చేసే టెస్టింగ్ కిట్ల తయారీకి ఈ జోన్ వేదిక కావడం శుభ పరిణామం. ఇప్పుడు రోజుకు రెండు వేల కిట్ల తయారీ సామర్థ్యం దానికి ఉంది. ఈ నెలాఖరుకు రోజుకు పాతిక వేలకు.. మే నెలాఖరుకు ఏడున్నర లక్షలకు చేరుకోబోతుండడం ఈ కారు చీకట్లో కాంతి రేఖ. 3,000కి పైగా వెంటిలేటర్లు, వైద్య సిబ్బందికి కావాల్సిన వ్యక్తిగత రక్షణ పరికరాలు కూడా ఇందులో యుద్ధ ప్రాతిపదికన తయారు చేస్తుండడం ముదావహం. ఈ పది నెలలూ దానిని నిర్లక్ష్యం చేయకుండా మరింత అభివృద్ధి చేసి ఉంటే ఇది దేశానికే మరింత మంచి సేవలు అందించేది. మరిన్ని కంపెనీలు ఈ మెడ్‌టెక్ జోన్‌కు వచ్చేవి. గత ప్రభుత్వంపై అక్కసుతో ఆరోపణలు, విచారణలతో ఏడాది కాలాన్ని వృధా చేశారు' అని చంద్రబాబు ఆక్షేపించారు. ఇదే స్ఫూర్తితో అన్న క్యాంటీన్లు, చంద్రన్న బీమా, ఆర్టీజీ వ్యవస్థను కూడా వాడుకోవాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రెక్కాడితేగాని డొక్కాడని లక్షలాది మంది పేద కార్మికుల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు ఉండి ఉంటే ఇప్పుడు కరోనా సంక్షోభ సమయంలో వారికి ఎంతో ఉపయోగపడి ఉండేవని.. కేరళ, కర్ణాటక, హైదరాబాద్ వంటి చోట్ల ఈ తరహా క్యాంటీన్లు అందిస్తున్న ఫలితాలతోనైనా మన వద్ద కూడా వీటిని పునరుద్ధరించాలని కోరారు. కూలీల కొరత, రవాణా సౌకర్యాల స్తంభనతో ఆక్వా, పౌల్ట్రీ, పండ్ల తోటలు, కూరగాయల తోటలు, పత్తి, మిర్చి, ఉల్లి, ధాన్యం తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధ ప్రాతిపదికన స్పందించి వారిని ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. లాక్‌డౌన్ సమయంలో ఉపాధి కోల్పోయి రోజువారీ కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు, చేనేత, గీత, మత్స్యకారులు, ఇతర చేతివృత్తులవారు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, వారికి కూడా తక్షణం రూ. ఐదు వేల సాయం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'వ్యవస్థల నిర్మాణం చాలా కష్టం. విధ్వంసం చాలా సులభం. ఇకనైనా రాష్ట్రంలో విధ్వంసాలకు స్వస్తి చెప్పండి' అని పేర్కొన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సుధాకర్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరించాలని కూడా జగన్‌ను చంద్రబాబు కోరారు. ప్రస్తుత క్లిష్ట సమయంలో అవసరమైన పరికరాలు ఇవ్వడం ద్వారా వైద్యుల మనో ధైర్యం కాపాడాలని విజ్ఞప్తి చేశారు. 'మాస్కులు, గ్లౌజులు అడిగిన డాక్టర్‌ను సస్పెండ్ చేయడం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. కరోనా వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తూ అనంతపురంలో నలుగురు వైద్య సిబ్బంది ఈ వైరస్ బారిన పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో సుధాకర్ వ్యాఖ్యలను సానుకూలంగా చూడాలి తప్ప ప్రతికూల చర్యలు సరికాదు' అని పేర్కొన్నారు.

# పోలీసులు కొట్టరు

▸▸ హద్దు మీరితే కేసులు నమోదు చేస్తాం

▸▸ సోషల్ మీడియాపై టెక్నాలజీ ద్వారా నిఘా

▸▸ లాక్‌డౌన్ పొడిగిస్తే.. మన ప్రాణాల కోసమే

▸▸ 'ఆంధ్రజ్యోతి'తో డీజీపీ ముఖాముఖి



అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'వర్గ వైషమ్యాలు, ప్రాంతాల మధ్య గొడవలు, శాంతి భద్రతల సమస్యలను ఎలా ఎదుర్కోవాలో పోలీసులకు తెలుసు. కానీ స్వతంత్ర భారతావని చరిత్రలో కని, విని, ఎరుగని పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ఇలాంటి విపత్తును అందరం కలిసి ఓడించాలి. పోలీసులు, వైద్యులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎవరి ఇళ్లల్లో వాళ్లు ఉంటూ కొవిడ్‌పై విజయం సాధించాలి' అని డీజీపీ గౌతమ్ సవాంగ్ పిలుపునిచ్చారు. లాక్‌డౌన్ పొడిగింపు, ప్రజల రక్షణలో పోలీసులు వంటి పలు అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

**ఇలాంటి సవాలును ఎదుర్కోవడంలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి?**

రోడ్డుపైకి వచ్చేవారంతా లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించడానికే రావడం లేదు. కొందరు ఆకతాయితనంతో వస్తుంటే మరికొందరు మెడికల్ ఎమర్జెన్సీ కోసం వస్తున్నారు. వారిని పోలీసులు డీల్ చేసే విధానం మారాలి. మొదట్లో కొంత ఇబ్బంది ఎదురైనా ఇప్పుడు సర్దుకుంది.

**పోలీసు బాస్‌గా ఇబ్బంది పడిన సందర్భం..?**

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మనవారిని సరిహద్దుల్లోనే ఆపేయడం బాధ అనిపించింది. వారిని తరిమివేయలేం. అలాగని రప్పించలేం. ఆ సమయంలో నిద్రలేని రాత్రులు గడిపా.

**అమాయకులను కొట్టారంటూ పోలీసులపై వ్యతిరేకత రావడంపై ఏమంటారు?**

బయటికి రావొద్దని పదేపదే చెబుతున్నా కొందరు అనవసరంగా వస్తుంటారు. వారిని దండించే క్రమంలో ఏదైనా తప్పు జరిగి ఉండొచ్చు. ప్రకాశం జిల్లాలో రైతుపై పోలీసులు లాఠీ ఎత్తితే ఎస్పీ సారీ చెప్పారు. మానవీయ కోణంలోనే మేమున్నాం. ఆకతాయిలపై కఠినంగా వ్యవహరించాలి. అమాయకులకు అర్థమయ్యేలా వివరించాలి. ఇలాంటి సవాళ్లు మా పోలీసులకు కూడా మొదటిసారి. .

**సీఎం కూడా పోలీసుల తీరును తప్పుబట్టారు కదా?**

ముఖ్యమంత్రికి ప్రజలే దేవుళ్లు. వారిపై దెబ్బ పడితే కచ్చితంగా స్పందిస్తారు. అందుకే ఫోర్స్ మెంటాలిటీ వదిలేసి సర్వీస్ వైపు రమ్మని ఆదేశించాం. ఇకపై ఎవ్వరినీ కొట్టబోం. కేసులు నమోదు చేసి, బండి సీజ్ చేస్తాం.

**సోషల్ మీడియాతో వస్తున్న ఇబ్బందులేంటి?**

ఇష్టారాజ్యంగా పోస్టులు పెడుతున్నారు. వాళ్ల ఊహకు ఏది తోస్తే దాన్ని వైరల్ చేస్తున్నారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. మార్చి 24 నుంచి ఏప్రిల్ 8 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 48 సైబర్ కేసులు నమోదు చేశాం. సోషల్ మీడియాపై టెక్నాలజీ ద్వారా నిఘా పెట్టాం.

**లాక్‌డౌన్‌లో టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతోంది?**

కరోనా తీవ్రత మొదలయ్యాక వివిధ దేశాల నుంచి 22వేల మంది ఆంధ్రులు దేశంలోకి అడుగుపెట్టారు. వారందరి మొబైల్ నంబర్లను ఒక యాప్‌లోకి తీసుకున్నాం. ఏపీలో 21వేల మందికి గాను 11 మందికి మాత్రమే కరోనా పాజిటివ్ వచ్చింది. వారితో సంబంధాలున్న మరో పదిమందికి వైరస్ సోకింది. మిగతా వెయ్యిమంది ఇతర రాష్ట్రాల్లో ఉన్నారు. అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చాం. అందరినీ 14రోజులు హౌస్ క్వారంటైన్‌లో ఉంచాం. ఢిల్లీ వెళ్లొచ్చిన వారి నంబర్లు కూడా తీసుకున్నాం. వారు ఏ సెల్ టవర్ పరిధిలో ఉన్నారో తెలుసుకున్నాం. వారితో ఎక్కువ రోజులు గడిపినవారిని కూడా టెక్నాలజీ ద్వారా గుర్తించి క్వారంటైన్‌లో ఉంచాం.

**గ్రామ సరిహద్దుల్లో కంచెలతో గొడవల గురించి ఏమంటారు?**

గ్రామాల సరిహద్దుల్లో భయంతో కంచెలు వేశారు. నెల్లూరు, అనంతపురం అనుభవాలతో గ్రామ పెద్దల వద్దకు పోలీసులు వెళ్లి వివరిస్తున్నారు. ఇప్పుడు ఆ సమస్యలు లేవు.

**అనంతలో వైద్యులు వైరస్ బారిన పడ్డారు. పోలీసుల పరిస్థితి ఏమిటి?**

అదృష్టవశాత్తూ పోలీసులకు ఎవ్వరికీ కరోనా సోకలేదు. మేం చెప్పిన దానికన్నా మావాళ్లు ఎక్కువగా చేస్తున్నారు. తల్లి చనిపోయినా ఒక ఎస్ఐ డ్యూటీ వదిలి వెళ్లలేదు. చాలామంది పోలీసులు నెల జీతం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చారు.

**ప్రభుత్వ సహకారం ఎలా ఉంది?**

పోలీసులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోంది. ఇతర ప్రభుత్వ శాఖలతో పోలిస్తే మాకే కదా పూర్తి జీతం వచ్చింది. అంతెందుకు డీఏ కూడా విడుదల అయింది.

**లాక్‌డౌన్ పొడిగింపునకు ఎలా సన్నద్ధవుతున్నారు?**

వెనుకడుగు వేయబోం. ప్రజలు ఒకచోట గుమికూడే పరిస్థితి రాకుండా చూస్తాం.. ప్రజలు అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే. ఇంట్లో ఉండి మాకు సహకరిస్తే చాలు. ఒక ఆకతాయిని ఉపేక్షిస్తే ఆ ప్రాంతమంతా ఇబ్బంది పడుతుంది. తర్వాత జిల్లా, రాష్ట్రం, మొత్తం దేశానికే ప్రమాదం. ప్రజల కోసం పోలీసు, వైద్యులతో పాటు పదకొండు శాఖలు పనిచేస్తున్నాయి. ఏ అత్యవసరాలున్నా ఫోను చేయవచ్చు.

# లాక్‌డౌన్‌తో సత్ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

అధినేత చంద్రబాబు అధ్యక్షతన గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. 'లాక్‌డౌన్ మరికొన్ని రోజులు పొడిగిస్తే పేదలు, కూలీలకు ఇప్పటివరకూ ప్రభుత్వపరంగా ఇచ్చిన సాయం ఏ మూలకూ చాలదు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున వంతున రాష్ట్రప్రభుత్వం అందించాలి. రైతులను ఆదుకోవడానికి తక్షణం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. పండ్ల తోటలు, ఆక్వా, కూరగాయలు, ధాన్యం రైతులు.. చేతికొచ్చిన పంటలను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. ముందస్తు ఏర్పాట్లు చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి, మార్కెట్ జోక్యానికి పెట్టిన నిధికి చేసిన కేటాయింపులను తక్షణం వినియోగించాలి. కరోనా నిరోధానికి కృషి చేస్తున్న వైద్య, పారిశుధ్య, పోలీసు సిబ్బందికి ఏదైనా అయితే రూ.50 లక్షల చొప్పున పరిహారమివ్వాలి. అలాగే కరోనా వైరస్‌తో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారమివ్వాలి. లాక్‌డౌన్ వల్ల ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో తెలుగువారు చిక్కుకుపోయి ఇబ్బంది రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాట్లు చేయాలి' అని సమావేశం కోరింది. మన దేశానికి అవసరమైన వైద్య పరికరాలు మనమే సొంతంగా ఇక్కడ తయారు చేసుకోవాలన్న ముందు చూపుతో విశాఖలో మెడ్‌టెక్ జోన్‌ను ఏర్పాటు చేసినందుకు మాజీ సీఎం చంద్రబాబును పొలిట్‌బ్యూరో ఈ సందర్భంగా అభినందించింది. అనవసరపు ద్వేషంతో జగన్ ప్రభుత్వం ఈ పది నెలల్లో దానిని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని, టీడీపీ ప్రభుత్వం చేసిన కృషిని కొనసాగించి ఉంటే కరోనా విజృంభణ సమయంలో ఈ పార్క్ మొత్తం దేశ వైద్య అవసరాలు తీర్చడంలో కీలక పాత్ర వహించేదని అభిప్రాయపడింది.

### రాజకీయాలకు ఇదేనా సమయం?

కరోనా వ్యాప్తి.. రోజువారీ జీవన సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే జగన్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదని, ఈ సమయాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని పొలిట్‌బ్యూరో దుయ్యబట్టింది. 'యూనివర్సిటీల్లో పాలకమండళ్ల నియామకానికి ఇదేనా సమయం? వాటిని ఇష్టారాజ్యంగా.. రాజకీయ సిఫారసులతో నింపేశారు. తక్షణం వాటిని రద్దు చేయాలి. ఉద్యోగులు, పింఛనుదార్ల జీతాలు, పింఛన్లలో 50 శాతం కోతను రద్దు చేయాలి. తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తూ ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టడం సరైన పద్ధతి కాదు. భౌతిక దూరం పాటించాలని లాక్‌డౌన్ నిబంధనలు చెబుతుంటే వాటిని తోసిరాజని వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా సాగించి జేబులు నింపుకొంటున్నారు. హైకోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా రాజధాని గ్రామాల్లో సీఆర్‌డీఏ అధికారులు బీభత్సం సృష్టిస్తున్నారు. ఈ చర్యలను ఖండిస్తున్నాం' అని వివిధ తీర్మానాల్లో పొలిట్‌బ్యూరో పేర్కొంది. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్లు, చంద్రన్న బీమా కొనసాగించి ఉంటే ఈ సమయంలో పేదలకు ఎంతో ఊరటగా ఉండేదని పేర్కొంది. పేదలు, వలస కూలీలను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని, వైద్య సిబ్బందికి అన్నిచోట్లా తప్పనిసరిగా రక్షణ తొడుగులు, పరికరాలు సమకూర్చాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని సమావేశం నిర్ణయించింది. తెలంగాణ పార్టీ కార్యదర్శి కందిమళ్ల రఘునాథరావు ఆకస్మిక మృతికి సంతాపం తెలిపింది.

# కరోనా కల్లోలం

## 3 నుంచి 5% మాత్రమే పాజిటివ్

- 1.3 లక్షల నమూనాలను పరీక్షించాం
- అందులో 5,734 కేసులు పాజిటివ్
- లాక్‌డౌన్‌తో దీర్ఘకాలంలో ప్రజలకు ఇతర ఆరోగ్య సమస్యలు: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: కరోనాకు సంబంధించి గురువారం నాటికి నిర్వహించిన మొత్తం పరీక్షల్లో కేవలం 3%-5% నమూనాలు మాత్రమే పాజిటివ్‌గా వచ్చాయని ఐసీఎంఆర్ వెల్లడించింది. ఇప్పటివరకు 1.3 లక్షల నమూనాలను పరీక్షించామని, అందులో 5,734 కేసులు పాజిటివ్‌గా వచ్చాయని తెలిపింది. బుధవారం ఒక్కరోజే 13,413 నమూనాలను పరీక్షించినట్లు పేర్కొంది. కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మాట్లాడుతూ... 473 మంది కరోనా నుంచి కోలుకొని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారన్నారు. కాగా, లాక్‌డౌన్ వల్ల ప్రజలు వైరస్ బారి నుంచి బయటపడినప్పటికీ దీర్ఘకాలంలో ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఐసీఎంఆర్ అభిప్రాయపడింది. దీర్ఘకాలిక లాక్‌డౌన్ వల్ల ప్రజల్లో మానసిక ఒత్తిడి పెరుగుతుందని ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌లో పేర్కొంది.

## ధైర్యం, విశ్వాసంతోనే కరోనాపై విజయం

**కోలుకున్న 103 ఏళ్ల బామ్మ సలహా**



రోమ్, ఏప్రిల్ 9: ధైర్యం, విశ్వాసంతోనే కరోనా మహమ్మారిపై విజయం సాధ్యమని 103 ఏళ్ల బామ్మ నిరూపించింది. కొవిడ్-19 కారణంగా మృత్యు ముఖందాకా వెళ్లిన ఇటలీకి చెందిన ఈ బామ్మ ఆత్మ విశ్వాసంతో కోలుకుంది. జ్వరంతో వారం రోజుల పాటు మంచానికే పరిమితమైన అడా జానుస్సో అనే వృద్ధురాలు ఎలాంటి ఆహారం తీసుకోలేకపోయింది. దీంతో డాక్టర్లు ఆమెకు ద్రవాహారం అందించారు. అయితే, తరచూ మగతలోకి వెళ్లిపోయే ఆమె ద్రవాహారాన్ని సైతం సరిగ్గా తీసుకోలేకపోవడంతో తాము ఆశలు వదులుకున్నామని వృద్ధురాలి కుటుంబ వైద్యుడు తెలిపారు. కానీ, వారం రోజుల తర్వాత అకస్మాత్తుగా కళ్లు తెరిచిన జానుస్సో బెడ్‌పై కూర్చుందని, కాసేపట్లోనే కిందికి దిగి నడవడంతో అందరూ ఆశ్చర్యపోయారన్నారు. 'నీవు ఎలా కోలుకున్నావు' అని వైద్యుడు ప్రశ్నించగా.. ధైర్యం, బలం, విశ్వాసం వల్లేనని వృద్ధురాలు సమాధానమిచ్చింది.



కరోనా పోరులో కేంద్ర మంత్రి కుటుంబం కూడా పాలు పంచుకుంటోంది. ఇంధన శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భార్య మృదుల, కూతురు నైమిశా.. పేదల కోసం వారి ఇంట్లోనే మాస్కులు తయారు చేశారు. కుట్టు మెషీన్‌పై వారు మాస్కులు కుడుతున్న ఫొటోను మంత్రి తన ట్విటర్ ఖాతాలో పోస్టు చేశారు.

## బ్రిటన్ బెంబేలు!

**ఒక్కరోజే 938 మరణాలు..**

**స్పెయిన్, ఇటలీని మించి ఇంగ్లండ్‌లో మృత్యుఘోష**

రోమ్, ఏప్రిల్ 9 : రెండు నెలల పసిబిడ్డను కాపాడుకొని.. కరోనాపై పోరులో తన విజయంపై ఆశలను ఇటలీ సజీవం చేసుకొంది. ముందు తల్లిలో ఫ్లూ లక్షణాలు కనిపించడంతో రోమ్‌లోని బారీలో ఉన్న ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షలు చేసినప్పుడు తల్లితోపాటు ఆమె పసికందుకూ కరోనా పాజిటివ్ తేలింది. గత నెల 18వ తేదీ నుంచి ఐసోలేషన్‌లో ఉన్న వీరిద్దరూ కోలుకొన్నారనే చల్లని కబురును గురువారం ప్రభుత్వం వినిపించింది. 18,279 మరణాలతో ప్రపంచంలోనే అత్యంత విషాదాన్ని మోస్తున్న ఇటలీకేకాదు, మొత్తం యూరప్‌కి ఈ వార్త గొప్ప ఊరటే! గురువారం నాటికి ప్రపంచ వ్యాప్తంగా 93,575 మరణాలు చోటుచేసుకొంటే, అందులో యూరప్‌లోనే 62,402 మంది చనిపోయారు. మొత్తం 15 లక్షల పాజిటివ్‌లు తేలితే, ఒక్క ఈ దేశాల్లోనే 7.87 లక్షల మంది చికిత్స పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నేటిదాకా 3.12 లక్షలమంది ప్రాణాలతో బయటపడ్డారు. బ్రిటన్‌లో ఇప్పటికి 7,097 మంది చనిపోగా, 60,733 పాజిటివ్ కేసులు తేలాయి. అమెరికా తరువాత అంతటి తీవ్రతను మరణాల రేటులో ఇప్పుడు బ్రిటనే చవిచూస్తోంది. 24గంటల్లో ఇక్కడ 938 మరణాలు సంభవించాయి. కరోనా సోకిన ప్రధాని బోరిస్ జాన్సన్ ఆస్పత్రిలో కోలుకొంటున్నారు. ఫ్రాన్స్‌లో 1.12 లక్షల కేసులు తేలగా, 10,869 మంది మరణించారు. ఒక్కరోజులో 541 మంది ఆస్పత్రుల్లో మృత్యువాత పడ్డారు. స్పెయిన్‌లో గురువారం 728 మరణాలు చోటుచేసుకోగా, బుధవారం (757)తో పోల్చుకొని వైద్యులు, ప్రభుత్వం కొంత ఊరట పొందారు. కొత్త కేసులు, మరణాల రేటూ తగ్గాయని ప్రకటించారు. మరో రెండువారాలపాటు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడానికి అనుమతించాలని పార్లమెంటును ప్రధాని పెడ్రో కోరారు. ఆస్ట్రేలియాలోకి కరోనాను మోసుకొచ్చిన ఓడ మరో పది రోజులు రేవులోనే ఉంటుందని పోలీసులు ప్రకటించారు. ఈ ఓడ గత నెల 19వ తేదీన 2,700 మందితో సిడ్నీ రేవుకు చేరుకొన్ననాటినుంచే..ఈ దేశంలో కరోనా కేసులు పెరిగాయి. లాక్‌డౌన్ తొలగిపోయిన చైనాలో గురువారం 2 మరణాలు నమోదయ్యాయి. 63 కొత్త కేసుల తో 1,100 మందికి ఇక్కడ పాజిటివ్ తేలింది. విదేశాల నుంచి వస్తున్నవారిద్వారానే రెండో విడత కేసులు పెరుగుతున్నాయ ని ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్‌లో కొత్తగా 1,634 కేసులు బయటపడ్డాయి. ఒక్కరోజులోనే 117 మరణాలతో మృతులు 4,100కు చేరారు. పాక్‌లో నమోదైన 248 కేసులతో 4,322కు పాజిటివ్‌లు చేరాయి. ఒకేరోజు 287 కేసులు బయటపడటంతో సింగపూర్ అప్రమత్తమైంది. బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ గుమిగూడటానికి లేదంటూ ఆదేశాలు చేసింది.

# అమెరికాలో రోజుకు 2 వేల మృతులు

**యూరప్‌లోని ఏ దేశంలోనూ ఒకే రోజు వెయ్యి దాటని మహమ్మారి మరణాలు**

- 16,074 మృతులు..4.5 లక్షల కేసులు
- ఇందులో సగంపైగా న్యూయార్క్‌లోనే



వాషింగ్టన్, ఏప్రిల్ 9 : కరోనా అంటే గుర్తొచ్చేవి స్పెయిన్, ఇటలీ. పదివేల మరణాలు తొలిగా చోటుచేసుకొన్న యూరప్ దేశాలివి. ఇప్పుడు ఈ లెక్కలనూ అమెరికాలో కరోనా విలయం దాటేస్తోంది. యూరప్‌లోని ఏ దేశంలోనూ ఒకే రోజు మరణాలు వెయ్యి దాటలేదు. కానీ, అమెరికాలో దాదాపు రెండు వేల మంది చొప్పున వరుసగా రెండురోజులు చనిపోవడంతో అక్కడ మరణాలు 16,074కు చేరుకొన్నాయి. దీంతో, 15,238 మరణాలు చోటుచేసుకొన్న స్పెయిన్‌ను మించిన విషాదం అమెరికాలో అలుముకొంది. అందులోనూ న్యూయార్క్‌లో శవాలు గుట్టలు పడుతున్నాయి. 731 మంది మృతితో ఒకరోజు అత్యధిక మరణాలు సోమవారం చోటుచేసుకోగా, బుధవారం సంభవించిన 779 మరణాలు ఆ పాత లెక్కలను తుడిపేశాయి. కుప్పలుతెప్పలుగా వచ్చిపడిన పాజిటివ్ కేసులను చూడటానికి ఆస్పత్రులు చాలడం లేదు. 24 గంటలూ పోరాడుతున్న వైద్యులకు వ్యక్తిగత రక్షణ పరికరాలను ప్రభుత్వం సరిపడా అందించలేకపోతోంది. వందల్లో చనిపోతున్న పౌరులను పూడ్చడానికి న్యూయార్క్, న్యూజెర్సీ లాంటి హాట్‌స్పాట్లలో సమాధి స్థలాలు సరిపోవడం లేదు. అయితే, ప్రభుత్వం కొంత ఆలస్యంగానైనా లాక్‌డౌన్ అమలుచేస్తూ, భౌతిక దూరాన్ని తప్పనిసరి చేయడం ఒక్కటే ఇంతటి విపత్కర వాతావరణంలోనూ ఆ దేశ పౌరులకు కొంత కవచంలా నిలిచింది. ఇదే మాట న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమో స్పష్టం చేశారు. ఈ చర్యల వల్లే కేసులు తగ్గుతున్నాయని, ఆస్పత్రుల్లో కొత్తగా చేరేవారు కూడా తగ్గిపోయారని ఆయన వెల్లడించారు. ఇదే పరిస్థితి రెండు వారాలపాటు కొనసాగితే ఆరోగ్య వ్యవస్థను స్థిరీకరించగలుగుతామని, ఇంతటి విపత్కర వాతావరణంలోనూ కరోనా కేంద్రాలుగా మార్చిన ఆస్పత్రులను కనిష్ఠస్థాయికి తీసుకురాగలుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికి ఈ సిటీలో 6,268మంది కరోనాబారినపడి చనిపోయారు. కేసులు నాలుగు లక్షలు దాటిపోయాయి. ఇళ్లలోనే చనిపోతున్నవారినీ కలుపుకొంటే మరణాల రేటు మరింత ఎక్కువగా ఉండొచ్చునని న్యూయార్క్ మేయర్ బిల్ డె బ్లాసియో ఆందోళన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌వాసుల్లో లాటిన్ అమెరికా, ఆఫ్రికా సంతతివారే ఎక్కువగా చనిపోతున్నారని ప్రభుత్వ ప్రాథమిక నివేదిక తెలిపింది. చేతులు కలిపి కరచాలనం చేసే అలవాటును మునుముందు మానేయాలని అంటువ్యాధుల సంస్థ అధినేత ఆంటోనీ ఫౌసీ సూచించారు. దీని వల్ల వైరస్ వ్యాప్తి తీవ్రత తగ్గడమే కాదు, కరోనా పెద్దఎత్తున సోకుతున్న ఘటనలూ తగ్గుముఖం పడతాయని ఆయన వివరించారు. కాగా, కరోనా విషయంలో చైనాను ప్రపంచ ఆరోగ్య సంస్థ వెనుకేసుకువస్తున్నదంటూ మరోసారి అధ్యక్షుడు ట్రంప్ విరుచుకుపడ్డారు. ఈ వ్యవహారాన్ని డబ్ల్యూహెచ్‌వో రాజకీయమయం చేస్తోందని దుయ్యబట్టారు. కరోనా హెచ్చరికల్లో డబ్ల్యూహెచ్‌వో చేసిన జాప్యమే ప్రపంచాన్ని ప్రమాదంలో పడేసిందన్నారు. డబ్ల్యూహెచ్‌వోకు గత ఏడాది అమెరికా 450 మిలియన్ డాలర్ల నిధులు సమకూర్చితే, చైనా కేవలం 42 మిలియన్ డాలర్లే కేటాయించిందని తెలిపారు. డబ్బులు అమెరికా దగ్గర తీసుకొని, మద్దతు చైనాకు ఇస్తున్నారని ఆగ్రహించారు. ఈ హెచ్చరికల దరిమిలా డబ్ల్యూహెచ్‌వో 'వైరస్‌పై పోరులో ఏకం అవుదాం' అంటూ ప్రపంచదేశాలకు బుధవారం పిలుపునిచ్చింది.

### ఇదేం పాడు నాకుడు!

ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది ప్లేట్లు, చెంచాలు నాకినట్టు వచ్చిన వార్తలు మీడియాలో కలకలం రేపి, ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలింది. ఈ వార్తల గందరగోళం తొలగిపోకముందే అమెరికాలో ఇలాంటి పనే చేస్తూ ఓ మహిళ పోలీసులకు దొరికిపోయింది. కాలిఫోర్నియాలో జెన్నీఫర్ వాకర్ అనే యువతి సూపర్ మార్కెట్‌లోకి చొరబడి అక్కడి వంటింటి సరుకులు, అరల్లో పేర్చిన నగలను నాకడం మొదలుపెట్టింది. నిర్వాహకులు గమనించి పోలీసులను పిలిచేసరికే 1800 డాలర్ల విలువైన వస్తువులను ఆమె మలినం చేసింది.

### ఐరోపాలో తగ్గుతున్న కేసులు!

న్యూయార్క్, ఏప్రిల్ 9: కరోనా మహమ్మారి ఐరోపా దేశాల్లో తగ్గుముఖం పడుతోంది! ప్రస్తుతం ఇటలీ, స్పెయిన్‌లో కొత్తగా కేసుల నమోదు తగ్గినట్లు గణాంకాలు రుజువు చేస్తున్నాయి. వాస్తవానికి ఈ రెండు దేశాల్లో ఈ నెలారంభంలో కరోనా తీవ్ర ప్రభావం చూపింది. ఫలితంగా ఉభయ దేశాల్లో 30వేలకుపైగా మరణాలు చోటుచేసుకుంటున్నాయి. కానీ, ఈ వారంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. కొత్తగా కేసులు, మరణాలు గణనీయంగా తగ్గాయి.

## వాస్తవ పరిస్థితి మదింపునకు.. 9 రాష్ట్రాలకు కేంద్ర బృందాలు

- సీఎంలతో ప్రధాని చర్చ వేళకు నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: లాక్‌డౌన్ ప్రకటించాక రాష్ట్రాల్లో -ముఖ్యంగా రోగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని స్వయంగా మదింపు వేయడానికి కేంద్రం తొమ్మిది రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపింది. కరోనా కేసులు తక్కువగా ఉన్న బిహార్‌తో పాటు, కాస్త ఎక్కువగానే నమోదైన తమిళనాడు సహా దేశంలోని నాలుగుప్రాంతాల్లోని రాష్ట్రాల్లో ఈ మదింపు జరుగుతుంది. ప్రధాని శనివారం- 11వ తేదీన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తాజా పరిస్థితులపై చర్చించనున్నారు. కేంద్ర బృందాలు ఇచ్చే నివేదిక ప్రాతిపదికగానే 14వ తేదీ తరువాత లాక్‌డౌన్ ఎంతమేర పొడిగించాలి, ఎక్కడ సడలించాలి.. అన్నది నిర్ణయిస్తారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### కొవిడ్‌పై పోరులో గెలుస్తాం: మోదీ

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 9: కొవిడ్-19కు వ్యతిరేకంగా మానవాళి చేస్తున్న పోరాటానికి తనవంతుగా భారత్ చేయగలిగినదంతా చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కరోనా చికిత్సకు ఉపయోగపడే హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతులపై నిషేధం ఎత్తివేసినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై మోదీ స్పందించారు. "ప్రపంచం మొత్తాన్ని కరోనా మహమ్మారి ఆవరించింది. కరోనాను మనం కలిసి జయిస్తాం" అని మోదీ ట్విటర్ ద్వారా బదులిచ్చారు. హైడ్రోక్సీక్లోరోక్విన్ ఔషధం తయారీకి అవసరమయ్యే ముడి పదార్థాలు తమ దేశానికి పంపించేందుకు అంగీకరించిన భారత ప్రధాని మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బొల్సోనారో ధన్యవాదాలు తెలిపారు.

### ఇటలీలో 100 మంది వైద్యులు బలి

రోమ్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: కరోనాపై పోరాటంలో పెద్దసంఖ్యలో ఇటాలియన్ వైద్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వైరస్ తమ దేశంలోకి ప్రవేశించిన ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ వందమంది డాక్టర్లు మరణించారని ఇటలీ ఆరోగ్య సంఘం ఎఫ్ఎన్ఓఎంసీఈఓ గురువారం ప్రకటించింది.

### కరోనాతో ఎంపీలో వైద్యుడి మృతి

ఇండోర్, ఏప్రిల్ 9: కరోనా వైరస్‌తో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ వైద్యుడు (62) చనిపోయాడు. దేశంలో కరోనాతో ప్రాణాలు కోల్పోయిన మొదటి వైద్యుడు ఆయన. ఇండోర్‌లో ఆ డాక్టర్‌కు ఓ క్లినిక్ ఉంది. రోజూ 150 పైగా రోగులకు ఆయన ట్రీట్‌మెంట్ ఇచ్చేవారు. వారం క్రితమే ఆయనలో కరోనా లక్షణాలు కనిపించాయి. మూడ్రోజుల క్రితమే పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది. కొద్ది రోజుల తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి దిగజారిందని, దీంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ వైద్యుడిని ఆ డాక్టర్ సంప్రదించారని ఆ స్నేహితుడు తెలిపారు. కరోనా లక్షణాలు కనిపించినా ఆయన స్వయంగా చికిత్స తీసుకున్నారని చెప్పారు.

### దుబాయ్‌లో మద్యం హోం డెలివరీ!

దుబాయ్, ఏప్రిల్ 9: ఎడారి నగరం దుబాయ్ పర్యాటకానికి ప్రసిద్ధి కావడంతో.. ఇక్కడ ఆల్కహాల్ వినియోగం ఎక్కువ. ఎప్పుడూ కస్టమర్లతో కళకళలాడుతూ ఉండే బార్‌లు, రెస్టారెంట్లు లాక్‌డౌన్ కారణంగా వెలవెలబోతున్నాయి. పంపిణీ దారులతోపాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం కూడా పడిపోయింది. ఈ నేపథ్యంలో హోం డెలివరీకి అవకాశం కల్పిస్తూ రెండు ప్రముఖ పంపిణీ సంస్థలకు దుబాయ్ ప్రభుత్వం అనుమతించింది.

### టీచర్లకు లాక్‌డౌన్ నైట్‌డ్యూటీ!

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో నివాసముండే ప్రభుత్వ ఉపాధ్యాయులకు పగటిపూటతోపాటు రాత్రి కూడా 'లాక్‌డౌన్' డ్యూటీలు వేశారు. వారిని పోలీసులకు తోడుగా బందోబస్తు విధులకు నియమించారు. ఉపాధ్యాయులు ఉదయం ఆరు నుంచి రాత్రి ఏడు గంటల వరకు విధులు నిర్వహించాలని ఇంతకుముందు ఆదేశించారు. కాగా.. బుధవారం నుంచి వారు రాత్రిపూట కూడా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులు స్పష్టంచేశారు. దీంతో నగరంలో పలుచోట్ల టీచర్లు బుధవారం రాత్రి డ్యూటీ చేశారు. అయితే ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకురావాలని ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయి.

### తెలంగాణలో కరోనా కేసులు తగ్గుముఖం

హైదరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కరోనా ఉధృతి తగ్గుతోందా.. కొత్త నమోదవుతున్న కేసుల సంఖ్య తగ్గుతుండటమే ఇందుకు నిదర్శనమా.. అంటే అవుననే అంటున్నాయి వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు. తెలంగాణలో గురువారం కొత్తగా 18 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒకరు చనిపోయారు. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 471కి పెరిగింది. ఇందులో ఇప్పటి వరకు 45 మంది డిశ్చార్జ్ అయ్యారు. మొత్తం 12 మంది చనిపోయారు. రాష్ట్రంలో వైరస్ ప్రభావం తగ్గుముఖం పడుతోంది అనుకున్న సమయంలోనే మర్కజ్ కారణంగా కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ఒక రోజు ఏకంగా 75 కేసులు నమోదయ్యాయి. బుధవారం కూడా 49 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే వారం రోజులుగా కేసుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. గురువారం 18 కేసులే నమోదు కావడం ఉపశమనాన్ని కలిగిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు విదేశాల నుంచి వచ్చిన వారికి సంబంధించి 50 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. అనుమానితుల క్వారంటైన్ కూడా పూర్తయింది. రాష్ట్రంలో అత్యధికంగా హైదరాబాద్‌లో 167 కేసులు, నిజామాబాద్‌లో 47, రంగారెడ్డి 27, వరంగల్ అర్బన్ 23, మేడ్చల్‌లో 21 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో కరోనా వైరస్ కమ్యూనిటీ ట్రాన్స్‌ఫర్ జరగలేదని ప్రభుత్వం తెలిపింది.

## 24 గంటల్లో 591 కేసులు



విజయవాడలో పీపీఈ సూట్ల తయారీలో కార్మికులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: దేశంలో కరోనా కేసులు 5,865కు పెరిగాయి. మరణాల సంఖ్య 169కు చేరింది. 24 గంటల్లో కొత్తగా 591 కేసులు, 20 మరణాలు నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు 473 మంది కోలుకున్నారని తెలిపింది. అయితే.. వివిధ రాష్ట్రాలు వెల్లడించిన సమాచారం ప్రకారం గురువారం రాత్రికి పాజిటివ్ కేసులు 6,624కు చేరాయి. మృతుల సంఖ్య 225కు పెరిగింది. "పర్సనల్ ప్రొటెక్టివ్ ఇక్విప్‌మెంట్ (పీపీఈ) సరఫరాకు 20 మంది దేశీయ తయారీదారులు ముందుకొచ్చారు. 1.7 కోట్ల పీపీఈల కోసం ఆర్డర్ ఇవ్వగా వాటి సరఫరా మొదలైంది. 49 వేల వెంటిలేటర్ల కోసం ఆర్డర్ ఇచ్చాం" అని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ.15 వేల కోట్ల అత్యవసర నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది. కాగా.. అంటువ్యాధుల నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తులకు రెండేళ్ల జైలు శిక్ష విధించేలా ఒడిసా ప్రభుత్వం ఓ ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ నెల 30 వరకు లాక్‌డౌన్ పొడిగించాలని నిర్ణయించింది. అప్పటి వరకు రైళ్లు, విమానాలను నడపవద్దని కేంద్రాన్ని కోరింది. ఆ రాష్ట్రంలో ఇప్పటి వరకు 44 కరోనా కేసులు నమోదయ్యాయి. హరియాణాలో కరోనా బాధితులకు సేవలందిస్తున్న వైద్యులు, ఉద్యోగులకు రెట్టింపు వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. కాగా, ఢిల్లీ సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా వైద్యులపై దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

### కర్ణాటకలో 197కు చేరిన కేసులు

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కరోనా విజృంభణ కొనసాగుతోంది. రాష్ట్రంలో గురువారం మరో 16 మందికి కొవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 197కు చేరింది.

### తమిళనాడులో ఒకే రోజు 96 మందికి పాజిటివ్

చెన్నై, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాట ఒకేరోజు 96 మందికి కొవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో కరోనా కేసుల సంఖ్య 834కు చేరింది. ఇప్పటి వరకు 27 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ఇక కొత్తగా నమోదైన 96 కేసుల్లో 84 మంది ఢిల్లీ మర్కజ్‌లో పాల్గొన్నవారు, వారితో సంబంధాలున్న ఉన్నవారిగా గుర్తించారు

## సౌదీలో తెలంగాణ వాసికి తుమ్ము కష్టాలు

**గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి:** సౌదీ అరేబియాలో ఉంటున్న తెలంగాణ ప్రవాసీయుడు ఒకరికి కరోనా పాజిటివ్ అని తేలింది. అతడి వల్ల వైరస్ వ్యాప్తి చెంది.. ఇతరులకు ప్రాణ నష్టం తప్పదని తేలితే ఆ ప్రవాసీయుడిపై హత్య కేసు నమోదయ్యే అవకాశం ఉంది. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు సౌదీ అరేబియాలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. సెలవులపై ఇ టీవల స్వదేశానికి వెళ్లి.. కొద్దిరోజుల తర్వాత సౌదీకి వచ్చాడు. ఒకరోజు నిత్యావసరాల కోసం ఓ ప్రముఖ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ పదేపదే తుమ్ముతూ.. దగ్గుతూ కనిపించిన ఆ ప్రవాసీయుడిని.. అరబ్బు కుటుంబానికి చెందిన ఓ బాలిక గమనించింది. అతను తుమ్మిన సమయంలో తుంపర్లు షాపింగ్ ట్రాలీపై పడటం, ఆ ట్రాలీ హ్యాండిల్‌ను అతడు పట్టుకోవడం.. ఇదంతా చూసిన ఆ బాలిక అక్కడే ఉన్న తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పింది. వారి సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు.. వైద్య పరీక్షల నిమిత్తం ఆ ప్రవాసీయుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షల్లో అతడికి కరోనా పాజిటివ్ అని తేలింది. వెంటనే మునిసిపల్ అధికారులు సూపర్ మార్కెట్‌లో పూర్తిగా క్రిమి సంహారక మందును స్ప్రే చేశారు. ప్రవాసీయుడు తాకిన ర్యాకుల్లోని రూ. 35 లక్షల విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. ఆ ప్రవాసీయుడితో కలిసి క్యాంపులో ఉంటున్న మరో 47 మంది విదేశీ కార్మికులను క్వారంటైన్‌కు తరలించారు. వారిలో 44 మందికి నెగెటివ్ అని తేలడంతో ఈనెల 8వ తేదీన డిశ్చార్జి చేశారు. మరో ముగ్గురిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఉద్దేశపూర్వకంగా కరోనా వైరస్‌ను వ్యాప్తి చేసి.. ఇతరులకు ప్రాణ నష్టం కలిగిస్తున్నాడని తేలితే.. ఆ ప్రవాసీయుడిపై హత్య కేసు పెడతామని అధికారులు తెలిపారు. సెలవుల సమయంలో స్వదేశంలోని జనగాం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో తిరిగివచ్చిన ఆ యువకుడికి.. వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాతే కరోనా ఉన్నట్లు తెలిసిందని అతని మిత్రులు తెలిపారు.

### చైనా మాస్కులు సురక్షితం కాదు: ఫిన్లాండ్

హెల్సింకి, ఏప్రిల్ 9: కరోనా వైరస్ బాధితులకు చికిత్స అందించే వైద్య సిబ్బందికి ఇచ్చేందుకు చైనా నుంచి తెప్పించుకున్న మాస్కులు సురక్షితంగా లేవని ఫిన్లాండ్ తెలిపింది. ఆ మాస్కులు నిర్ధీత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని పేర్కొంది. చైనాలోని గ్వాంగ్‌జౌ నుంచి వచ్చిన 2 లక్షల సర్జికల్ మాస్కులు, 2.3 లక్షల రెస్పిరేటర్ మాస్కులను వాడే ముందు ఒకసారి పరీక్షించాలని ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి ఐనో కైసా పెకోనెన్ మంగళవారం ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజే ఫిన్లాండ్ అధికారులు ఈ మాస్కులు రక్షణ ప్రమాణాలను అందుకోలేదని ప్రకటించారు. ఇది తమను నిరుత్సాహానికి గురిచేసిందని చెప్పారు.

### రుమటాయిడ్ బాధితులకు ఇబ్బందులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైడ్రాక్సీక్లోరోక్విన్ కరోనాపై ప్రభావం చూపుతుందన్న వార్తల నేపథ్యంలో చాలా మంది అవసరం లేకున్నా ఈ మాత్రలను కొని ఇంట్లో దాచుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో వీటికి తీవ్ర కొరత ఏర్పడింది. ఏ మెడికల్ షాపుకు వెళ్లి హైడ్రాక్సీక్లోరోక్విన్ అని అడిగినా 'లేవు' అనే సమాధానమే వస్తోంది. సాధారణంగా మలేరియా, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడేవారు హైడ్రాక్సీక్లోరోక్విన్ మాత్రలను వేసుకోవాల్సిందిగా వైద్యులు సూచిస్తారు. మలేరియాకు ఇతరత్రా మందులు ఉన్నప్పటికీ రుమటాయిడ్‌తో బాధపడేవారు మాత్రం ఈ మాత్రలను తప్పనిసరిగా వాడాల్సిందే. అయితే ప్రస్తుతం మాత్రలు దొరక్క వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### దాచుకున్న 10 లక్షలు పీఎం కేర్స్‌కు



డెహ్రాడూన్, ఏప్రిల్ 9: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాకు చెందిన దేవకీ భండారీ (60) తాను దాచుకున్న రూ.10 లక్షల మొత్తాన్నీ పీఎం కేర్స్‌కు విరాళంగా ఇచ్చేశారు. బుధవారం నాడు అధికారులకు ఈ మేరకు చెక్కును ఆమె అందజేశారు. ఆమె ఔదార్యానికి సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ చలించిపోయారు. దాతృత్వానికి ఆమె ప్రతీకగా నిలిచారని కొనియాడారు. దేవకీ భర్త కొన్నాళ్ల క్రితం చనిపోయారు. వారికి పిల్లలు లేరు. అలాగే మిజోరంలోని ఐజ్వాల్‌లో కూడా 95 ఏళ్ల వితంతువు ఎంఘాక్లియానీ తన ఒక నెల పింఛన్‌ను (రూ.14,500) సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళమిచ్చారు.

## అన్నదాతలకు ఊరట కల్పిద్దాం

- లాక్‌డౌన్‌లో రాష్ట్రాలకు అండగా ఉంటాం: తోమర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'కరోనా కట్టడి కోసం అమలు చేస్తున్న లాక్‌డౌన్ నేపథ్యంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కోవడంలో రాష్ట్రాలకు అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. అన్నదాతలకు ఊరట కలిగించే చర్యలన్నీ తీసుకుంటాం' అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ భరోసా ఇచ్చారు. ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాల వ్యవసాయ శాఖల మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కరోనా విజృంభిస్తున్న తరుణంలో వ్యవసాయ పనులు కొనసాగించడంలో రాష్ట్రాలు చూపుతున్న చొరవను ప్రశంసించారు. వచ్చే ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలన్నారు. ఇందుకోసం 16న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**లాక్‌డౌన్‌లో తీసుకోవాల్సిన చర్యలు:** విత్తనాలు వేయడం, కోతలు, ఉత్పత్తుల విక్రయాలతో సహా వ్యవసాయ కార్యకలాపాలపై క్షేత్రస్థాయి సంస్థలకు అవగాహన కల్పించడం. మినహాయింపు కార్యకలాపాలకు సంబంధించిన సంస్థల సిబ్బంది, యంత్రాలు, సామగ్రి, రవాణా తదితరాలకు సత్వరమే అనుమతులివ్వడం. నిత్యావసర సరుకుల పంపిణీకి జాతీయ అధీకృత కంపెనీలకు అనుమతి పత్రాలు, వాటి సిబ్బందికి ప్రాంతీయ పాసులివ్వడం.

## 15 నుంచే రైళ్లు?

**స్లీపర్ క్లాస్ కోచ్‌లు మాత్రమే**

**రైలెక్కాలంటే 4గంటల ముందే స్టేషన్‌కు**

విశాఖపట్నం, ఏప్రిల్ 9: ఎట్టకేలకు రైలు ప్రయాణాలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది!. లాక్‌డౌన్ ఈనెల 14 తర్వాత కూడా కొనసాగుతుందా... లేదా అన్నదానిపై కేంద్రం స్పష్టం చేయనప్పటికీ.. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైళ్ల పునరుద్ధరణకు రైల్వేబోర్డు సమాయత్తమవుతోంది. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్మన్ గురువారం ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి 15నుంచి రైళ్లను నడిపేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. రెగ్యులర్ రైళ్లుగా కాకుండా కేవలం ప్రత్యేక సర్వీసుల రూపంలో కొన్ని నడపాలని నిర్ణయించినట్టు సమాచారం. కరోనా నియంత్రణ చర్యలు చేపడుతూనే పలు జాగ్రత్తలతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా రైల్వేశాఖ ప్రణాళిక రూపొందించింది.

### రైలెక్కాలంటే ఇవీ నిబంధనలు

- స్లీపర్ క్లాస్(నాన్ ఏసీ) కోచ్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. నాన్‌స్టాప్ పద్ధతిలో (ఒకటి లేదా రెండు స్టేషన్ల మాత్రమే హాల్ట్) బయలుదేరే స్టేషన్ నుంచి గమ్యానికి చేరే స్టేషన్ వరకు నడుపుతారు.
- ప్రయాణానికి 12గంటల ముందు ప్రయాణికుడు ఆరోగ్య స్థితికి సంబంధించిన సమాచారాన్ని రైల్వే అధికారులకు తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రయాణించే సమయంలో కరోనా లక్షణాలు బయటపడితే, సదరు ప్రయాణికుడిని మధ్యలో ఏదైనా స్టేషన్‌లో దించి వేసి, టికెట్ సొమ్మును పూర్తిగా వాపసు చేస్తారు.
- బెర్తు ఖరారైనవారికి మాత్రమే ప్రయాణం చేయడానికి అనుమతిస్తారు. సీనియర్ సిటిజన్లను అనుమతించరు.
- ప్రయాణికులు 4గంటల ముందు స్టేషన్‌కు చేరుకోవాలి. ప్రత్యేక మార్గం ద్వారా భౌతిక దూరం పాటిస్తూ ప్రధాన ప్రవేశ ద్వారం వద్దకు చేరాలి. థర్మల్ స్క్రీనింగ్ పూర్తయిన తర్వాత కోచ్‌ల్లో ప్రవేశించాలి. ప్లాట్‌ఫాం టికెట్ల విక్రయాలు ఉండవు.
- థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు ముగిసిన తర్వాత గ్లౌజులు, మాస్కులకు, నామమాత్రపు రుసుం వసూలుచేస్తారు.
- కోచ్‌లోని క్యాబిన్‌కు ఇద్దరు మాత్రమే ప్రయాణించే విధంగా బెర్తులు కేటాయిస్తారు. సైడ్ బెర్తులను ఖాళీగా వుంచుతారు. రైళ్లలో క్యాటరింగ్ సర్వీసు ఉండదు.

కృతజ్ఞతలు
మా తల్లిగారు అయిన వెంపటి జయమ్మ W/o (Late వెంపటి సుబ్బరామనాయుడు) గారు
24.03.2020 మంగళవారం స్వర్గస్తులైనారు.09.04.2020 తేది గురువారం కర్మక్రియలు జరిపించడమైనది.

మేము తెలియజేసినప్పటికీ ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడం వల్ల వ్యక్తిగతంగా రాలేకపోయిన వారందరికీ ఫోన్ ద్వారా సానుభూతి తెలియజేసిన బంధు,మిత్రులకు మా ధన్యవాదములు.ఇందు మూలముగా తెలియజేస్తున్నాము.
మా కుటుంబానికి సానుభూతి తెలిపిన మాన్యులు Sri NARA CHANDRABABU NAIDU (Ex Chief Minister) గారికి,
మా ధన్యవాదములు మరియు మాకు సానుభూతి తెలిపిన నా సోదరసమానులు Dr P.V. RAMANA (Chairman ITM Group Of Educational institutions And Chancellor Of ITM Universities)
R.NANDA KUMAR (Chairman Of netam sugars LTD) గారికి మా ధన్యవాదములు.
కీ॥శే॥ వెంపటి జయమ్మ గారు
1936 TO 2020
ఇట్లు వెంపటి మాదవనాయుడు
ANDAMAN AND NICOBAR STATE TDP INCHARGE
మరియు కుటుంబ సభ్యులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com